www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

శనివారం | 28-6-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 23 సంచిక (Issue) : 90 | శ్రీ విశ్వావసునామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మరుతువు, ఆషాఢమాసం, శుక్ల పక్షం; తిథి: తదియ ఉ.9.54 తదుపరి చవితి; నక్షత్రం: పుష్యమి ఉ.6.36 తదుపరి ఆశ్లేష; వర్జ్యం: రా.7.22-8.58; దుర్ముహూర్తం: ఉ.5.47-7.31; అమృతఘడియలు: తె.4.58-6.34; రాహుకాలం: ఉ.9.00-10.30; సూర్యోదయం: 5.47; సూర్యాస్తమయం: 6.49 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



ఆంధ్రజ్యోతి
బిజినెస్
వరంగల్ ● శనివారం 28 జూన్ 2025

బంగారం ఈటీఎఫ్‌ల్లో యూలిప్స్ పెట్టుబడులు!

ఐఆర్‌డీఏఐ అనుమతి కోరిన బీమా సంస్థలు



న్యూఢిల్లీ: పసిడి ధరల జోరు జీవిత బీమా సంస్థలను విశేషంగా ఆకర్షిస్తోంది. బంగారం ధర గత పాతికేళ్లలో ఏకంగా 20 రెట్లు పెరిగింది. గత ఏడాది కాలంగా చూసినా బంగారం ఈక్విటీ ట్రేడెడ్ ఫండ్స్ (ఈటీఎఫ్) ల్లోనూ మదుపరులు సగటున 30 శాతం రాబడులు కళ్లజూశారు. దీంతో తమ యూనిట్ లింక్డ్ ఇన్సూరెన్స్ పథకాల (యూలిప్స్) పెట్టుబడుల్లో కనీసం 3 నుంచి 5 శాతమైనా గోల్డ్ ఈటీఎఫ్‌ల్లో పెట్టుబడి పెట్టేందుకు అనుమతించాలని భారతీయ బీమా నియంత్రణ, అభివృద్ధి మండలి (ఐఆర్‌డీఏఐ)ను కోరాయి.

ఎందుకంటే?

బీమా కంపెనీలు ప్రస్తుతం నేరుగా పసిడిలో గానీ, గోల్డ్ ఈటీఎఫ్‌ల్లోగానీ మదుపు చేసేందుకు అనుమతి లేదు. యూలిప్స్ ద్వారా సమీకరించిన నిధులను ఈ సంస్థలు ఈక్విటీ, రుణ పత్రాలు, లిక్విడ్ డెట్ ఫండ్స్, లేదా బ్యాంకు ఫిక్స్‌డ్ డిపాజిట్లలో మాత్రమే పెట్టుబడులుగా పెడుతున్నాయి. గత ఏడాది కాలంలో ఈ పెట్టుబడులపై సగటున 5 నుంచి 8 శాతానికి మించి రాబడులు రాలేదు. ఇదే సమయంలో బులియన్ మార్కెట్ మాత్రం సగటున 30 శాతం వరకు రాబడులు ఇచ్చింది. దీంతో కనీసం పెట్టుబడుల వివిధీకరణ (డైవర్సిఫికేషన్) కోసమైనా గోల్డ్ ఈటీఎఫ్‌ల్లో పెట్టుబడులను అనుమతించాలని బీమా కంపెనీలు ఐఆర్‌డీఏఐను కోరుతున్నాయి. కాగా బీమా నియంత్రణ మండలి త్వరలోనే దీనిపై నిర్ణయం తీసుకుంటుందని భావిస్తున్నారు.

ఆగస్టు నుంచి పోస్టాఫీసుల్లో డిజిటల్ చెల్లింపులు

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా పోస్టాఫీసులన్నీ ఆగస్టు నెల నుంచి డిజిటల్ చెల్లింపులను ఆమోదించనున్నాయి. యూపీఐ సిస్టమ్‌తో తమ ఖాతాలను అనుసంధానం చేయకపోవడం వల్ల ఇన్నాళ్లూ పోస్టాఫీసులు డిజిటల్ చెల్లింపులను అనుమతించలేకపోయాయి. ఐటీ సిస్టమ్‌లో కొత్త అప్లికేషన్ చేర్చడంతో ఇది సాధ్యమైంది. దీనివల్ల కస్టమర్లు డైనమిక్ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి చెల్లింపులు చేసే వెసులుబాటు ఏర్పడింది.

అదానీలపై కేసు కొనసాగుతోంది

ఇంకా సమన్లు మాత్రం పంపలేదు: ఎస్ఈసీ

వాషింగ్టన్: అధికారులకు లంచాలు ఇచ్చారన్న కేసులో అదానీ గ్రూప్ చైర్మన్ గౌతమ్ అదానీ, అతడి దగ్గరి బంధువు సాగర్‌లపై దర్యాప్తు కొనసాగుతోందని అమెరికా క్యాపిటల్ మార్కెట్ నియంత్రణ మండలి సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ కమిషన్ (ఎస్ఈసీ,సెక్) వెల్లడించింది. అయితే ఈ కేసులో ఇంకా వీరికి సమన్లు జారీ చేయలేదని న్యూయార్క్‌లోని ఫెడరల్ కోర్టుకు ఎస్ఈసీ తెలిపింది. వీరిద్దరూ విదేశీ పౌరులైనందున వారికి నేరుగా గాక, సరైన దౌత్య మార్గాల్లో సమన్లు పంపాల్సి ఉంటుందని కోర్టుకు తెలియజేసింది. పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టుల కాంట్రాక్టుల కోసం వీరు అధికారులకు 26.5 కోట్ల డాలర్లు లంచంగా ఇచ్చారనే ఆరోపణలపై ఎస్ఈసీ గత ఏడాది నవంబరు 20న వీరిపై అభియోగాలు నమోదు చేసింది. అయితే హేగ్ సర్వీస్ ఒప్పందం ప్రకారం వీరికి సమన్లు పంపాల్సి ఉంటుందని పేర్కొంది. వీరికి సమన్లు జారీ చేసేందుకు నిర్దీత గడువంటూ లేదని స్పష్టం చేసింది. లంచాల విషయం దాచిపెట్టి 2021 సెప్టెంబరులో అదానీ గ్రూప్ కంపెనీ అదానీ గ్రీన్ ఎనర్జీ.. అమెరికా మార్కెట్ నుంచి రుణ పత్రాల ద్వారా నిధులు సమీకరించడంతో ఈ కేసు నమోదైంది.

జేఎస్‌డబ్ల్యూ చేతికి అక్జో నోబెల్

డీల్ విలువ రూ12,915 కోట్లు.. పెయింట్స్ రంగంలో భారీ టేకోవర్



న్యూఢిల్లీ: సజ్జన్ జిందాల్ నేతృత్వంలోని జేఎస్‌డబ్ల్యూ గ్రూప్ పెయింట్స్ వ్యాపారంలో తన స్థానాన్ని పటిష్ఠం చేసుకుంటోంది. ఇందులో భాగంగా నెదర్లాండ్స్ కేంద్రంగా పనిచేసే పెయింట్స్ సంస్థ అక్జో నోబెల్ భారత అనుబంధ సంస్థ అక్జో నోబెల్ ఇండియాను రూ.12,915 కోట్లకు జేఎస్‌డబ్ల్యూ పెయింట్స్ కొనుగోలు చేస్తోంది. ఇందుకోసం ఆ కంపెనీ ఈక్విటీలో నెదర్లాండ్స్ కంపెనీకి ఉన్న 74.76 శాతం వాటాను రూ.8,986 కోట్లకు కొనుగోలు చేసేందుకు శుక్రవారం ఒప్పందం కుదుర్చుకుంది. ప్రజల వద్ద ఉన్న మిగతా 25 శాతం వాటా షేర్లను ఒక్కో షేరు రూ.3,417.77 చొప్పున రూ.3,929.06 కోట్లకు కొనుగోలు చేసేందుకు త్వరలో ఓపెన్ ఆఫర్ ప్రకటించనుంది.

అతిపెద్ద డీల్

మన దేశ పెయింట్స్ రంగంలో ఇప్పటి వరకు ఇదే అతిపెద్ద టేకోవర్‌గా భావిస్తున్నారు. అక్జో నోబెల్ ఇండియా కొనుగోలుతో దేశ పెయింట్స్ మార్కెట్లో ఏషియన్ పెయింట్స్, బెర్జర్ పెయింట్స్, కన్సాయ్ నెరోలాక్ తర్వాత జేఎస్‌డబ్ల్యూ పెయింట్స్ నాలుగో అతిపెద్ద కంపెనీగా ఆవిర్భవించనుంది. ఆదిత్య బిర్లా గ్రూప్‌తో సహా ఇటీవల అనేక కంపెనీలు పెయింట్స్ వ్యాపారంలోకి ప్రవేశించాయి. దీంతో ఈ పోటీని ఎదుర్కోవడంతో పాటు తన స్థానాన్ని మరింత పటిష్ఠం చేసుకునేందుకు అక్జో నోబెల్ కొనుగోలు ఉపయోగపడుతుందని జేఎస్‌డబ్ల్యూ పెయింట్స్ భావిస్తోంది. అయితే ఈ డీల్‌కు కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ)తో పాటు పలు రెగ్యులేటరీ సంస్థల అనుమతి అవసరం. ఈ కొనుగోలుకు అవసరమైన రూ.12,915 కోట్లలో రూ.4,000 కోట్లను జేఎస్‌డబ్ల్యూ గ్రూప్ రుణాల ద్వారా సేకరించనుంది. ఇందుకోసం ఇప్పటికే పలు అంతర్జాతీయ సంస్థలతో జేఎస్‌డబ్ల్యూ చర్చలు జరుపుతున్నట్టు సమాచారం.



కెనరా బ్యాంక్.. 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి కేంద్ర ప్రభుత్వానికి రూ.2,283.41 కోట్ల డివిడెండ్‌ను అందించింది. శుక్రవారం నాడు కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌కు ఈ డివిడెండ్ చెక్‌ను కెనరా బ్యాంక్ ఎండీ, సీఈఓ కే సత్యనారాయణ రాజు అందజేశారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు హర్‌దీప్ సింగ్ అహ్లువాలియా, భవేంద్ర కుమార్, ఎస్‌కే మజుందార్ పాల్గొన్నారు.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

28వ తేదీ			
హైదరాబాద్	555	విజయవాడ	575
వరంగల్	557	గోదావరి	565
చిత్తూరు	623	విశాఖపట్నం	580
		డజను గుడ్లు రూ. 78	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	90	విజయవాడ	95
వరంగల్	90	గుంటూరు	100
కరీంనగర్	90	ఒంగోలు	103
మహబూబ్‌నగర్	90	చిత్తూరు	90
కర్నూలు	90	నెల్లూరు	95
విశాఖపట్నం	84	అనంతపురం	95
గోదావరి	95		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	98,020 ▼	89,850 ▼	1,17,900 ▼
విజయవాడ	98,700 ▼	93,500 ▼	1,08,000 ▼
విశాఖపట్నం	98,310 ▼	89,850 ▼	1,17,900 ▼
రాజమండ్రి	98,020 ▼	89,850 ▼	1,10,000 ▲
ప్రొద్దుటూరు	96,900 ▼	89,150 ▼	1,07,500 ▲
ముంబై	95,784 ▼	87 ,738 ▼	1,05,193 ▼

ఉజ్బెకిస్థాన్ జార్మెడ్ విశ్వవిద్యాలయంతో అపోలో మెడ్‌స్కిల్స్ జట్టు

భారతీయ విద్యార్థులకు అందుబాటులోకి వైద్య విద్య



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): అపోలో హాస్పిటల్స్ గ్రూప్‌నకు చెందిన అపోలో మెడ్‌స్కిల్స్ లిమిటెడ్.. ఉజ్బెకిస్థాన్‌కు చెందిన జార్మెడ్ విశ్వవిద్యాలయంతో జట్టు కట్టింది. ఒప్పందంలో భాగంగా భారతీయ విద్యార్థులకు 2025-26 విద్యా సంవత్సరం నుంచి 'జాప్ ఎంబీబీఎస్ ప్రోగ్రామ్' ద్వారా వైద్య విద్యను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు అపోలో మెడ్‌స్కిల్స్ సీఈఓ శ్రీనివాస్ రావు పులిజాల తెలిపారు. విదేశాల్లో వైద్య విద్యను అభ్యసిస్తున్న భారతీయ విద్యార్థులు భాషాపరంగా పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, దీన్ని దృష్టిలో ఉంచుకుని వీరి కోసం ప్రత్యేకంగా ఆంగ్ల మాధ్యమంలో అనుభవజ్ఞులైన భారతీయ అధ్యాపక బృందంతో విద్యను బోధించనున్నట్లు ఆయన చెప్పారు. ఉజ్బెకిస్తాన్‌లో జార్మెడ్ విశ్వవిద్యాలయానికి చెందిన రెండు క్యాంపస్‌లైన సమర్‌ఖండ్, బుఖారాల్లో ఎంబీబీఎస్ కోర్సు అందుబాటులో ఉంటుందని శ్రీనివాస్ తెలిపారు. అయితే జార్మెడ్ విశ్వవిద్యాలయంలో చేరాలనుకునే విద్యార్థులు నీట్ పరీక్షలో ఉత్తీర్ణులు కావాల్సి ఉంటుందన్నారు. జాతీయ మెడికల్ కౌన్సిల్ (ఎన్ఎంసీ) మార్గదర్శకాలకు అనుగుణంగా ఈ ఎంబీబీఎస్ కోర్సును అపోలో మెడ్‌స్కిల్స్ డిజైన్ చేసిందని ఆయన వివరించారు. ఐదేళ్ల అకాడమిక్ కరిక్యులమ్‌తో పాటు ఒక సంవత్సరం హాస్పిటల్ అప్రెంటిషిప్‌ను అందించనున్నట్లు ఆయన చెప్పారు. విదేశాల్లో వైద్య విద్యను అభ్యసించిన విద్యార్థులు భారత్‌లో ప్రాక్టీస్ చేసేందుకు ఎఫ్ఎంజీఈ/నెక్ట్స్ పరీక్షల్లో ఉత్తీర్ణులు కావాల్సి ఉంటుందన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని తొలి ఏడాది నుంచే ఇందుకు సంబంధించి సమగ్ర శిక్షణను అందించనున్నట్లు ఆయన చెప్పారు. ఆరేళ్ల ఎంబీబీఎస్ కోర్సు ఫీజు మొత్తం రూ.32 లక్షల వరకు ఉండనుందని శ్రీనివాస్ తెలిపారు

సెన్సెక్స్ మళ్లీ 84,000 ఎగువకు

ముంబై: ఈక్విటీ మార్కెట్ వరుసగా నాలుగో రోజు కూడా ర్యాలీని కొనసాగించింది. కొద్ది రోజులుగా భారీ అమ్మకాలు సాగించిన విదేశీ సంస్థలు తిరిగి భారత ఈక్విటీల వైపు దృష్టి సారించడంతో పాటు బ్లూచిప్ కంపెనీల షేర్ల కొనుగోలుకు ఇన్వెస్టర్లు పరుగులు తీయడంతో మార్కెట్లో సెంటిమెంట్ మరింత బలపడింది. దీంతో సెన్సెక్స్ 303.03 పాయింట్లు లాభపడి 84,058.90 వద్ద ముగిసింది. మరోసారి కీలక స్థాయి 84,000 కన్నా పైన స్థిరపడింది. నిఫ్టీ 88.80 పాయింట్లు లాభపడి 25,637.80 వద్ద క్లోజైంది.

'భెల్'కు అదానీ పవర్ రూ.6,500 కోట్ల భారీ ఆర్డర్

ప్రభుత్వ రంగంలోని భారత్ హెవీ ఎలక్ట్రికల్స్ లిమిటెడ్ (భెల్)కు అదానీ గ్రూప్ నుంచి రూ.6,500 కోట్ల విలువైన భారీ ఆర్డర్ లభించింది. ఈ ఆర్డర్ కింద అదానీ పవర్ లిమిటెడ్ (ఏపీఎల్) ఏర్పాటు చేసే థర్మల్ విద్యుత్ కేంద్రానికి భెల్ కీలక యంత్ర పరికరాలు సరఫరా చేయడంతో పాటు పర్యవేక్షణ సేవలు అందిస్తుంది. ఆర్డర్‌లో భాగంగా ఒక్కోటి 800 మెగావాట్ల విద్యుదుత్పత్తి సామర్థ్యం కలిగిన ఆరు యూనిట్లను ఏర్పాటు చేస్తుంది. భెల్‌కు ఒక దేశీయ కంపెనీ నుంచి ఇటీవల ఇంత పెద్ద ఆర్డర్ లభించడం ఇదే మొదటిసారి.

మెర్సిడెస్ కొత్త కార్లు



లగ్జరీ కార్ల దిగ్గజం మెర్సిడెస్ బెంజ్ రెండు సూపర్ స్పోర్ట్స్ కార్లను భారత మార్కెట్‌కు పరిచయం చేసింది. ఏఎంజీ జీటీ 63-4 మాటిక్, జీటీ 63 ప్రో 44 మాటిక్+కూపే పేరుతో వీటిని తీసుకువచ్చింది.ఈ కార్ల ధరలు వరుసగా రూ.3 కోట్లు, రూ.3.65 కోట్లు (ఎక్స్‌షోరూమ్)గా ఉన్నాయి. ఈ కార్లు 3.1 సెకన్ల వ్యవధిలోనే 100 కిలోమీటర్ల వేగం అందుకుంటాయి.

- ఫ్యాషన్ వస్త్ర సంస్థ ది హౌస్ ఆఫ్ రేర్.. దేశవ్యాప్త విస్తరణలో భాగంగా హైదరాబాద్‌లో కొత్త స్టోర్‌ను ఏర్పాటు చేసింది. బంజారాహిల్స్‌లో ఈ కొత్త ఫ్లాగ్‌షిప్ స్టోర్‌ను ప్రారంభించింది. రేర్ ర్యాబిట్, రేరిజం, రేర్ వన్స్, రేర్ జెడ్ బై రేర్ ర్యాబిట్ బ్రాండ్ కింద రెడీమేడ్ వస్త్రాలను విక్రయిస్తోంది.
- ఐటీ నిపుణులు ఫణీష్ మూర్తి.. ఎంటర్‌ప్రైజ్ ఏఐ, ఏజెంటిక్ ఏఐ ఆధారిత సర్వీస్ సంస్థ కోవాసంట్ టెక్నాలజీస్ బోర్డులో సలహాదారుగా చేరారు. ఐగేట్ మాజీ సీఈఓ అయిన ఫణీష్.. సంస్థ నాన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా వ్యవహరించనున్నారు.
- ఎలక్ట్రిక్ స్కూటర్ తయారీ సంస్థ రివర్.. ఆంధ్రప్రదేశ్‌లో తన కార్యకలాపాలు విస్తరించింది. ఇందులో భాగంగా విజయవాడలో కొత్తగా షోరూమ్‌ను ప్రారంభించింది. రాష్ట్రంలో సంస్థకిది మూడో షోరూమ్. రివర్ ఇప్పటికే తిరుపతి, విశాఖపట్నంలలో షోరూమ్స్‌ను నిర్వహిస్తోంది.
- ఆసుస్ ఇండియా మార్కెట్లోకి సరికొత్త గేమింగ్ ల్యాప్‌ట్యాప్స్ తీసుకువచ్చింది. టీయూఎఫ్ గేమింగ్ ఎఫ్ 16, ఏ 16, ఆర్ఓజీ స్ట్రిక్స్ జీ16, జెఫిరస్ జీ14తో పేరుతో తీసుకువచ్చిన వీటి ధరలు రూ.1.44,990 నుంచి రూ.1.84,990 మధ్యన ఉన్నాయి.
- లగ్జరీ కార్ల సంస్థ లెక్సస్ భారత్‌లో సరికొత్త లెక్సస్ ఎల్ఎక్స్ 500 డీ డెలివరీలను ప్రారంభించింది రెండు వేరియంట్లలో ఇది అందుబాటులో ఉండనుంది. ట్విన్ టర్బో వీ6 డీజిల్ ఇంజన్‌తో దీన్ని తీసుకువచ్చింది.

ప్రాక్టీస్.. ప్రాక్టీస్

నెట్స్‌లో చెమటోడ్చిన టీమిండియా



బర్మింగ్‌హామ్: తొలి టెస్టులో ఓడిన భారత క్రికెట్ జట్టు ఇప్పుడిక తదుపరి మ్యాచ్‌పై దృష్టి సారించింది. రెండు రోజుల పాటు విశ్రాంతి తీసుకున్న గిల్ సేన శుక్రవారం తమ సన్నాహకాలను ఆరంభించింది. వచ్చే నెల 2 నుంచి ఎడ్జ్‌బాస్టన్ మైదానంలో ఇంగ్లండ్‌తో జరిగే ఈ రెండో టెస్టు కోసం ఆటగాళ్లంతా నెట్స్‌లో చెమటోడ్చారు. అయితే తొలి టెస్టులో ఎనిమిది క్యాచ్‌లను వదిలేసిన నేపథ్యంలో ఫీల్డింగ్ ప్రాక్టీస్‌పై దృష్టి సారించారు. క్యాచింగ్, నేరుగా విసిరిన త్రోలతో డ్రిల్స్ జరిగాయి. ఆ తర్వాత బౌలింగ్ సాధన సాగింది. అయితే పేసర్లు బుమ్రా, ప్రసిద్ధ్ క్రిష్ణ దీనికి దూరంగా ఉన్నారు. అటు సిరాజ్ అసిస్టెంట్ కోచ్ రియాన్ టెన్ డస్కటే ఆధ్వర్యంలో బ్యాటింగ్ ప్రాక్టీస్ చేస్తూ కనిపించాడు. ముఖ్యంగా అతడి చేత షార్ట్ పిచ్ బంతులను కోచ్ ఆడించాడు. అనంతరం ఈ ముగ్గురు పేసర్లు కలిసి రన్నింగ్, ఫిట్‌నెస్ డ్రిల్‌లో పాల్గొన్నారే తప్ప బౌలింగ్ మాత్రం చేయలేదు. రెండో టెస్టులో బుమ్రాకు విశ్రాంతి ఇవ్వనున్నట్టు కథనాలు వినిపిస్తున్నాయి.

స్పిన్నర్లు జోరుగా..

హెడింగ్లీ పిచ్‌కన్నా ఎడ్జ్‌బాస్టన్‌లో వికెట్ స్పిన్‌కు అనుకూలంగా ఉండే అవకాశం ఉంది. దీంతో స్పిన్నర్లు కుల్దీప్ యాదవ్, వాషింగ్టన్ సుందర్, జడేజా గంట పాటు బౌలింగ్ సాధన చేశారు. చక్కటి టర్న్‌ను రాబట్టి పంత్‌ను బ్యాటింగ్‌లో ఇబ్బందిపెట్టారు. తొలి టెస్టులోనే కుల్దీప్‌ను ఆడిస్తే ఫలితం ఉండేదని ఇప్పటికే విశ్లేషకులు కామెంట్స్ చేశారు. ఇక పేసర్ల విషయానికి వస్తే అర్ష్‌దీప్, ఆకాశ్ దీప్‌లతో పాటు ఆల్‌రౌండర్లు శార్దూల్, నితీశ్ కూడా నెట్స్‌లో బౌలింగ్ ప్రాక్టీస్ చేశారు. ఒకవేళ బుమ్రాకు విశ్రాంతినిస్తే అర్ష్‌దీప్, ఆకాశ్‌లలో ఒకరికి చాన్స్ దక్కవచ్చు. ఈ జోడీతో కొత్త, పాత బంతులతో సైతం ప్రాక్టీస్ చేయించారు. ఇక శనివారం జట్టుకు ఆప్షనల్ ప్రాక్టీస్ కావడంతో సీనియర్ త్రయం నెట్స్‌లో గడుపుతారా? లేక విశ్రాంతి తీసుకుంటారో? చూడాల్సిందే.

సిరాజ్‌పైనే భారం



ఇంగ్లండ్‌తో తొలి టెస్టులో ఓడినప్పటికీ.. స్టార్ పేసర్ బుమ్రాకు పని ఒత్తిడిలో భాగంగా భారత జట్టు విశ్రాంతి ఇవ్వాలనుకుంటోంది. అయితే ఈ నిర్ణయం జట్టు బౌలింగ్‌పై పెను ప్రభావమే పడనుంది. తొలి టెస్టులో బుమ్రాకు మద్దతుగా ఇతర పేసర్లు ఏమాత్రం అండగా నిలవలేకపోయారు. ఈనేపథ్యంలో బౌలింగ్ భారాన్ని పేసర్ మహ్మద్ సిరాజ్ మోయాల్సి వస్తుంది. అలాగే ఇంగ్లండ్ రెండో ఇన్నింగ్స్‌లో సిరాజ్ ధారాళంగా పరుగులిచ్చి వికెట్ కూడా తీయలేకపోయాడు. అటు మిగతా ఇద్దరు పేసర్లు ప్రసిద్ధ్, శార్దూల్ కలిపి ఆడింది 16 టెస్టులే. అలాగే ఓవర్‌కు ఆరు పరుగులిచ్చుకోవడంతో వారు వికెట్లు తీసినా ఫలితం లేకపోయింది. ప్రసిద్ధ్ మొత్తంగా ఐదు వికెట్లు తీసినా.. అతడి నుంచి మేనేజ్‌మెంట్ ఫుల్లర్ లెంగ్త్ బంతులను ఆశించింది. కానీ తను మాత్రం నిలకడగా అలాంటి బంతులను వేయలేకపోయాడు. ఏదిఏమైనా బుమ్రా లేని భారత బౌలింగ్ దళం ఇంగ్లండ్ బ్యాటర్లను కట్టడి చేయాలంటే స్థాయికి మించిన ప్రదర్శన చేయాల్సి ఉంటుంది. మరోవైపు బర్మింగ్‌హామ్‌లో టీమిండియాకు ఇప్పటిదాకా టెస్టు విజయమే లేకపోవడం గమనార్హం.

'యూజెడ్' విజేత ప్రజ్ఞానంద

భారత టాప్ ర్యాంక్ కైవసం



తాష్కెంట్: గ్రాండ్‌మాస్టర్ ఆర్.ప్రజ్ఞానంద యూజెడ్ చెస్ కప్‌లో విజేతగా నిలిచాడు. దాంతో లైవ్ రేటింగ్‌లో భారత టాప్ ర్యాంక్ ఆటగాడిగా నిలిచాడు. ఈ టోర్నీ విజయంతో ప్రజ్ఞానంద రేటింగ్ 2778.3కి చేరింది. ఫలితంగా అతడు ఫిడే ప్రపంచ ర్యాంకింగ్స్‌లో మూడు స్థానాలు ఎగబాకి నాలుగో స్థానం దక్కించుకున్నాడు. కెరీర్‌లో ప్రజ్ఞానందకిది అత్యుత్తమ ర్యాంక్. ఈక్రమంలో వరల్డ్ చాంపియన్ గుకేష్ (2776.6), గ్రాండ్‌మాస్టర్ అర్జున్ ఇరిగేసి (2775.7)ని 19 ఏళ్ల ప్రజ్ఞానంద వెనక్కు నెట్టాడు. కాగా..గురువారం వరకు అర్జున్ భారత టాప్ ర్యాంక్ ఆటగాడిగా కొనసాగాడు. తాజా ర్యాంకుల్లో అతడు ఆరో స్థానానికి దిగజారగా, గుకేష్ ఐదో ర్యాంక్‌లో నిలిచాడు.

మనమ్మాయిలకు భలే చాన్స్

రా. 7 నుంచి సోనీ నెట్‌వర్క్‌లో

పొట్టి ప్రపంచకప్‌పై నజర్
ఇంగ్లండ్‌తో నేడు తొలి టీ20



హర్మన్
బ్రంట్

నాటింగ్‌హామ్: భారత మహిళల జట్టు ఇంగ్లండ్‌తో తెల్లబంతుల పోరుకు సిద్ధమైంది. ఐదు టీ20లు, మూడు వన్డేల సుదీర్ఘ సిరీస్‌కోసం ఇక్కడికి వచ్చిన హర్మన్ సేన.. శనివారం జరిగే మొదటి టీ20లో ఆతిథ్య ఇంగ్లండ్‌ను ఎదుర్కోనుంది. వచ్చే ఏడాది ఇంగ్లండ్ ఆతిథ్యమిచ్చే పొట్టి ప్రపంచ కప్‌లో స్థానిక పరిస్థితులకు అలవాటు పడేందుకు తాజా సిరీస్‌ను ఉపయోగించుకోవాలని భారత్ భావిస్తోంది. తద్వారా రాబోయే టీ20 ప్రపంచ కప్ జట్టు ఎంపిక సులువవుతుంది. డ్యాషింగ్ బ్యాటర్ షఫాలీ వర్మ పునరాగమనం జట్టుకు అదనపు బలం. ఇంకా..తెలుగమ్మాయి శ్రీచరణి, క్రాంతి గౌడ్, సయాలీ సత్ఘరే వంటి యువ క్రికెటర్లకు జట్టులో చోటు కల్పించారు. గత కొన్ని మ్యాచ్‌ల్లో ఉమా ఛెత్రి విఫలమవుతున్న నేపథ్యంలో స్మృతి మంధానాతో కలిసి షఫాలీ ఇన్నింగ్స్‌ను ప్రారంభించనుంది. జట్టులోకి రీ ఎంట్రీ ఇచ్చిన ఆఫ్‌స్పిన్ ఆల్‌రౌండర్ స్నేహ్ రాణా, పేస్ బౌలింగ్ ఆల్‌రౌండర్ అమన్ జోత్ కౌర్ ఎలా రాణిస్తారో చూడాలి. సీనియర్ పేసర్లు రేణుకా సింగ్, పూజా వస్త్రాకర్ గాయాలతో జట్టుకు దూరం కావడం టీమిండియాకు ప్రతికూలం కానుంది. మరోవైపు కెప్టెన్ నాట్-సివర్ బ్రంట్‌కుతోడు అమీ జోన్స్, బ్యూమాంట్, డానీ వ్యాట్, ఎకిల్‌స్టోన్ వంటి అత్యంత అనుభవజ్ఞులతో ఇంగ్లండ్ పటిష్ఠంగా ఉంది.

స్పోర్ట్స్

విండీస్ స్టార్ క్రికెటర్‌పై లైంగిక వేధింపుల ఆరోపణలు

మైనర్ సహా 11 మంది మహిళలు ఫిర్యాదు చేసినట్టు కథనాలు

గయానా: ప్రస్తుత వెస్టిండీస్ జట్టులోని ఓ స్టార్ క్రికెటర్ లైంగిక ఆరోపణల వివాదంలో చిక్కుకున్నాడు. లైంగిక వేధింపులు, అత్యాచారం తదితర ఆరోపణలతో ఓ మైనర్ సహా 11 మంది మహిళలు సదరు క్రికెటర్‌పై గయానా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్టు విండీస్ మీడియా పేర్కొంది. స్థానిక పత్రిక కథనం ప్రకారం.. 2023 మార్చిలో న్యూఆమ్‌స్టర్‌డ్యామ్‌లోని ఓ నివాసంలో ఆ క్రికెటర్ తనపై లైంగిక దాడి చేశాడని 18 ఏళ్ల యువతితో పాటు ఆమె కుటుంబం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ ఘటనతో మరికొందరు మహిళలు కూడా ఆ క్రికెటర్‌పై ఇవే ఆరోపణలు చేశారు. క్రికెటర్ చేసిన వాట్సాప్ సందేశాలు, వాయిస్ నోట్స్ లాంటి ఆధారాలను పోలీసులకు అందజేశారు. కానీ, ఇప్పటిదాకా ఆ ఆటగాడిపై ఎలాంటి కేసూ నమోదు కాలేదు. గతేడాది జనవరిలో బ్రిస్బేన్ వేదికగా ఆస్ట్రేలియాతో జరిగిన టెస్టులో గెలిచిన విండీస్ జట్టులో ఆరోపణలు ఎదుర్కొంటున్న క్రికెటర్ ఉన్నాడని మీడియా వెల్లడించింది. ఆసీస్‌పై విజయం అనంతరం గయానాకు తిరిగొచ్చినప్పుడు అతనికి ఘనంగా స్వాగతం కూడా పలికారని తెలిపింది. కాగా, ఆ ఆరోపణల విషయంపై తమకు పూర్తిగా తెలియదనీ, దీనిపై ఇప్పుడు వ్యాఖ్యానించలేమని విండీస్ క్రికెట్ బోర్డు ప్రకటించింది.

హాట్ ఫేవరెట్.. నిఖత్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): జాతీయ ఎలీట్ మహిళల బాక్సింగ్ టోర్నమెంట్‌కు హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియం ముస్తాబైంది. శనివారం మొదలవనున్న ఈ పోటీల్లో రెండుసార్లు వరల్డ్ చాంపియన్ నిఖత్ జరీన్ ఈసారి కొత్త వెయిట్ విభాగంలో బరిలోకి దిగుతోంది. నిఖత్ 48-51 కిలోల విభాగంలో ఉత్తరప్రదేశ్‌కు చెందిన రాశీ శర్మతో తన తొలి బౌట్‌లో తలపడనుంది. తొలిరోజు మొత్తం 21 బౌట్లు జరగనున్నాయి. నిఖత్‌తో పాటు తెలంగాణ నుంచి 60-65 కిలోల కేటగిరీలో యషి శర్మ, 65-70 కిలోల విభాగంలో పూజ, 75-80 కిలోల కేటగిరీలో కీర్తి పోటీపడుతున్నారు.

వైభవ్ ధనాధన్..

భారత అండర్-19 జట్టు బోణీ



హోవ్ (ఇంగ్లండ్): వైభవ్ సూర్యవంశీ (19 బంతుల్లో 48) చెలరేగడంతో ఇంగ్లండ్ అండర్-19 జట్టుతో జరిగిన తొలి వన్డేలో భారత్ ఘన విజయం సాధించింది. శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో తొలుత ఇంగ్లండ్ అండర్-19 జట్టు 42.2 ఓవర్లలో 174 పరుగులకే ఆలౌటైంది. రాకీ ఫ్లింటాఫ్ (56), ఇసాక్ మహ్మద్ (42) మాత్రమే రాణించారు. కనిష్క్ చౌహాన్ మూడు, అంబరీష్, మహ్మద్ ఇనాన్, హెనిల్ పటేల్ తలా రెండేసి వికెట్లు పడగొట్టారు. అనంతరం భారత్ 24 ఓవర్లలో 178/4 స్కోరు చేసి నెగ్గింది.

ఒకే పార్శ్వంలో సినర్, జొకోవిచ్

వింబుల్డన్ డ్రా

లండన్: ఇటలీ స్టార్ జానిక్ సినర్, నొవాక్ జొకోవిచ్ సోమవారంనుంచి జరిగే వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్‌లో ఒకే పార్శ్వంలో తలపడనున్నారు. సినర్ తొలి రౌండ్‌లో తన దేశానికే చెందిన లుకా నార్డీని ఢీకొంటాడు. ఇక జొకో మొదటి రౌండ్‌లో ముల్లెర్ (ఫ్రాన్స్)తో తలపడతాడు. అల్కారజ్...ఫోగ్నినీ (ఇటలీ)తో టోర్నీని ఆరంభిస్తాడు. మహిళల్లో.. కోకో గాఫ్..ఎనిమిదో సీడ్ స్వియటెక్‌తో క్వార్టర్‌ఫైనల్లో తలపడే చాన్సుంది. తొలి రౌండ్‌లో డయానా యాస్ట్రెంస్కా (ఉక్రెయిన్)ను గాఫ్ ఢీకొననుంది. ఇక..కుడెర్మెటోవాతో మొదటి రౌండ్‌లో స్వియటెక్ అమీతుమీ తేల్చుకోనుంది. డిఫెండింగ్ చాంపియన్ క్రెజికోవా-అలెగ్జాండ్రా ఇలాతో టోర్నమెంట్‌ను ఆరంభించనుంది.

టీ20 పవర్‌ప్లే మారింది..

ఐసీసీ నిర్ణయం



దుబాయ్: అంతర్జాతీయ టీ20 క్రికెట్ పవర్‌ప్లేలో ఐసీసీ కొత్త నిబంధనలను తీసుకొచ్చింది. ప్రస్తుతం తొలి ఆరు ఓవర్లను పవర్‌ప్లేగా పరిగణిస్తుండడం తెలిసిందే. ఇది 20 ఓవర్లలో 30శాతం ఆటగా చెప్పవచ్చు. ఇప్పటివరకు పలు కారణాలరీత్యా మ్యాచ్‌ను కుదిస్తే పవర్‌ప్లే ఓవర్లు రౌండ్‌ఫిగర్‌గా ఉండేవి. ఉదాహరణకు మ్యాచ్‌ను 8 ఓవర్ల చొప్పున ఆడిస్తే 2 ఓవర్ల పవర్‌ప్లే ఉండేది. కానీ ఇప్పుడలా కాకుండా మరింత కచ్చితత్వం కోసం 2.2 ఓవర్ల వరకు ఉంటుంది. ఇది 30 శాతం నిష్పత్తికి దగ్గరగా ఉంటుంది.

కంకషన్: కంకషన్ ప్రొటోకాల్‌లోనూ రెండు మార్పులు చేసింది. పురుషుల టీ20ల్లో ఐదుగురితో కూడిన లైక్ ఫర్ లైక్ రీప్లేస్‌మెంట్ జాబితాను మ్యాచ్ ఆరంభానికి ముందే ఇవ్వాల్సి ఉంటుంది. అయితే అసోసియేట్ సభ్యదేశాలకు సరిగ్గా అలాంటి ఆటగాళ్లే ఉండడం కష్టం. వారి కోసం కీపర్ గాయపడితే అతడి స్థానంలో బ్యాటర్‌ను ఆడించవచ్చు. అయితే కీపింగ్ కూడా తనే చేయాల్సి ఉంటుంది. ఇక కంకషన్‌కు గురైన ఆటగాళ్లను కనీసం ఏడు రోజులపాటు పర్యవేక్షిస్తారు. ఆ తర్వాతే తిరిగి ఆడేందుకు అనుమతి ఉంటుంది.

వైడ్ బాల్: వైడ్ బాల్ విషయంలోనూ మార్పులు చేయనుంది. ఇప్పటి నుంచి వైడ్‌గా ప్రకటించడానికి ముందు బంతి డెలివరీ సమయానికి బ్యాటర్ కాళ్ల పొజిషన్‌ను అంపైర్లు గమనిస్తారు. అతడు ఆఫ్ సైడ్ వైపు జరుగుతున్నాడా? లేదా? అని పరిశీలించాకే నిర్ణయం తీసుకుంటారు. అయితే ఈ రూల్‌ను కొన్నాళ్లపాటు పరీక్షించనున్నారు.

ఆసీస్‌కు భారీ ఆధిక్యం

బ్రిడ్జిటౌన్: వెస్టిండీస్‌తో తొలి టెస్టులో ఆస్ట్రేలియా భారీ ఆధిక్యం దిశగా సాగుతోంది. మిడిలార్డర్‌లో వెబ్‌స్టర్ (63), హెడ్ (61), క్యారీ (65) అర్ధసెంచరీలతో రాణించారు. దీంతో ఆసీస్ కడపటి వార్తలందే సమయానికి రెండో ఇన్నింగ్స్‌లో 9 వికెట్లకు 291 పరుగులు చేసింది. ప్రస్తుతం ఆస్ట్రేలియా 281 రన్స్ ఆధిక్యంతో పటిష్ఠ స్థితిలో నిలిచింది. షామర్ జోసెఫ్‌కు 4, అల్జారి జోసెఫ్‌కు 2 వికెట్లు దక్కాయి. తొలి ఇన్నింగ్స్‌లో విండీస్ 190, ఆసీస్ 180 పరుగులు చేశాయి.

లంక గెలుపు లాంఛనమే!

కొలంబో: బంగ్లాదేశ్‌తో రెండో టెస్టులో ఆతిథ్య శ్రీలంక ఇన్నింగ్స్ విజయానికి నాలుగు వికెట్ల దూరంలో నిలిచింది. ఓవర్‌నైట్ స్కోరు 290/2తో శుక్రవారం తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన లంక 458 పరుగులకు ఆలౌటైంది. అనంతరం రెండో ఇన్నింగ్స్‌లో బంగ్లా మూడోరోజు ఆట ముగిసేసరికి 115/6 స్కోరు చేసింది. బంగ్లా మొదటి ఇన్నింగ్స్‌లో 247 రన్స్ చేసింది


www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

శనివారం | 28-6-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 23 సంచిక (Issue) : 90 | శ్రీ విశ్వావసునామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మరుతువు, ఆషాఢమాసం, శుక్ల పక్షం, తిథి: తదియ ఉ.9.54 తదుపరి చవితి, నక్షత్రం: పుష్యమి ఉ.6.36 తదుపరి ఆశ్లేష; వర్జ్యం: రా.7.22-8.58, దుర్ముహూర్తం: ఉ.5.47-7.31, అమృతఘడియలు: తె.4.58-6.34, రాహుకాలం: ఉ.9.00-10.30, సూర్యోదయం: 5.47, సూర్యాస్తమయం: 6.49 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem |Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru




అభిమన్యురెడ్డి (ఫైల్)

కన్న తల్లి కళ్లెదుటే..

- టిప్పర్ చక్రాల కింద నలిగి ఆరేళ్ల బాలుడి దుర్మరణం
- ఓవర్ టేక్ చేస్తూ అదుపుతప్పి టిప్పర్ కిందకు స్కూటీ
- ప్రమాదం నుంచి బయటపడ్డ తల్లి.. కుమారుడి మృతి
- దుండిగల్ పరిధిలోని మల్లంపేటలో విషాద ఘటన

12



ఐఏఎంసీకి భూకేటాయింపు రద్దు

జీవోను కొట్టేస్తూ హైకోర్టు సంచలన తీర్పు

రాయదుర్గ్‌లో 3.70 ఎకరాలిచ్చిన గత ప్రభుత్వం

ఆర్బిట్రేషన్ అండ్ మీడియేషన్ సెంటర్‌లో కేసుల్లేవు

ఇప్పటిదాకా 15 ఆర్బిట్రేషన్.. 57 మీడియేషన్లే

ఏటా రూ.3 కోట్లు ఇచ్చినా నిలబడే పరిస్థితి లేదు

ఇకపై పనితీరు ఆధారంగానే నిధులు ఇవ్వాలి

తీర్పు సందర్భంగా హైకోర్టు ధర్మాసనం వ్యాఖ్యలు

హైదరాబాద్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): ఇంటర్నేషనల్ ఆర్బిట్రేషన్ అండ్ మీడియేషన్ సెంటర్ (ఐఏఎంసీ)కు గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన భూకేటాయింపును హైకోర్టు రద్దు చేసింది. ఇందుకు సంబంధించిన జీవోను కొట్టివేస్తూ శుక్రవారం సంచలన తీర్పు వెలువరించింది. ఐఏఎంసీలో అతి తక్కువ కేసులు విచారిస్తున్నారని, దీనికి నిరంతరం నిధులు కేటాయించినా నిలబడే పరిస్థితి కనిపించడంలేదని వ్యాఖ్యానించింది. ఎక్కువ ఖర్చు అయ్యేలా

మిగతా 12వ పేజీలో...

మున్సిపల్ ఎన్నికలు ఎప్పుడు నిర్వహిస్తారు?

11లోగా చెప్పండి: సర్కార్‌కు హైకోర్టు ఆదేశాలు 11



సిట్ ఆఫీసులో వాంగ్మూలం ఇచ్చిన అనంతరం బయటకు వస్తున్న ఆంధ్రజ్యోతి ఎండీ రాధాకృష్ణ

ఆ మెయిలే పట్టిచ్చింది!

అడిగిన సమాచారం పంపామని టెలికాం కంపెనీల మెయిల్.. అందులో 615 మంది ఫోన్ల వివరాలు

హార్డ్‌డిస్క్‌లు ధ్వంసం చేసినా మెయిల్ సంగతి మరిచారు

మావోయిస్టుల సమాచారం కోసమంటూ లేఖ రాసి చిక్కుల్లో పడ్డ ప్రభాకర్‌రావు బృందం

జాబితాలో ఎక్కువ మందికి ఆ సంబంధమే లేదు

అదే కారణం చెప్పి ఆంధ్రజ్యోతి ఎండీ ఫోన్ ట్యాప్

సిట్ ముందు వాంగ్మూలమిచ్చిన సందర్భంగా రాధాకృష్ణకు ఇదే విషయం చెప్పిన పోలీసులు

దుర్వినియోగాన్ని సుప్రీంకోర్టు ముందుంచనున్న సిట్

హైదరాబాద్, జూన్ 27(ఆంధ్రజ్యోతి): పక్కా వ్యూహంతో అక్రమ ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడిన ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్‌రావు బృందం ట్యాపింగ్ ఆధారాలను పూర్తి స్థాయిలో ధ్వంసం చేసినప్పటికీ ఒక మెయిల్ ఆధారంతో దొరికిపోయింది. నిజానికి బీఆర్ఎస్ శాసనసభ ఎన్నికల్లో ఓడిపోయిన మర్నాడు రాత్రే ఆధారాలను మాయం చేసే కార్యక్రమాన్ని జాగ్రత్తగా చేపట్టారు. హార్డ్ డిస్క్‌లను ముక్కలుగా చేసి మూసీలో పడేశారు. ఫోన్ రికార్డు చేయాల్సిన వారి కోసం తయారు చేసిన ప్రొఫైల్స్‌ను కాల్చి బూడిద చేశారు. ఒక్క ఆధారం దొరక్కుండా అన్ని జాగ్రత్తలు తీసుకున్నారు. అసలు విషయాన్ని మర్చిపోయారు. అదే ఇప్పుడు ఫోన్ ట్యాపింగ్ కేసు దర్యాప్తు ప్రారంభించిన పోలీసులకు బలమైన ఆధారాలను అందించింది. కేవలం ఒక మెయిల్ వల్ల ఫోన్ ట్యాపింగ్ కేసులో 615 ఫోన్ నంబర్లను ట్యాపింగ్ జరిగినట్లు సిట్ అధికారులు గుర్తించగలిగారు. ఫోన్ ట్యాపింగ్ కోసం అన్ని అనుమతులు పొందిన తర్వాత టెలికాం సర్వీసు ప్రొవైడర్లకు(టీఎస్‌పీ) ఎస్ఐబీ నుంచి లేఖలు వెళ్లేవి. ఎస్ఐబీ కోరిన ఫోన్ నంబర్ల సమాచారం అడిగిన వెంటనే సాధ్యమైనంత తొందరగా టీఎస్‌పీలు అందచేసేవి. అన్ని టీఎస్‌పీలతో ఎస్ఐబీ విడివిడిగా డీల్ చేయదు. వాటి తరఫున

మిగతా 11వ పేజీలో...

ట్యాపింగ్ ద్వారా రూ. 13 కోట్ల ఎలక్టోరల్ బాండ్లు!

నా స్నేహితుడిని బెదిరించి వసూలు చేశారు

బీఆర్ఎస్ నుంచి వచ్చినప్పటి నుంచి నా ఫోన్ ట్యాపింగ్.. నా భార్య ఫోన్ కూడా

పోలీసులు ఇంట్లో చొరబడి లైవ్ బగ్ పెట్టారు

నాటి డీజీపీ మహేందర్‌రెడ్డి హస్తం ఉంది

బీజేపీ ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి ఆరోపణ

ఫోన్ ట్యాపింగ్‌పై సిట్ ముందు వాంగ్మూలం

నక్సలైట్ పేరుతో ట్యాపింగ్: రఘునందన్



వాంగ్మూలం ఇవ్వడానికి సిట్ కార్యాలయానికి వచ్చిన ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

11



నిందితుల్ని అరెస్టు చేసి కోర్టుకు తీసుకెళ్తున్న పోలీసులు

లా విద్యార్థినిపై గ్యాంగ్ రేప్

కోల్‌కతాలో దారుణం

కాలేజీలోని సెక్యూరిటీ గార్డ్ గదిలోనే కిరాతకం

ఓ విద్యార్థి ఘాతుకం.. మరో ఇద్దరి సహకారం

వారిలో ఒకడు పూర్వ విద్యార్థి, తృణమూల్ కాంగ్రెస్ స్టూడెంట్ యూనియన్ నాయకుడు

బాధితురాలి తలపై హాకీ స్టిక్‌తో కొట్టి దారుణం

ముగ్గురు నిందితుల అరెస్టు

పశ్చిమ బెంగాల్‌లో రాజకీయ దుమారం

కోల్‌కతా, జూన్ 27 : పశ్చిమ బెంగాల్ రాజధాని కోల్‌కతాలో దారుణం జరిగింది. లా (న్యాయశాస్త్రం) మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థిని (24) తన కాలేజీలోనే సామూహిక అత్యాచారానికి గురయ్యారు. అదే కళాశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు, మరో పూర్వ విద్యార్థి కలిసి ఆమెపై అఘాయిత్యానికి తెగబడ్డారు. బాధితురాలిని కళాశాల సెక్యూరిటీ గార్డు గదిలోకి ఈడ్చుకెళ్లి వివస్త్రను చేసి.. నిందితుల్లో ఓ యువకుడు ఆమెపై అత్యాచారానికి పాల్పడ్డాడు. ఆ సమయంలో మిగిలిన ఇద్దరు అతనికి సహకరించారు. ఈ క్రమంలో ఆమె ఊపిరి ఆడటం లేదంటే

మిగతా 2వ పేజీలో...

జూరాల ప్రాజెక్టు ఎడమ వైపు కరకట్ట రోడ్డుపై ఏర్పడిన గుంతలు



జూరాల భద్రత ప్రశ్నార్థకం!

ఏళ్ల తరబడి సాగుతున్న గేట్ల మరమ్మతులు

ఎన్‌డీఎస్‌ఏ సూచనలు పట్టించుకోని వైనం

ఒక్కటే గ్యాంట్రీ క్రేన్.. తరచూ మొరాయింపే

వాహనాల రాకపోకలతో పొంచి ఉన్న ముప్పు

రూ.120 కోట్లతో బ్రిడ్జి.. కాగితాలకే పరిమితం

ఎడమవైపు కరకట్ట రోడ్డుపై భారీగా గుంతలు

చోద్యం చూస్తున్న పంచాయతీరాజ్, ఇరిగేషన్

నేడు ప్రాజెక్టు సందర్శించనున్న మంత్రి ఉత్తమ్

సేఫ్ జోన్‌లోనే మంజీరా బ్యారేజీ

జూరాల రోప్‌లకు మరమ్మతులు: రాహుల్ బొజ్జా

గద్వాల, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): లక్ష ఎకరాలకు సాగు నీరు అందించే జూరాల ప్రాజెక్టు భద్రత ప్రశ్నార్థకంగా మారింది. ఏళ్ల తరబడి గ్రీజింగ్ లేక గేట్లు కదలకపోవడం, రబ్బరు సీళ్లు పాడైపోవడంతో నీటి లీకేజీలు, గేట్లకు ఉండే రోప్‌లు(ఇనుప తాళ్లు) తుప్పు పట్టి తెగిపోవడం.. ఇలా ఒకటీ, రెండు కాదు చాలా సమస్యలు ప్రాజెక్టును పట్టి పీడిస్తున్నాయి. గేట్ల రోప్‌లు బలహీనంగా ఉన్నాయని 2019లో గుర్తిస్తే, 2021 వరకు నిధుల కేటాయింపు జరగనే లేదు. చివరకు రూ.11 కోట్లతో టెండర్లు పిలిచినా 2023 వరకు పనులు ప్రారంభం కాకపోవడం నిర్లక్ష్యానికి నిదర్శనంగా నిలుస్తోంది. శరవేగంగా

మిగతా 3వ పేజీలో...

వారంలోనే ఆత్మీయ భరోసా



రూ.261 కోట్లు విడుదలకు సర్కారు కసరత్తు

గతంలో 83,887 మంది కూలీలకే ఆర్థిక సాయం

మిగిలిన 4,35,304 మందికి ఇప్పుడు చెల్లింపులు

బిల్లులు సమర్పించిన గ్రామీణాభివృద్ధి శాఖ

ఉద్యోగుల వేతనాల చెల్లింపులు

పూర్తవగానే భరోసాకు నిధుల కేటాయింపు

'తొలి విడత' వేగంగా పూర్తికి నిర్ణయం

హైదరాబాద్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): వానాకాలం సీజన్‌లో రైతులకు పెట్టుబడి సాయం అందించిన ప్రభుత్వం.. ఇప్పుడు భూమి లేని వ్యవసాయ కూలీలకు ఆర్థిక సాయం చేసే అంశంపై దృష్టి సారించింది. ఈ ఏడాది జనవరిలో ప్రారంభించిన 'ఇందిరమ్మ ఆత్మీయ భరోసా' పథకానికి సంబంధించిన తొలి విడత చెల్లింపులు పూర్తి చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు పెండింగ్‌లో ఉన్న రూ.261 కోట్లను చెల్లించేందుకు కసరత్తు చేస్తోంది. జూలై మొదటి వారంలో ఉద్యోగుల వేతనాల చెల్లింపులు పూర్తి కాగానే, ఇందిరమ్మ ఆత్మీయ భరోసాకు నిధులు విడుదల చేయాలని ఆర్థిక శాఖకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిసింది. దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న, ఉపాధిహామీ పథకంలో జాబ్ కార్డు కలిగి ఉన్న, కనీసం 20 పనిదినాలు పూర్తి చేసిన.. భూమి లేని కూలీలను

మిగతా 9వ పేజీలో...

ఫీజులపై కమిటీ

ఇంజనీరింగ్ కళాశాలలకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం

విద్యా ప్రమాణాలు, మెరుగైన వసతులే ప్రామాణికం

గత విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ నివేదికల పరిశీలన

పరిగణనలోకి సుప్రీం తీర్పులు.. కౌన్సెలింగ్‌కు ఇబ్బంది లేకుండా చర్యలు

హైదరాబాద్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ఇంజనీరింగ్ కళాశాలల్లో ఫీజుల నిర్ణయానికి సంబంధించి హేతుబద్ధమైన నిర్ణయం తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఆయా కళాశాలల్లో బోధన సిబ్బంది, బోధన స్థాయి, కళాశాలల్లో ల్యాబ్‌లు, భవనాలు, ఇతర వసతులను క్షుణ్ణంగా పరిశీలించి తదనుగుణంగా నిర్ణయాలు తీసుకోవాలని భావిస్తోంది. ఇంజనీరింగ్‌తోపాటు ఇతర వృత్తి విద్యా కళాశాలల్లో ప్రతి మూడేళ్లకోసారి ఫీజులు పెంచాల్సి ఉండగా.. ఈసారి పెంచకూడదని ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటికే ఫీజుల పెంపుపై తెలంగాణ ప్రవేశాలు, ఫీజుల నియంత్రణ కమిటీ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపగా.. ఫీజులు ఎక్కువగా ఉన్నాయంటూ తిరస్కరించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో కొత్త కమిటీ ఏర్పాటు చేస్తున్నట్టు ప్రభుత్వం శుక్రవారం

మిగతా 11వ పేజీలో...

178 ఇంజనీరింగ్ కాలేజీలు.. 1,19,600 సీట్లు

నేటి నుంచే ఎప్‌సెట్-2025 కౌన్సెలింగ్

జూలై 18న తొలివిడత సీట్ల కేటాయింపు

25వ తేదీ నుంచి రెండో విడత కౌన్సెలింగ్

షెడ్యూల్ విడుదల చేసిన సాంకేతిక విద్యాశాఖ, తెలంగాణ ఉన్నత విద్యామండలి

11

నత్తనడకన ఇంటర్ అడ్మిషన్లు!

197 ప్రభుత్వ జూ. కాలేజీల్లో 100లోపు, 46 కాలేజీల్లో కేవలం 50లోపే ప్రవేశాలు

ఒక్క కాలేజీలో మాత్రమే వెయ్యికి పైగా..

సోషలిస్టు, సెక్యులర్ పదాలను రాజ్యాంగ పీఠిక నుంచి

తొలగించాలి

సంఘ్ నేత దత్తాత్రేయ హోసబలే సూచన

దేశంలో ఎమర్జెన్సీ విధించిన కాంగ్రెస్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ 2

ఆర్ఎస్ఎస్ ముసుగు తొలగిపోయింది

సంఘ్, బీజేపీలకు రాజ్యాంగం అక్కర్లేదు: రాహుల్



11

ఇందిరమ్మ ఇళ్ల బిల్లులు రాకుంటే

నా ఇల్లు అమ్మి చెల్లిస్తా!

పశుసంవర్థక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి

తమది చేతల ప్రభుత్వమని వ్యాఖ్య

వృద్ధుల చెరలో వార్ధక్యం

హైదరాబాద్‌లో సైబర్ నేరగాళ్ల బారిన పడుతున్న వారిలో వృద్ధులే అధికం

ఉరుకుల పరుగుల జీవితంలో కన్నవారిని పట్టించుకోలేనంత హడావుడి పిల్లలది!

పిల్లల ప్రేమకు నోచుకోని ఒంటరితనం, మాట్లాడే మనుషుల్లేని దైన్యం వృద్ధులది

వారి ఒంటరితనాన్ని ఆసరాగా చేసుకుని నమ్మించి దోచుకుంటున్న సైబర్ క్రిమినల్స్

హనీ ట్రాప్‌తో కొందరు వృద్ధులకు గాలం

పల్లెటూర్లలో ఆస్తి కోసం పిల్లల తగాదాలు

డబ్బు, ఆస్తుల కోసం కన్నవారిపైనే కత్తి దూస్తున్న పిల్లలు

9



రాజధాని హైదరాబాద్‌లో వెలుగుచూస్తున్న సైబర్ నేరాల్లో ఎక్కువమంది బాధితులు వృద్ధులే. దీనికి కారణం.. వృద్ధుల దగ్గర పెద్దమొత్తంలో ఉంటున్న డబ్బులే. రిటైర్మెంట్ బెనిఫిట్స్, సేవింగ్స్, ఇల్లు, పొలం వంటివి అమ్మడం వల్ల వచ్చిన సొమ్ము.. ఇలా ఏదో ఒక రూపంలో డబ్బులుంటున్నాయి. వారికి లేనిదల్లా ఒక్కటే.. పిల్లల నుంచి ఆత్మీయమైన పలకరింపు! పనులు, వృత్తి, ఉద్యోగాల బిజీలో పడిపోయి.. తల్లిదండ్రులను పలకరించలేనంత హడావుడి పట్నం పిల్లలది. ఆ ఒంటరితనాన్ని తట్టుకోలేని వృద్ధులు.. సైబర్ నేరగాళ్లకు సులభ లక్ష్యంగా మారుతున్నారు! వారు బెదిరిస్తే భయపడిపోతున్నారు! హనీట్రాప్‌లకు లొంగిపోతున్నారు!! అదే సమయంలో.. పల్లెల్లో వృద్ధులకు చుట్టూ 'నా అనేవారు' చాలా మంది ఉన్నా.. ఆస్తి, డబ్బు కోసం కన్నబిడ్డలే వారిని కడతేరుస్తున్నారు!! ఒక్కమాటలో చెప్పాలంటే.. డబ్బున్నచోట ఆప్యాయత కరువై, మందిబలం ఉన్న చోట వార్ధక్యం బరువై.. మలి వయసు చాలామందికి శాపంగా మారుతోంది.

భారత్‌తో భారీ వాణిజ్య ఒప్పందం

త్వరలోనే కుదుర్చుకోబోతున్నాం

నిన్ననే చైనాతో ఒప్పందంపై సంతకం చేశాం

అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వెల్లడి

ఒప్పందంపై చర్చల కోసం ఇప్పటికే వాషింగ్టన్‌కు చేరుకున్న భారత బృందం 2

అమెరికా సుప్రీంకోర్టులో ట్రంప్‌కు విజయం

డిస్ట్రిక్ట్ కోర్టుల పరిధిపై స్పష్టత

ఫెడరల్ ప్రభుత్వ ఆదేశాలను దేశవ్యాప్తంగా అడ్డుకోలేవని ప్రకటన 2

ఎమ్మెల్యేల మీద చేసిన వ్యాఖ్యలపై

వివరణ ఇవ్వండి

కొండా మురళికి పీసీసీ క్రమశిక్షణ కమిటీ పిలుపు

నేడు గాంధీభవన్‌లో హాజరుకు ఆదేశం 9

కదిలిన జగన్నాథుడి రథచక్రాలు


పూరీ జగన్నాథుడి రథయాత్ర, భారీ సంఖ్యలో హాజరైన భక్తులు

పూరీ, జూన్ 27: ఒడిశాలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం పూరీలో జగన్నాథ రథయాత్ర శుక్రవారం అత్యంత వైభవంగా ప్రారంభమైంది. ఈ వేడుకను ప్రత్యక్షంగా వీక్షించడానికి దేశ, విదేశాల నుంచి లక్షలాదిగా భక్తులు తరలివచ్చారు. పూరీ రహదారులపై స్వామివారు, ఆయన తోబుట్టువులైన బలభద్రుడు, సుభద్ర అధిష్ఠించిన రథాలను లాగడానికి వేలాది మంది భక్తులు బారులుతీరారు. వీరిలో ఒడిశా గవర్నర్ కంభంపాటి హరిబాబు, సీఎం మోహన్ చరణ్ మాఝీతో పాటు పలువురు ప్రముఖులు ఉన్నారు. అంతకుముందు ప్రధాన ఆలయం నుంచి దేవతామూర్తులను రథాల వద్దకు తీసుకొచ్చే పహండీ వేడుకలో భాగంగా తొలుత బలభద్రుడిని తాళధ్వజ రథంపైకి, సుభద్రను దర్పదలన్ రథంపైకి చేర్చారు. చివరగా భక్తుల జయజయ ధ్వానాల మధ్య జగన్నాథుడు తన నందిఘోష రథం వద్దకు చేరుకున్నారు. రథాలను అధిష్ఠించిన దేవతామూర్తులను పూరీ శంకరాచార్య నిశ్చలానంద సరస్వతి(81) దర్శించుకున్నారు. కొద్దిమంది శిష్యులతో కలసి వీల్‌చైర్‌లో వచ్చిన ఆయన స్వామివార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూరీ రాజు గజపతి దివ్యసింగ్ దేవ్ 'చెరా పహరా' క్రతువును పూర్తి చేశారు. దీనిలో భాగంగా మూడు రథాల లోపల, అవి ప్రయాణించే మార్గాన్ని ఆయన బంగారు చీపురుతో ఊడుస్తారు. ఈ కార్యక్రమం ముగిసిన తర్వాత రథాలకు వివిధ రంగుల చెక్క గుర్రాలను అమర్చారు. అనంతరం సాయంత్రం 4.08 గంటలకు 'జై జగన్నాథ' నినాదాల మధ్య బలభద్రుడి తాళధ్వజం ముందు కదలగా ఆ వెనుక దర్పదలన్, చివరగా నందిఘోష అనుసరించాయి. జగన్నాథుడి ఆలయం వద్ద ప్రారంభమైన ఈ ఊరేగింపు అక్కడకు 2.6 కిలోమీటర్ల దూరంలో ఉన్న గుండిచా ఆలయం వద్ద ముగుస్తుంది. కేంద్ర మంత్రులు ధర్మేంద్ర ప్రధాన్, గజేంద్ర సింగ్ షెకావత్, పూరీ ఎంపీ సంబిత్ పాత్రా, పలువురు ఒడిశా మంత్రులు పహండీ వేడుకను వీక్షించారు.

అహ్మదాబాద్ రథయాత్రలో అపశ్రుతి

గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో శుక్రవారం నిర్వహించిన రథయాత్రలో అపశ్రుతి చోటు చేసుకుంది. ఊరేగింపులో పాల్గొన్న ఏనుగు అదుపు తప్పి భక్తులపైకి దూసుకెళ్లింది. ఈ సందర్భంగా జరిగిన తొక్కిసలాటలో ఒక వ్యక్తి గాయపడ్డాడు. అహ్మదాబాద్‌లో 400 ఏళ్ల నాటి పురాతన జగన్నాథ ఆలయంలో ఏటా రథయాత్ర నిర్వహిస్సున్నారు.

కాలం చెల్లిన వాహనాలు బంకుల్లోనే సీజ్

» ఆ వాహనాలకు ఇంధనం బంద్..జూలై 1 నుంచి అమల్లోకి

న్యూఢిల్లీ/నోయిడా, జూన్ 27: ఢిల్లీలో కాలం చెల్లిన వాహనాలను పెట్రోల్ బంకుల్లో లేదా బహిరంగ ప్రదేశాల్లో పార్క్ చేసినట్టు గుర్తించినా వాటిని స్వాధీనం చేసుకోనున్నట్లు ఢిల్లీ రవాణా కమిషనర్ నిహారికా రాయ్ తెలిపారు. ఇలాంటి వాహనాలను వినియోగించకుండా ఉండేందుకుగాను స్వాధీనం చేసుకున్న వాహనాల యజమానులకు జరిమానాలను విధించనున్నట్టు చెప్పారు. ఫోర్ వీలర్ వాహనాలైతే యజమానులకు రూ.10వేలు, ద్విచక్ర వాహనదారులకు అయితే రూ.5వేల జరిమానా విధిస్తామన్నారు. జూలై ఒకటో తేదీ నుంచి దీన్ని అమలు చేయనున్నట్టు చెప్పారు. పదేళ్లు దాటిన డీజిల్ వాహనాలు, పదిహేనేళ్లు దాటిన పెట్రోల్ వాహనాలను కాలం చెల్లిన వాహనాలుగా పరిగణిస్తారు. కమిషన్ ఫర్ ఎయిర్ క్వాలిటీ మేనేజ్‌మెంట్(సీఏక్యూఎం) జారీచేసిన ఇంతకు ముందటి ఆదేశాల ప్రకారం.. జూలై ఒకటో తేదీ నుంచి కాలం చెల్లిన వాహనాలకు ఢిల్లీలో ఇంధనాన్ని విక్రయించరు. ఆ వాహనాలు ఏ రాష్ట్రంలో రిజిస్టర్ అయినా ఈ ఆదేశాలు వర్తిస్తాయి. కాగా కాలం చెల్లిన వాహనాలను గుర్తించడానికి గాను ఢిల్లీలోని దాదాపు 500 పెట్రోల్ బంకుల్లో ఆటోమేటెడ్ నంబర్ ప్లేట్ రికగ్నిషన్ (ఏఎన్‌పీఆర్) కెమెరాలను ఏర్పాటు చేశారు.

హైడ్రోజన్ వాహనాలకు కొత్త రిజిస్ట్రేషన్ ప్లేట్!

న్యూఢిల్లీ, జూన్ 27: హైడ్రోజన్ ఇంధనంతో నడిచే వాహనాలకు కొత్త కేటగిరీ రిజిస్ట్రేషన్ నంబర్ ప్లేట్‌ను అందుబాటులోకి తీసుకురావాలని కేంద్ర రోడ్డు రవాణా, హైవేల మంత్రిత్వ శాఖ ప్రతిపాదించింది. ఈమేరకు శుక్రవారం ముసాయిదా నోటిఫికేషన్‌ను జారీ చేసింది. దీని ప్రకారం.. హైడ్రోజన్ ఇంధనంతో నడిచే వాణిజ్య వాహన నంబర్ ప్లేట్ పై సగ భాగం ఆకుపచ్చ రంగులో, కింది సగభాగం నీలిరంగులో, ప్లేట్‌పై నంబర్లు పసుపు రంగులో ఉండనున్నాయి. ప్రైవేటు వాహనాలు అయితే నంబరు ప్లేట్ పై సగభాగం ఆకుపచ్చ రంగులో, కింది సగభాగం నీలిరంగులో, నంబర్లు తెలుపు రంగులో ఉండనున్నాయి. అద్దెపై నడిచే క్యాబ్‌లకు అయితే నంబరు ప్లేట్ పై సగభాగం నలుపు రంగులో, కింది సగ భాగం నీలి రంగులో, నంబర్లు పసుపు రంగులో ఉండనున్నాయి.

నక్సల్ ప్రభావిత బస్తర్‌కు త్వరలో రైలు!

న్యూఢిల్లీ, జూన్ 27: ఛత్తీస్‌గఢ్‌లోని నక్సల్ ప్రభావిత బస్తర్ ప్రాంతంలో సమీప భవిష్యత్తులోనే రైళ్లు పరుగులు తీయనున్నాయి. తెలంగాణలోని కొత్తగూడెంను ఛత్తీస్‌గఢ్‌లోని కిరందుల్‌ను కలుపుతూ 160 కి.మీ.ల రైల్వేలైను నిర్మాణానికి జరుపుతున్న లోకేషన్ సర్వే తుది అంకానికి చేరుకుంది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల మీదుగా వెళ్లే ఈ రైల్వేలైనులో అత్యధిక భాగం (138 కి.మీ.లు) ఛత్తీస్‌గఢ్‌లోనే ఉంటుంది. ఆ రాష్ట్రంలోని నక్సల్ ప్రభావిత బస్తర్ డివిజన్‌లోని సుక్మా, దంతేవాడ, బీజాపూర్ జిల్లాలు ఈ రైల్వే లైను పరిధిలోకి రానున్నాయి. దీంతో స్థానిక ప్రజలకు ముఖ్యంగా ఆదివాసీ, గిరిజనులకు విద్య, వైద్యం, వ్యాపారం, రవాణా రంగాల్లో కొత్త అవకాశాలు తెరుచుకుంటాయని అధికారులు చెబుతున్నారు. కేంద్ర హోంశాఖ పర్యవేక్షణలో.. అత్యాధునిక లైడార్ టెక్నాలజీతో ఈ సర్వేను నిర్వహిస్తున్నారు. సర్వే పూర్తయిన అనంతరం రైల్వే విభాగం.. డిటైల్డ్ ప్రాజెక్టు రిపోర్టును రూపొందిస్తుంది. అది ఆమోదం పొందిన తర్వాత రైల్వే లైను నిర్మాణం మొదలవుతుంది.

మధ్యవర్తిత్వంతో పెండింగ్ కేసుల పరిష్కారం

» జూలై 1 నుంచి 90 రోజుల పాటు కార్యాచరణ

» జాతీయ కార్యక్రమంగా చేపట్టిన సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ, జూన్ 27: పెండింగ్ కేసుల పరిష్కారంపై సుప్రీంకోర్టు ప్రత్యేక కార్యాచరణను ప్రారంభించనుంది. తాలూకా స్థాయి కోర్టుల నుంచి హైకోర్టుల వరకు పెండింగ్‌లో ఉన్న వివాదాలను తేల్చేందుకు 90 రోజుల పాటు 'జాతీయ స్థాయి మధ్యవర్తిత్వ ప్రచార కార్యక్రమా'న్ని నిర్వహించనుంది. 'జాతి కోసం మధ్యవర్తిత్వం' పేరుతో జరిగే ఈ కార్యక్రమం జులై ఒకటో తేదీన ప్రారంభమయి సెప్టెంబరు 30న ముగియనుంది. ఈ విషయాన్ని సుప్రీంకోర్టు ఆధ్వర్యంలోని మధ్యవర్తిత్వ, సాంత్వన ప్రాజెక్టు కమిటీ (మీడియేషన్ అండ్ కాన్సిలియేషన్ ప్రాజెక్టు కమిటీ-ఎంసీపీసీ), జాతీయ న్యాయసేవల సంస్థ (నల్సా) గురువారం ప్రకటించాయి. స్నేహపూర్వక విధానంలో మధ్యవర్తిత్వం ద్వారా కేసులు పరిష్కరించవచ్చన్న విషయాన్ని దేశం నలుమూలలకు తీసుకెళ్లనున్నట్టు సుప్రీంకోర్టు ఈ సందర్భంగా విడుదల చేసిన ప్రకటనలో తెలిపింది. రాజీకి అనుకూలంగా ఉండే కేసులను గుర్తించి, వాటిని మధ్యవర్తిత్వ విధానం ద్వారా పరిష్కరించుకోవచ్చన్న భావనను ప్రజల్లో కల్పించనున్నట్టు పేర్కొంది. జులై ఒకటో తేదీ నుంచి 30 వరకు పెండింగ్ కేసుల గుర్తింపు, కక్షిదారులు, మధ్యవర్తులకు సమాచారం పంపించే ప్రక్రియ కొనసాగుతుంది. అనంతరం కేసులపై ఆయా కోర్టుల్లో సంప్రదింపులు జరుగుతాయి. వారంలో మొత్తం ఏడు రోజుల పాటు విచారణ జరగనుంది.

ఒక్కసారిగా ఆగిపోయిన సీఎం కాన్వాయ్‌లోని 19 వాహనాలు

» వాహనాల్లో పోసిన డీజిల్‌లో నీళ్లు కలవడమే కారణం



భోపాల్, జూన్ 27: మధ్యప్రదేశ్ సీఎం మోహన్ యాదవ్ కాన్వాయ్‌లోని 19 వాహనాలు ఒక్కసారిగా ఆగిపోవడం కలకలం రేపింది. ముఖ్యమంత్రితో పాటు ఆయన సిబ్బంది ఇండోర్ నుంచి రాట్లాంలో జరిగే ఓ కార్యక్రమంలో పాల్గొనేందుకు వెళ్తుండగా ఈ ఘటన జరిగింది. దోసిగావ్ అనే గ్రామంలో ఉన్న శక్తి పెట్రోల్ పంప్ వద్ద సీఎం వాహన శ్రేణిలోని టయోటా ఇన్నోవాల్లో డీజిల్ కొట్టించారు. బయలుదేరిన కొద్ది సేపటికే వాహనాలు మొరాయించాయి. దీంతో డ్రైవర్లు, సీఎం సిబ్బంది రోడ్లపై నుంచి వాహనాలను పక్కకు తోసుకెళ్లారు. డీజిల్‌లో నీళ్లు కలవడం వల్లే వాహనాలన్నీ ఆగిపోయాయని తేలింది. ఆ వెంటనే మరో వాహన శ్రేణిని తెప్పించి సీఎంను, ఇతర అధికారులను తరలించారు. మరోవైపు వానల వల్లే డీజిల్‌లో నీళ్లు కలిశాయని పెట్రోల్ బంకు యజమాని చెబుతున్నా అధికారులు నమ్మలేదు. బంకును సీజ్ చేశారు.

ముగ్గురు పిల్లల్ని కనండి: మస్క్



న్యూఢిల్లీ, జూన్ 27: జననాల రేటు తగ్గుదల మానవజాతికే ముప్పు అని ఎలాన్ మస్క్ హెచ్చరించారు. ఒకే సంతానంతో సరిపెట్టుకునేవారు లేదా అస్సలు పిల్లలు వద్దనుకునేవారితో వచ్చే లోటును భర్తీని చేయడానికి పిల్లల్ని కనగలిగేవారు ముగ్గురు పిల్లల్ని కనాలని, లేదంటే జనాభా పతనమవుతుంది అని ఆయన చెప్పారు. ఈ మేరకు ఎక్స్‌లో పోస్టు చేస్తూ పారిశ్రామికవేత్త మారియో నాఫాల్ షేర్ చేసిన పోస్టును కూడా దానికి జత చేశారు. ఫార్చ్యూన్ నివేదికలోని వివరాలతో నాఫాల్ ఆ పోస్టు చేశారు. సుస్థిర జనాభా స్థాయిని కొనసాగించడానికి ప్రతి మహిళ సగటున 2.7 మంది పిల్లలకు జన్మనివ్వాలని ఆ నివేదిక స్పష్టం చేసింది. ప్రస్తుతం అమెరికాలో ఆ సగటు 1.66గా ఉందని, చాలాధనిక దేశాల్లో పరిస్థితి ఇంతకన్నా ఘోరంగా ఉందని తెలిపింది.

భారత్‌తో భారీ వాణిజ్య ఒప్పందం

త్వరలోనే కుదుర్చుకోబోతున్నాం

» నిన్ననే చైనాతో ఒప్పందంపై సంతకం

» అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వెల్లడి



వాషింగ్టన్, జూన్ 27: భారత్‌తో త్వరలో అతి పెద్ద వాణిజ్య ఒప్పందం కుదుర్చుకోనున్నట్టు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వెల్లడించారు. ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక ఒప్పందం దిశగా జరుగుతున్న చర్చల్లో పురోగతి కనిపిస్తోందని తెలిపారు. గురువారం వైట్‌హౌజ్‌లో ఆయన మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. "అమెరికాతో వాణిజ్య ఒప్పందంపై ఎవరైనా ఆసక్తి చూపుతున్నారా? అని అడిగారు కదా! ప్రతి దేశం అమెరికాతో ఒప్పందం కుదుర్చుకోవాలని, భాగస్వామ్యం కావాలని కోరుకుంటోంది. ప్రభుత్వ యంత్రాంగం దీనిపై రాత్రింబవళ్లు పనిచేస్తోంది. ఒప్పందాలు కుదుర్చుకునే ప్రక్రియ కొనసాగిస్తోంది. కొన్ని గొప్ప ఒప్పందాలు జరగబోతున్నాయి. నిన్ననే చైనాతో ఒప్పందంపై సంతకం చేశాం. భారత్‌తోనూ త్వరలో ఒప్పందం చేసుకోబోతున్నాం. అది భారీ స్థాయిలో ఉండబోతోంది.." అని ట్రంప్ వెల్లడించారు. అలాగని అన్ని దేశాలతో ఒప్పందాలు కుదుర్చుకోబోమని చెప్పారు. కొందరికి ఒక లేఖ రాసి ధన్యవాదాలు చెబుతామని.. వారు 25శాతమో, 35శాతమో, 45శాతమో పన్ను కట్టాల్సి ఉంటుందని స్పష్టం చేస్తామని పేర్కొన్నారు. కానీ తమవాళ్లు ఇలా చేయాలని కోరుకోవడం లేదని, ఎక్కువ ఒప్పందాలు కుదుర్చుకోవాలని కోరుకుంటున్నారని వెల్లడించారు. అయితే చైనాతో ఒప్పందంలోని అంశాలేమీ ట్రంప్ వెల్లడించలేదు. మరోవైపు కొన్ని నియంత్రిత ఉత్పత్తులను అమెరికాకు ఎగుమతి చేసేందుకు అనుమతిస్తామని.. చైనాకు వ్యతిరేకంగా అమెరికా చేపట్టిన చర్యలను అమెరికా వెనక్కి తీసుకుంటుందని పేర్కొంటూ చైనా వాణిజ్యశాఖ శుక్రవారం ఒక ప్రకటన జారీ చేసింది.

వాషింగ్టన్‌కు చేరుకున్న భారత బృందం

అమెరికాతో వాణిజ్య ఒప్పందంపై చర్చించేందుకు వాణిజ్య శాఖ ప్రత్యేక కార్యదర్శి రాజేశ్ అగర్వాల్ నేతృత్వంలోని భారత బృందం గురువారమే వాషింగ్టన్‌కు చేరుకుంది. ట్రంప్ సుంకాల ప్రకటన నేపథ్యంలో.. ద్వైపాక్షిక ఒప్పందంపై ఇరు దేశాల మధ్య కొన్ని నెలలుగా చర్చలు జరుగుతున్నాయి. సుంకాల అమలుకోసం పెట్టుకున్న గడువు జూలై 9వ తేదీ నాటికి ఒప్పందం కుదుర్చుకునే దిశగా అడుగులు పడుతున్నాయి. యాపిల్స్, నట్స్, కొన్ని రకాల జన్యుమార్పిడి వ్యవసాయ ఉత్పత్తులు, పాడి ఉత్పత్తులు, పలు రకాల పారిశ్రామిక ఉత్పత్తులు, ఎలక్ట్రిక్ వాహనాలు, మద్యం, పెట్రోలియం ఉత్పత్తులపై దిగుమతి సుంకాలు మినహాయించాలని అమెరికా కోరుతుంది. ఇందులో వ్యవసాయ, పాడి దిగుమతుల విషయంలో కస్టమ్స్ పన్నును మినహాయించే/ తగ్గించే అంశంలో పీటముడి పడుతోంది. అలా చేస్తే భారత రైతులపై ప్రభావం పడుతుందన్న ఆందోళన ఉంది. ఇక జౌళి ఉత్పత్తులు, వస్త్రాలు, ఆభరణాలు, రత్నాలు, తోలు, ప్లాస్టిక్ ఉత్పత్తులు, రసాయనాలు, నూనె గింజలు, రొయ్యలు, ద్రాక్ష, అరటి వంటివాటిపై దిగుమతి సుంకాలు మినహాయించాలని/తగ్గించాలని అమెరికాను భారత్ కోరుతోంది.

మెరిట్ ఆధారిత వీసా ప్రక్రియ ఉండాలి

అమెరికా కొత్త నిబంధనలపై భారత్

న్యూఢిల్లీ, జూన్ 27: వీసాల మంజూరు విషయంలో అమెరికా కొత్త నిబంధనలు, మార్గదర్శకాలపై భారత్ స్పందించింది. భారతీయుల వీసా దరఖాస్తులను మెరిట్ ఆధారంగా పరిగణించాలని విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి జైశ్వాల్ కోరారు. భారతీయ పౌరుల చట్టబద్ధమైన హక్కులను కాపాడేందుకు కాన్సులర్ సేవలకు సంబంధించిన అన్ని విషయాల్లో అమెరికాతో భారత్ నిరంతరం టచ్‌లో ఉంటుందని పేర్కొన్నారు. ఇక నుంచి తమ దేశ వీసాకు దరఖాస్తు చేసే వారందరూ గత ఐదేళ్లలో వినియోగించిన అన్ని సోషల్ మీడియా ఖాతాల యూజర్ నేమ్‌లు లేదా హ్యాండిల్స్ వివరాలను డీఎస్-160 ఫామ్‌లో వెల్లడించాలని భారత్‌లోని అమెరికా ఎంబసీ గురువారం ఓ ప్రకటనలో స్పష్టం చేసిన విషయం తెలిసిందే. లేదంటే అప్లికేషన్ తిరస్కరణకు గురయ్యే అవకాశంతో పాటు భవిష్యత్తులో వీసా పొందేందుకు అనర్హులవుతారని హెచ్చరించింది. మరోవైపు వలసదారులకు యూఎస్ సిటిజన్‌షిప్ అండ్ ఇమ్మిగ్రేషన్ సర్వీసెస్ (యూఎస్‌సీఐఎస్) గట్టి హెచ్చరికలు చేసింది. ఎవరైనా తమ దేశ చట్టాలను ఉల్లంఘిస్తే తీవ్ర పరిణామాలను ఎదుర్కోవాల్సి ఉంటుందని, వారి గ్రీన్‌కార్డులు, వీసాలను రద్దు చేస్తామని స్పష్టం చేసింది. ఈ మేరకు తాజాగా 'ఎక్స్'లో పోస్టు చేసింది. ఉగ్రవాదానికి మద్దతు పలకడం, ప్రోత్సహించడం వంటి తీవ్ర నేరాల్లో దోషులుగా తేలినవారి గ్రీన్‌కార్డులు, వీసాలను రద్దు చేస్తామని పేర్కొంది. అమెరికాలో నివసించడం షరతులతో కూడిన ప్రత్యేక సౌకర్యం మాత్రమేనని, హామీ ఇవ్వబడిన హక్కు కాదని స్పష్టం చేసింది. హింసను ప్రోత్సహించినా, ఉగ్ర కార్యకలాపాలకు మద్దతు పలికినా.. అమెరికాలో నివసించేందుకు అనర్హులవుతారని పేర్కొంది.

లోకం తీరు



అమెరికా సుప్రీంకోర్టులో ట్రంప్‌నకు భారీ విజయం

» డిస్ట్రిక్ట్ కోర్టుల పరిధిపై స్పష్టత

» ఫెడరల్ ప్రభుత్వ ఆదేశాలను దేశవ్యాప్తంగా అడ్డుకోలేవని ప్రకటన

వాషింగ్టన్, జూన్ 27: అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌నకు శుక్రవారం సుప్రీంకోర్టులో భారీ విజయం లభించింది. ఫెడరల్ ప్రభుత్వం జారీ చేసే ఆదేశాలను దేశవ్యాప్తంగా నిలుపుదల చేస్తూ ఏకన్యాయమూర్తి ఆధ్వర్యంలో పనిచేసే కోర్టులు ఆదేశాలు ఇవ్వలేవని, వాటికి ఆ అధికారం లేదని స్పష్టం చేసింది. ట్రంప్ జారీ చేసిన ఆదేశాలను ఇటీవల కాలంలో పలు డిస్ట్రిక్ట్ జడ్జి కోర్టులు అడ్డుకుంటున్న నేపథ్యంలో సుప్రీంకోర్టు ఇచ్చిన ఈ ఆదేశానికి ప్రాధాన్యం ఏర్పడింది. ముఖ్యంగా జన్మతః పౌరసత్వ విధానాన్ని రద్దు చేస్తూ ఆయన ఇచ్చిన ఉత్తర్వులను డిస్ట్రిక్ట్ కోర్టులు నిలుపుదల చేశాయి. అయితే, కోర్టు తీర్పు నేపథ్యంలో జన్మతః పౌరసత్వం విషయమై ఆయన ఇచ్చిన ఆదేశాలు చెల్లుబాటు అవుతాయా, లేదా అన్నదానిపై ఇంకా స్పష్టత రాలేదు. ఆ ఆదేశాలను పలు రాష్ట్రాలు వ్యతిరేకిస్తుండడమే ఇందుకు కారణం.

ఇరాన్‌కు అమెరికా ఆర్థిక సాయం!

న్యూఢిల్లీ, జూన్ 27: ఇరాన్‌లో పౌర అణు కార్యక్రమంలో భాగంగా అణు విద్యుత్ కేంద్రాల నిర్మాణానికి సుమారు రూ.2.5 లక్షల కోట్లు (30 బిలియన్ డాలర్లు) సాయం అందించాలని ట్రంప్ యంత్రాంగం భావిస్తోంది. అంతేకాదు ఇరాన్‌పై గతంలో విధించిన పలు ఆంక్షలను తొలగించడంతో పాటు ఆ దేశానికి సంబంధించి స్తంభింపజేసిన రూ.51 వేల కోట్ల (6 బిలియన్ డాలర్లు) నిధులను విడుదల చేసేందుకూ సిద్ధమైంది. అమెరికా ప్రత్యేక దౌత్యవేత్త స్టీవ్ విట్కాఫ్, గల్ఫ్ దేశాల ప్రతినిధులతో జరిగిన సుదీర్ఘ చర్చల్లో ఈ మేరకు ప్రతిపాదన వచ్చిందంటూ సీఎన్ఎన్ వార్తా సంస్థ తెలిపింది.

భూప్రదక్షిణకో బ్యాడ్జీ!



న్యూఢిల్లీ, జూన్ 27: అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి చేరుకున్న శుభాన్షు శుక్లాకు.. యాక్సియం-4 మిషన్ కమాండర్ పెగ్గీ విట్సన్ 634వ బ్యాడ్జీ (బంగారు రంగు పిన్) బహూకరించిన సంగతి తెలిసిందే! భూకక్ష్యలో తిరుగుతున్న 634వ వ్యోమగామి అని దీని అర్థం. శుభాన్షు లాగానే తొలిసారి రోదసిలోకి వెళ్లిన పోలండ్, హంగరీ వ్యోమగాములకు వరుసగా 635, 636 నంబర్ బ్యాడ్జీలు ఇచ్చారు. మొదటిసారి రోదసిలోకి వెళ్లే వ్యోమగాములకు ఇచ్చే ఈ చిన్న చిన్న పిన్‌ల వెనుక పెద్ద కథే ఉంది. ఐదు కోణాలుండే బంగారు రంగు నక్షత్రం నుంచి రెండు కిరణాలు వెలువడుతున్నట్టుగా ఉండే ఈ పిన్‌లో కింద ఉండే వృత్తాకార భాగం భూమికి గుర్తు. ఈ పిన్‌ను ధరించారంటే.. భూమిని చుట్టొచ్చారని అర్థం. 2015లో 'అసోసియేషన్ ఆఫ్ స్పేస్ ఎక్స్‌ప్లోరర్స్ (ఏఎస్ఈ)' దీన్ని డిజైన్ చేసింది. దేశాలతో సంబంధం లేకుండా వ్యోమగాములందరికీ ఇచ్చే ఒక అంతర్జాతీయ చిహ్నాన్ని రూపొందించాలని భావించి దీన్ని తయారు చేశారు. అలా రూపొందించిన తొలి పిన్‌ను 2020లో జపనీస్ వ్యోమగామి నొగుచికి ఇచ్చారు. శుభాన్షు కన్నా ముందు రోదసిలోకి వెళ్లి భూప్రదక్షిణం చేసిన మన భారతీయ వ్యోమగాములైన రాకేశ్ శర్మకు 138వ బ్యాడ్జీ, కల్పనాచావ్లాకు 366వ నంబర్ బ్యాడ్జీ అందజేశారు. భూప్రదక్షిణ చేసినవారికే కాదు.. ఆకాశం అంచుల దాకా.. అంటే కర్మన్‌లైన్ దాకా వెళ్లొచ్చినవారికి సైతం, దాన్ని సబ్-ఆర్బిటల్ ఫ్లైట్‌గా భావించి వారికి ఒకరకం పిన్‌లు ఇస్తారు. ఇందులో భూమిని సూచించే వృత్తం ఉండదు.

లా విద్యార్థినిపై గ్యాంగ్ రేప్!

(మొదటి పేజీ తరువాయి)

ఇన్‌హేలర్ ఇచ్చిన నిందితులు.. ఆమె తలపై హాకీ స్టిక్‌తో కొట్టారు. తమ మాట వినకున్నా, జరిగింది ఎవరికైనా చెప్పినా తల్లిదండ్రులను చంపేస్తామని ఆమెను బెదిరించి రాక్షసంగా ప్రవర్తించారు. నిందితుల్లో ఒకరైన పూర్వ విద్యార్థి చేసిన పెళ్లి ప్రతిపాదనను బాధితురాలు నిరాకరించడంతోనే వారు ఈ కిరాతకానికి పాల్పడినట్టు తెలిసింది. కోల్‌కతాలోని కస్బా ప్రాంతంలోని సౌత్ కలకత్తా లా కళాశాలలో బుధవారం రాత్రి ఈ దారుణం జరిగింది. బాధితురాలు గురువారం చేసిన ఫిర్యాదు మేరకు పోలీసులు..మనోజిత్ మిశ్రా(31), జైబ్ అహ్మద్(19), ప్రమిత్ ముఖర్జీ(20) అనే ముగ్గురిని అరెస్టు చేశారు. నిందితుల్లో మనోజిత్ మిశ్రా.. సౌత్ కలకత్తా కళాశాల పూర్వ విద్యార్థి. ప్రస్తుతం అదే కళాశాల ఉద్యోగైన మనోజిత్ తృణమూల్ కాంగ్రెస్ పార్టీ విద్యార్థి విభాగం నేతగా కొనసాగుతున్నాడు. జైబ్ అహ్మద్, ప్రమిత్ లా చదువుతున్నారు.

చుట్టుముట్టి ఈడ్చుకెళ్లి..

బాధితురాలు ఫిర్యాదులో పేర్కొన్న ప్రకారం.. కళాశాల ఆవరణలో గురువారం సాయంత్రం జరిగిన టీఎంసీ విద్యార్థి సంఘం సమావేశం అనంతరం ఏడున్నర గంటలప్పుడు మనోజిత్, జైబ్, ప్రమిత్ ఆమెను అడ్డుకున్నారు. జైబ్‌తో కలిపి ఆమెను ఓ గదిలో పెట్టి గడియ వేశారు. మనోజిత్, ప్రమిత్ బయట ఉండగా.. జైబ్ ఆమెను అత్యాచారం చేసేందుకు ప్రయత్నించాడు. జైబ్‌ను ప్రతిఘటించిన బాధితురాలు తనను వదిలేయమని, తాను మరొకరితో ప్రేమలో ఉన్నానని వేడుకుంది. ఓ దశలో కన్నీళ్లు పెట్టుకుంటూ జైబ్ కాళ్లు పట్టుకుని బ్రతిమలాడింది. ఈ క్రమంలో తీవ్ర భయాందోళనకు గురైన బాధితురాలు ఊపిరి తీసుకునేందుకు ఇబ్బంది పడుతుండగా.. మనోజిత్, ప్రమిత్‌ను జైబ్ గదిలోకి పిలిచాడు. తనకు ఇన్‌హెల్లర్ కావాలని బాధితురాలు ప్రాధేయపడగా మనోజిత్ తెచ్చి ఇచ్చాడు. దీంతో కాస్త తేరుకున్న బాధితురాలు.. వారి నుంచి తప్పించుకునేందుకు బయటకు పరుగెత్తింది. అయితే, కళాశాల ప్రధాన గేటు వద్ద ఆమెను అడ్డుకున్న నిందితులు.. సెక్యూరిటీ గార్డు గదిలోకి ఈడ్చుకెళ్లారు. సెక్యూరిటీ గార్డును బయటకు పంపేశారు. ఆమెను వివస్త్రను చేసిన జైబ్... మనోజిత్, ప్రమిత్ చూస్తుండగానే అత్యాచారం చేశాడు. సెక్యూరిటీ గార్డు నిస్సహాయంగా గది బయట ఉండిపోయాడు. ఈ క్రమంలో నిందితులు బాధితురాలి తలపై హాకీ స్టిక్‌తో కొట్టారు. ఎవరికైనా చెబితే నీ తల్లిదండ్రులు, బాయ్ ఫ్రెండ్‌ను చంపేస్తామని బెదిరించారు. రాత్రి 10;50 గంటలప్పుడు ఆమెను విడిచిపెట్టారు.

సుమోటోగా స్వీకరించిన ఎన్‌సీడబ్ల్యూ

లా విద్యార్థినిపై అత్యాచార ఘటనపై జాతీయ మహిళా కమిషన్ (ఎన్‌సీడబ్ల్యూ) తీవ్రంగా స్పందించింది. ఈ అంశాన్ని సుమోటోగా స్వీకరించిన ఎన్‌సీడబ్ల్యూ మూడు రోజుల్లోగా తమకు నివేదిక ఇవ్వాలని కోల్‌కతా పోలీసులను శుక్రవారం ఆదేశించింది. మరోపక్క, నిందితుల్లో ఒకరైన మనోజిత్.. టీఎంసీ విద్యార్థి విభాగం నేత కావడంతో రాష్ట్రంలో రాజకీయ దుమారం రేగింది. అధికార టీఎంసీపై బీజేపీ నేతలు తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తుతున్నారు. ఇక, అత్యాచార ఘటనను టీఎంసీ కూడా ఖండించింది.

'సిబిల్' రిపోర్టు సరిలేదని ఊస్టింగ్!


» నియామకాన్ని రద్దు చేసిన ఎస్‌బీఐ

» సమర్థించిన మద్రాస్ హైకోర్టు

చెన్నై, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): పేలవమైన క్రెడిట్ చరిత్ర కారణంగా అభ్యర్థి నియామకాన్ని రద్దు చేయాలన్న ప్రభుత్వరంగ బ్యాంకు ఎస్‌బీఐ నిర్ణయాన్ని మద్రాస్ హైకోర్టు సమర్థించింది. బ్యాంకింగ్ ఉద్యోగాల్లో ఆర్థిక క్రమశిక్షణ చాలా కీలకమని, బ్యాంకు తీసుకున్న నిర్ణయం సబబేనని స్పష్టం చేసింది. ఎస్‌బీఐలో సర్కిల్ బేస్డ్ ఆఫీసర్ (సీబీవో) ఉద్యోగానికి పరీక్షలు, ఇంటర్వ్యూలు, వైద్య పరీక్షలతో సహా అన్ని దశలను దాటాక.. తన సిబిల్ రిపోర్ట్ సరిలేదన్న కారణంగా తన నియామకాన్ని సదరు బ్యాంకు రద్దు చేయడాన్ని సవాల్ చేస్తూ ఓ అభ్యర్థి హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై విచారణ జరిపిన ధర్మాసనం పై మేరకు అభిప్రాయపడింది. ఉద్యోగ నోటిఫికేషన్ సమయంలో తనకు ఎలాంటి పెండింగ్ బకాయిలు లేవని, తన నియామక రద్దు అన్యాయమని పిటిషనర్ పేర్కొన్నారు. అయితే, పిటిషనర్ సిబిల్ రిపోర్టులో పలు అవకతవకలున్నాయని, పదికి పైగా విచారణలు జరిగాయని, ఇది తీవ్ర ఆర్థిక దుర్వినియోగాన్ని సూచిస్తున్నట్లు ఎస్బీఐ తరఫు న్యాయవాది పేర్కొన్నారు. ఇరువర్గాల వాదనల అనంతరం ధర్మాసనం స్పందిస్తూ.. బ్యాంకు ఉద్యోగులు ప్రజాధనాన్ని నిర్వహిస్తారని, ఆర్థిక క్రమశిక్షణ లేని వ్యక్తిని ప్రజల డబ్బు నిర్వహణ వ్యవహారంలో విశ్వసించలేమని పేర్కొంది. పిటిషన్‌కు ఎలాంటి విచారణార్హత లేదని కొట్టివేసింది.

సోషలిస్టు, సెక్యులర్ పదాలను రాజ్యాంగ పీఠిక నుంచి తొలగించాలి

» సంఘ్ నేత హోసబోలే పిలుపు



న్యూఢిల్లీ, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ పీఠిక నుంచి సామ్యవాదం (సోషలిస్టు), లౌకికవాదం (సెక్యులరిజం) అనే పదాలను తొలగించాలని ఆర్ఎస్ఎస్ ప్రధాన కార్యదర్శి దత్తాత్రేయ హోసబోలే అభిప్రాయపడ్డారు. అంబేద్కర్ రచించిన రాజ్యాంగ ముసాయిదాలో ఇవి లేవని.. ఎమర్జెన్సీ సమయంలో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం వీటిని పీఠికలో చేర్చిందని అన్నారు. ఆయన వ్యాఖ్యలపై కాంగ్రెస్, సీపీఎం విరుచుకుపడ్డాయి. హోసబోలే గురువారం ఢిల్లీలో జరిగిన ఓ కార్యక్రమంలో మాట్లాడారు. 'బాబాసాహెబ్ రాసిన రాజ్యాంగ పీఠికలో ఈ పదాలు ఎప్పుడూ లేవు. ఎమర్జెన్సీ సమయంలో సోషలిస్టు, సెక్యులర్ పదాలను పీఠికలో చేర్చారు. అలాగే బలవంతంగా కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు పెద్దఎత్తున చేయించారు. ఇలాంటి పనులు చేసినవాళ్లు ఇప్పుడు రాజ్యాంగ ప్రతిని చేతిలో పట్టుకుని తిరుగుతున్నారు. ఎమర్జెన్సీ విధించినందుకు ఇప్పటి వరకు క్షమాపణ చెప్పలేదు. మీ పూర్వీకులు చేసినదానికి క్షమాపణ కోరాల్సిందే' అని స్పష్టంచేశారు. ఆర్ఎస్ఎస్ ముసుగు మళ్లీ తొలగిపోయిందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ అన్నారు. ఆ సంస్థకు, బీజేపీకి రాజ్యాంగం అవసరం లేదని, వారికి మనుస్మృతి కావాలని 'ఎక్స్'లో మండిపడ్డారు. సమానత్వం, లౌకికవాదం, న్యాయం గురించి రాజ్యాంగం మాట్లాడుతుంది కాబట్టి బీజేపీకి నచ్చడం లేదన్నారు. రాజ్యాంగం వంటి శక్తివంతమైన ఆయుధాన్ని పేదల నుంచి లాక్కోవడమే బీజేపీ నిజమైన ఎజెండాగా పేర్కొన్నారు. అయితే, బీజేపీ కలలను ఎప్పటికీ విజయవంతం కానివ్వబోమని చెప్పారు. హోసబోలే వ్యాఖ్యలపై కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా స్పందించింది. అంబేద్కర్ విజన్‌పై ఆర్ఎస్ఎస్ కుట్ర చేస్తోందని 'ఎక్స్'లో విమర్శించింది. పీఠికలో సోషలిస్టు, సెక్యులర్ పదాలు ఉంచడంపై సమీక్షించాలనడం రాజ్యాంగ ఆత్మపైనే దాడిగా అభివర్ణించింది. భారత రాజ్యాంగమంటే ఆర్ఎస్ఎస్‌కు మొదటి నుంచీ గౌరవం లేదని, దానిని అంగీకరించలేదని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ అన్నారు.

వృద్ధులను కట్టేసి.. గదుల్లో బంధించి..



» నోయిడాలోని వృద్ధాశ్రమంలో దుర్భర స్థితిలో వృద్ధులు

న్యూఢిల్లీ, జూన్ 27: అదో వృద్ధాశ్రమం! లోపల నేలమాళిగల్లాంటి గదుల్లో ముక్కు పుటలు అదిరిపోయేంత దుర్గంధం! అక్కడ చిమ్మచీకట్లో మలమూత్రాల మధ్య వయసు మళ్లిన వాళ్లంతా పడి ఉన్నారు. మగవాళ్లలో కొందరికి ఒంటిమీద సరైన వస్త్రాల్లేవు. మహిళల్లో కొందరిది ఇదే దైన్యం! కొందరికి చేతులు కట్టేశారు. బాధితులనంతా గదుల్లో పెట్టి లోపలికి ఎవ్వరూ వెళ్లకుండా బయట నుంచి తాళాలు వేశారు. యూపీ నోయిడాలోని సెక్టార్-55లోని ఆనంద్ నికేతన్ అనే పేరుతో నడుస్తున్న వృద్ధాశ్రమంలో 40 మంది వృద్ధుల పరిస్థితి ఇది! ఇంట్లో సరైన ఆదరణ కరువైన స్థితిలో ఆశ్రమంలోనైనా జీవన మలిసంధ్యను సంతోషంగా గడపొచ్చునని ఆశపడ్డ వృద్ధులు ఇలా అత్యంత దుర్భర పరిస్థితులను ఎదుర్కొంటున్నారు. ఆశ్రమ నిర్వాహకులు డొనేషన్ కింద వృద్ధుల కుటుంబాల నుంచి రూ.2.5 లక్షల చొప్పున తీసుకున్నారు. వసతి, భోజనం ఖర్చుల కింద నెలకు రూ.6వేల చొప్పున వసూలు చేస్తున్నారు. ఆశ్రమంలో ఓ మహిళను కట్టేసి, గదిలో బంధించిన తాలూకు వీడియో ఒకటి నెట్‌లో వైరల్‌గా మారడంతో యూపీ మహిళా కమిషన్, ఆ రాష్ట్ర సాంఘిక సంక్షేమ విభాగం అధికారుల సమక్షంలో వృద్ధాశ్రమంపై సిబ్బంది దాడులు నిర్వహించారు. అక్కడున్న ఓ మహిళా ఉద్యోగిని అధికారులు ప్రశ్నించగా తాను నర్సునని చెప్పింది. వృద్ధాశ్రమాన్ని అనుమతుల్లేకుండా నిర్వహిస్తున్నట్లు అధికారులు తేల్చారు. ఆశ్రమంలోని దారుణ పరిస్థితులపై బాధిత కుటుంబాల నుంచి ఎవ్వరూ నోరువిప్పకపోవడం మరింత ఆశ్చర్యం కలిగిస్తోంది. ఆశ్రమాన్ని సీజ్ చేసిన అధికారులు..అందులోని 40 మంది వృద్ధులను రక్షించి.. అక్కడి నుంచి తరలించారు.

పెద్దపల్లి ఆర్‌వోబీ వద్ద విరిగిన క్లస్టర్

» పలు రైళ్ల రాకపోకలకు అంతరాయం

పెద్దపల్లి, జూన్ 27(ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి రైల్వే జంక్షన్ సమీపంలోని కూనారం ఆర్‌వోబీ వద్ద క్లస్టర్ విరిగిపోయింది. దీంతో కాజీపేట-బల్హార్షా మార్గంలో రైళ్లు నిలిచిపోయాయి. ఆర్‌వోబీ నిర్మాణంలో భాగంగా రైల్వే ట్రాక్‌పై గడ్డర్లు ఏర్పాటు చేసేందుకు నిర్మించిన ఇనుప క్లస్టర్ విరిగిపోయింది. గమనించిన ఇంజినీరింగ్ అధికారులు వెంటనే రైళ్ల రాకపోకలను నిలిపివేయాలని రైల్వే అధికారులకు సమాచారం ఇచ్చారు. ఈ అవాంతరం వల్ల ఇంటర్ సిటీ, సిర్పూర్ కాగజ్‌నగర్, రామగిరి, సింగరేణి ఎక్స్‌ప్రెస్ రైళ్లను పాక్షికంగా రద్దు చేయగా, దూర ప్రాంతాలకు వెళ్లే రైళ్లు యథాతథంగా నడిచాయి. సికింద్రాబాద్- నాగపూర్‌కు వెళ్లే వందేభారత్ ఎక్స్‌ప్రెస్ మూడు గంటలు ఆలస్యంగా బయలు దేరింది.

మంజీరా బ్యారేజీకి పగుళ్లు లేవు

» ముప్పు లేదు.. సేఫ్ జోన్‌లోనే ఉంది
» అప్రాన్ కొట్టుకుపోవడం నిజమే
» రిపేర్లకు రూ.3.50 కోట్లు కేటాయించాం
» జూరాల గేట్ల రోప్‌లకు మరమ్మతులు చేయిస్తున్నాం: రాహుల్ బొజ్జా



సంగారెడ్డి రూరల్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ జంట నగరాలతో పాటు పరిసర గ్రామాలకు తాగునీటిని అందించే మంజీరా బ్యారేజీకి ఎలాంటి ముప్పు లేదని నీటిపారుదల శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి రాహుల్ బొజ్జా స్పష్టం చేశారు. మంజీరా బ్యారేజీకి ఎలాంటి పగుళ్లు లేవని, ప్రాజెక్టు సేఫ్ జోన్‌లో ఉందని తెలిపారు. సంగారెడ్డి మండలం కల్పగూర్ సమీపంలోని మంజీరా బ్యారేజీని శుక్రవారం ఆయన స్వయంగా పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. జంట నగరాలకు తాగునీరందించే మంజీరా డ్యామ్‌కు ఎలాంటి ముప్పు లేదని చెప్పారు. అక్కడక్కడ చిన్నచిన్న మొక్కలు మొలిచాయని వాటిని తొలగించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రతి ఏటా చేసే తనిఖీల్లో భాగంగానే రాష్ట్ర ఆనకట్టల భద్రత సంస్థ(ఎస్డీఎస్ఓ) మంజీరా డ్యామ్‌ను పరిశీలించిందని చెప్పారు. మంజీరా బ్యారేజీకి పగుళ్లు వచ్చాయనేది అవాస్తవమని పేర్కొన్నారు. అప్రాన్ కొట్టుకుపోయిన మాట వాస్తవమేనని, దానికి మరమ్మతులు చేయిస్తామని, ఇందుకోసం రూ.3.5 కోట్లు కేటాయించామని తెలిపారు. మంజీరా బ్యారేజీ పనుల కోసం ఇరిగేషన్ అధికారులతో కలిసి అధ్యయనం చేస్తున్నామన్నారు. ఇక, జూరాల ప్రాజెక్టు గేట్ల రోప్‌లు విఫలమయ్యాయని, అక్కడ మరమ్మతులు చేస్తున్నారని పేర్కొన్నారు. మంజీరా కట్ట మరమ్మతులను వెంటనే చేయిస్తామని, సంగమేశ్వర బసవేశ్వర ప్రాజెక్టు ప్రస్తుతం ప్రాధాన్యంలో లేదని తెలిపారు. ఈ పర్యటనలో రాహుల్ బొజ్జ వెంట అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, ఆర్డీవో రవీందర్‌రెడ్డి, తహసీల్దార్ జయరామ్ నాయక్, నీటిపారుదల శాఖ అధికారులు ఉన్నారు.

జూరాలపై బీఆర్ఎస్ తప్పుడు ప్రచారం

» 30 ఏళ్లయినా ప్రాజెక్టు చెక్కు చెదరలేదు
» కాంగ్రెస్ ఎమ్మెల్యేలు జీఎంఆర్, మేఘారెడ్డి

హైదరాబాద్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): జూరాల ప్రాజెక్టు కూలిపోతోందంటూ బీఆర్ఎస్ నేతలు తప్పుడు ప్రచారం చేస్తున్నారని కాంగ్రెస్ ఎమ్మెల్యేలు జి.మధుసూధన్‌రెడ్డి (జీఎంఆర్), తూడి మేఘారెడ్డి ధ్వజమెత్తారు. అది కాంగ్రెస్ ప్రభుత్వం నిర్మించిన ప్రాజెక్టని, 30 ఏళ్లయినా చెక్కు చెదరలేదని చెప్పారు. శుక్రవారం అసెంబ్లీ మీడియా హాల్లో మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. 'ప్రాజెక్టులోని 62 గేట్లు పనిచేస్తున్నాయి. 4 గేట్లకు మరమ్మతులు చేయాలి. తాగునీటి కోసం జూరాలలో ఏడాది పొడవునా నీళ్లు నిల్వ ఉంచుతుండటంతోనే మరమ్మతులకు ఇబ్బంది అవుతోంది. తప్పుడు ప్రచారం చేయడం వల్లనే బీఆర్ఎస్ అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో ఓడింది' అని మధుసూధన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. మేఘారెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వం పైన తప్పుడు ప్రచారం చేసి స్థానిక ఎన్నికల్లో లబ్ధి పొందాలన్నది బీఆర్ఎస్ నేతల ఆలోచన అని మండిపడ్డారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు రూ.3 వేల కోట్లు ఇస్తే ఆ ప్రాజెక్టు పూర్తవుతుందంటూ బీఆర్ఎస్ నేతలు తప్పుడు ప్రచారం చేస్తున్నారని.. వారికి తామే రూ.3 వేల కోట్లు ఇప్పిస్తే ఆ ప్రాజెక్టును పూర్తి చేస్తారా అంటూ సవాల్ విసిరారు. బడుగు, బలహీన వర్గాలకు న్యాయం చేసేది ఇందిరమ్మే అని చెప్పి ప్రజలే ఆమెను ప్రధానిని చేశారని, ఇక బీజేపీ నేతలు ఎమర్జెన్సీ డ్రామాలు బంద్ పెట్టాలని కాంగ్రెస్ సీనియర్ నేత వి.హన్మంతరావు అన్నారు. గాంధీభవన్‌లో ఆయన మాట్లాడుతూ.. స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ఇచ్చేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని.. హైకోర్టులో కేసు ఉన్నందున ఎన్నికలను ప్రభుత్వం ఆపిందని స్పష్టం చేశారు.

ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమాన్ని తెలంగాణలో జూలై 1 నుంచి చేపడుతున్నామని సీఐడీ అదనపు డీజీ చారుసిన్హా ఒక ప్రకటనలో తెలిపారు. పలు శాఖలు, కమిటీలు, స్వచ్ఛంద సంస్థలతో కలిసి ఈ కార్యక్రమాన్ని చేపడతామని చెప్పారు.

తిరిగొస్తాను.. సాయం చేయండి

» ఎడారి ఖర్జూర తోటలో తెలంగాణ వాసి కష్టాలు

బేగంపేట, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): కుటుంబ పోషణ కోసం ఎడారి దేశం వెళ్లి, అక్కడ మండుటెండల్లో వడగాల్పుల నడుమ ఖర్జూర తోటలో పనిచేస్తూ ఇంటికి రాలేక ఇబ్బందిపడుతున్నాడు ఓ తెలంగాణ వాసి. దీంతో బాధితుడి భార్య తన ఇద్దరు కుమార్తెలతో కలిసి శుక్రవారం ప్రజావాణి ఇన్‌చార్జి చిన్నారెడ్డి, నోడల్ అధికారి దివ్య దేవరాజన్‌ను కలిశారు. తన భర్తను భారత్‌కు రప్పించాలని బాధితుడి భార్య లత అధికారులను వేడుకున్నారు. హన్మకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం కొప్పూరు గ్రామానికి చెందిన గీత కార్మికుడు తాళ్లపల్లి ఈశ్వర్ కుటుంబ పోషణ కోసం 2017లో సౌదీ అరేబియా వెళ్లి కొంతకాలం డ్రైవర్‌గా పని చేశాడు. అనంతరం విధిలేని పరిస్థితుల్లో ఖర్జూర తోటలో కూలీగా చేరాడు. అయితే అక్కడి అధికారుల వద్ద పాస్‌పోర్టు ఉండడంతో ఏడేళ్లుగా స్వదేశానికి రావడం వీలవడంలేదని కుటుంబసభ్యులు అధికారులకు వివరించారు. మహాత్మా జ్యోతిబాఫూలే ప్రజాభవన్‌లో శుక్రవారం నిర్వహించిన సీఎం ప్రజావాణికి మొత్తం 254 దరఖాస్తులు వచ్చాయి. ప్రజావాణి ఇన్‌చార్జి డా. చిన్నారెడ్డి, స్టేట్ నోడల్ అధికారి దివ్య దేవరాజన్ ప్రజల నుంచి దరఖాస్తులు తీసుకున్నారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి 54, రెవెన్యూ 64, ఇందిరమ్మ ఇండ్ల కోసం 62, హోంశాఖ 11, ప్రవాసీ ప్రజావాణి 2, ఇతర శాఖలకు సంబంధించి 58 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు.

ఆంధ్రజ్యోతి విలేకరిపై దాడి కేసులో ఐదుగురి అరెస్టు

ములుగు, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా తాడ్వాయి మండలం ఆంధ్రజ్యోతి రిపోర్టర్ చల్లగొండ శ్రీకాంత్‌రెడ్డిపై దాడికి పాల్పడిన వారిని పోలీసులు అరెస్టు చేశారు. 'మాకు వ్యతిరేకంగా వార్తలు రాస్తావా..' అంటూ నార్లాపూర్‌కు చెందిన కాంగ్రెస్ నాయకులు తాండాల శ్రీను, మొక్క శ్రీనివాస్, బొప్ప వినోద్, ఎనగంటి సాయికృష్ణ, శ్రావణ్ ఈ నెల 24న దాడి చేసిన విషయం విదితమే. అదే రోజు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు జరిపిన పోలీసులు శుక్రవారం ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. అరెస్టు అనంతరం నిందితులను కోర్టులో హాజరుపరిచామని తాడ్వాయి ఎస్సై తెలిపారు.

జూరాల భద్రత ప్రశ్నార్థకం

(మొదటి పేజీ తరువాయి)

చేయాల్సిన పనులను ఏళ్ల తరబడి సాగదీస్తుండడంతో ఇప్పుడు గేట్ల రోప్‌లు తెగిపోయే పరిస్థితి వచ్చింది. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ సూచనలను పట్టించుకోకపోవడం వల్లే ఈ పరిస్థితి తలెత్తిందన్న వాదన వినిపిస్తోంది. జూరాల ప్రాజెక్టుపై 62 గేట్లు ఉండగా.. వాటిని మరమ్మతు చేసేందుకు ఒక్కటే గ్యాంటీ క్రేన్ అందుబాటులో ఉంది. గ్యాంటీ క్రేన్‌లోని మోటార్లు కాలిపోవడం, వేడెక్కడం, క్రేన్ కదలకపోవడం వంటి కారణాలతో గేట్ల మరమ్మతులు ఆలస్యం అవుతున్నాయి. మరో గ్యాంటీ క్రేన్ కావాలని అధికారులు ప్రతిపాదించినా మంజూరు కాలేదు. భారీ వరదలు వచ్చినప్పుడు ఏదైనా గేటు మొరాయిస్తే, లేపడానికి గ్యాంటీ క్రేన్ కావాలి. అలాంటి అత్యవసర సమయాల్లో గ్యాంటీ క్రేన్ మొరాయిస్తే పరిస్థితి ఏంటనేది అంతుబట్టడం లేదు. అలాగే, జూరాలపై భారీ వాహనాల రాకపోకలు నిషేధించినా.. యథేచ్ఛగా తిరుగుతున్నాయి. గద్వాల, ఆత్మకూరు, మక్తల్, నారాయణపేట పట్టణాలకు రాకపోకలు సాగించేందుకు కృష్ణానదిపై మరో వంతెన లేకపోవడంతో ఈ ప్రాజెక్టే దిక్కయింది. వాస్తవానికి భారీ వాహనాలతో ప్రాజెక్టుకు ముప్పు ఏర్పడుతుందని ఎన్‌డీఎస్‌ఏ అధికారులు గతంలోనే హెచ్చరించారు. దీంతో రెండేళ్ల క్రితం ప్రాజెక్టు దిగువన బ్రిడ్జి నిర్మాణానికి రూ.120 కోట్లతో ప్రతిపాదనలు పంపినా.. కాగితాలకే పరిమితమైంది. ప్రాజెక్టు పై నుంచి ఇప్పటికీ ఇసుక టిప్పర్లు, లారీలు, ఆర్టీసీ బస్సులు తిరుగుతుండడం గమనార్హం. అలాగే, ప్రాజెక్టు ఎడమవైపు కరకట్ట రోడ్డుపై పెద్ద పెద్ద గుంతలు పడగా.. వర్షాల సమయంలో నీళ్లు నిలిచిపోతున్నాయి. దీంతో కట్ట బలహీన పడే పరిస్థితి నెలకొంది. గుంతలకు మరమ్మతులు చేపట్టడంలో అటు ఇరిగేషన్ శాఖ, ఇటు పంచాయతీ రాజ్ శాఖ నిర్లక్ష్యం వహిస్తున్నాయన్న ఆరోపణలు న్నాయి. "ప్రాజెక్టుపై భారీ వాహనాల రాకపోకలను నిషేధించాలని, ప్రత్యేకంగా బ్రిడ్జి నిర్మించాలని, రెండో గ్యాంటీ క్రేన్ కావాలని ప్రతిపాదించాం. ఇవి మంజూరైతే ప్రాజెక్టుకు ఎంతో మేలు జరుగుతుంది" అని జూరాల ప్రాజెక్టు ఈఈ జుబేరుద్దీన్ తెలిపారు.

నేడు జూరాలకు మంత్రి ఉత్తమ్

నీటి పారుదల మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి శనివారం జూరాల ప్రాజెక్టును సందర్శించనున్నారు. రెండు రోజుల క్రితం ప్రాజెక్టులోని 9వ, 12వ క్రస్ట్ గేట్ల రోప్స్ తెగిపోయిన ఘటనపై మంత్రి సమీక్షించనున్నారు. క్షేత్ర స్థాయిలో పర్యటించి.. వాస్తవ పరిస్థితిని తెలుసుకోనున్నారు.



ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

'షాంఘై'లో ద్వంద్వ నీతి

షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీఓ) ఆవిర్భావ ఆశయాల్లో ఉగ్రవాదం మీద ఉమ్మడిపోరు ఒకటిగా ఉన్నప్పుడు, ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడం ఎలా? అన్న అంశంమీదే మొన్నటి సదస్సు కూడా జరిగిన తరువాత, సంయుక్త ప్రకటనలో పహల్గాం ప్రస్తావన లేకపోవడాన్ని విస్మరణగా కాక, కుట్రగానే భావించాలి. రెండురోజుల పాటు రక్షణమంత్రుల స్థాయిలో మేధోమథనం జరిగిన తరువాత, సదస్సు ముగింపు సందర్భంగా విడుదల చేద్దామనుకున్న ఉమ్మడి ప్రకటన భారత్ అభ్యంతరాల నేపథ్యంలో నిలిచిపోయింది. పహల్గాం ఊసులేనందుకు అభ్యంతరం వెలిబుచ్చుతూ సంతకం చేయడానికి మన రక్షణమంత్రి రాజ్‌నాథ్‌సింగ్ నిరాకరించారు. ఉగ్రవాదంమీద కలసికట్టుగా పోరాడదామని సంకల్పించి, ఒక భయానకమైన ఉగ్రదాడి జరిగిన తరువాత కూడా, ఒక దేశం అభ్యంతరం వెలిబుచ్చిందనో, దానికి ఆగ్రహం కలుగుతుందనో సంయుక్త ప్రకటనలో సదరు సంఘటన ప్రస్తావన లేకుండా చేయడం ద్వంద్వప్రమాణాలకు నిదర్శనమని రాజ్‌నాథ్ విస్పష్టంగా ప్రకటించారు. శాంతి, భద్రత, పరస్పర విశ్వాసం ఈ ప్రాంతం ఎదుర్కొంటున్న సవాళ్ళనీ, శాంతి, ఉగ్రవాదం ఒక ఒరలో ఇమడవని ఆయన గుర్తుచేశారు. రాజ్‌నాథ్ తన ప్రసంగంలో ఇటీవలి ఆపరేషన్ సిందూర్‌ను ప్రధానంగా ప్రస్తావించిన విషయం తెలిసిందే. లష్కరే తోయిబా జరిపిన గతకాలపు ఉగ్రదాడులు, ఇప్పుడు దాని అనుబంధ సంస్థ చేసిన పహల్గాం ఉగ్రదాడి, ప్రతీకారంగా భారత్ నిర్వహించిన ఆపరేషన్ సిందూర్ ఇత్యాది అంశాలతో రాజ్‌నాథ్‌సింగ్ ప్రసంగం ఎంతో లోతుగా సాగింది. భారత్ ప్రతీకారం తీర్చుకుందని, ఉగ్రవాద కేంద్రాలను దుంపనాశనం చేసిందని, ఈ నేపథ్యంలో సభ్యదేశాలన్నీ ఉగ్రవాదాన్ని ఖండించాలన్నది ఆ ప్రసంగ సారాంశం. పాకిస్థాన్‌పై అంతటి విమర్శ దట్టించిన ఆ ప్రసంగం తరువాత, ఉమ్మడి ప్రకటనలో ఉగ్రవాదం ఊసెత్తనివ్వకుండా ఏ దేశం అడ్డుపడిందో ఊహించడం కష్టం కాదు.

సదస్సు సవ్యంగా, సయోధ్యతో ముగిసిందని చైనా తేల్చేసింది. సంతకం చేయకపోవడంపై భారత్‌ను వెనకేసుకొస్తున్నవారు ఉన్నట్టే, వ్యతిరేకిస్తున్నవారూ ఉంటారు. పహల్గాం ప్రస్తావన లేకపోవడం కంటే, బలూచిస్తాన్‌లో ఉగ్రవాదాన్ని ఈ సహకార సంస్థలోని సభ్యదేశాలన్నీ ఐకమత్యంగా ఖండించడం భారత్‌కు ఆగ్రహం కలిగించిందని, పాకిస్థాన్ సాధించిన ఈ దౌత్యవిజయం భారత్‌ను ఇరకాటంలో పడవేసిందని విశ్లేషకులు అంటున్నారు. పహల్గాం దారుణం, పాక్ ప్రేరేపిత ఉగ్రవాదం ప్రస్తావనలు లేకుండా, ఒక అంతర్జాతీయ వేదిక కేవలం బలూచిస్థాన్ గురించి మాట్లాడటమంటే మన దౌత్యవిధానం విఫలమైనట్టేనని విపక్షనేతల విమర్శ. మోదీ ఏలుబడిలో భారత్ ఏకాకి అయిపోయింది, మిగతా ప్రపంచంముందు మనకు అవమానాలు మిగులుతున్నాయి, పాకిస్థాన్‌కు బిలియన్ల కొద్దీ డాలర్లు సాయంగా అందుతూంటే, ఉగ్రవాదాన్ని కనీసంగా ఖండించడానికి కూడా మనపక్షాన ఎవరూ నిలవడం లేదని కాంగ్రెస్ దెప్పిపొడుస్తోంది.

ఈ సహకార సంస్థ ఆవిర్భావ లక్ష్యాలను, ఆశయాలను అటుంచితే, ఈ సంస్థలో కీలకపాత్రలు, పాత్రధారులు ఎవరో తెలిసిందే గనుక, ఉమ్మడి ప్రకటనలో మార్చి 11న బలూచ్ లిబరేషన్ ఆర్మీ జాఫర్ ఎక్స్‌ప్రెస్‌ను హైజాక్ చేయడం గురించి మాత్రమే గుండెలు బాదుకొని, మరుసటి నెలలోనే పాతికమంది పర్యాటకులను పహల్గాంలో ఊచకోతకోసిన దారుణాన్ని అలవోకగా విస్మరించడం ఆశ్చర్యం కలిగించదు. ప్రస్తుత పరిస్థితుల్లో ఈ వేదికమీద మనం ఒంటరి కావడంలోనూ విశేషమేమీలేదు. పాకిస్థాన్‌ను నొప్పించడం ఇష్టంలేకపోవచ్చు సరే, దానిని మెప్పించడానికి చైనా ఇంత నిస్సిగ్గుగా సిద్ధపడటమే ఆశ్చర్యం కలిగిస్తుంది. బలూచ్ ఘటనకూ, పహల్గాం ఘటనకు హస్తిమశకాంతరం ఉన్న విషయం చైనాకు తెలియనిది కాదు. అక్కడ సాయుధులు ఉన్నారని, ఇక్కడ నిరాయుధులు బలైనారనీ, మతం అడిగి మరీ పర్యాటకుల ప్రాణాలు తీశారనీ, ఇది పాక్ ప్రేరేపిత ఉగ్రఘాతుకమనీ దానికి తెలుసు. సరిహద్దులు దాటివచ్చి భారత భూభాగాలను ఆక్రమించుకుంటున్న ఒకదేశం, సరిహద్దులు దాటించి ఉగ్రవాదులతో ఊచకోతలు కోయిస్తున్న మరొక దేశానికి వత్తాసు పలకడంలో ఆశ్చర్యమేమీ లేదు.

జాతి నిర్మాణంలో శిఖరసమానుడు

ఆర్థిక, రాజకీయ, దౌత్య, సామాజిక, బహుభాషా విద్యావేత్త; దార్శనికుడు, కార్యదక్షుడు, రాజనీతిజ్ఞుడు, తత్త్వశాస్త్రజ్ఞుడు, బహుముఖ ప్రజ్ఞాశాలి, అపర చాణక్యుడు; ఆర్థిక సంస్కరణల రూపకర్తగా స్వపక్షం నుంచి, ప్రతిపక్షాల నుంచి, ఖండాంతర ఆర్థిక నిపుణుల నుంచి మన్ననలనందుకున్న వ్యక్తి మాజీ ప్రధానమంత్రి, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి స్వర్గీయ పాములపర్తి వెంకట నరసింహారావు. ఆయన విద్యా సామర్థ్యం, పరిపక్వతయుత సేవలకు గుర్తింపుగా, గత సంవత్సరం దేశ అత్యున్నత పౌర పురస్కారం 'భారతరత్న' ప్రదానం చేసింది కేంద్ర ప్రభుత్వం.

ఎన్నికల్లో పోటీ చేయనని, లోక్‌సభ టిక్కెట్టు కూడా వద్దని, మూటా ముల్లె సర్దుకుని సొంత రాష్ట్రానికి పయనమయిన వ్యక్తి. అప్పట్లో నెలకొన్న రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో, తప్పనిసరి పరిస్థితుల్లో క్రియాశీలక రాజకీయాల్లో కొనసాగి, భారత జాతీయ కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష పగ్గాలు చేపట్టారు. అనూహ్య రీతిలో ప్రధానమంత్రి పదవిని అధిష్ఠించి, 1991 నుంచి 1996 దాకా అయిదేళ్లూ కాంగ్రెస్ పార్టీని అధికారంలో నిలపడం భారత రాజకీయాలలో కీలక మలుపు. నెహ్రూ–గాంధీ కుటుంబేతరుడుగా, తొలి దాక్షిణాత్యుడిగా, తెలుగువాడిగా, ప్రధాని పీఠాన్ని అందుకుని, ఆ పదవిలో అయిదేళ్ల కొనసాగటం భారతదేశ పార్లమెంటరీ ప్రజాస్వామ్య చరిత్రలో ఒక మైలురాయి. అప్పటికి 70 సంవత్సరాల వయసున్న పీవీ తన రాజకీయ ప్రస్థానంలో హిమాలయాలంత ఎత్తెదిగారు. ఢిల్లీ పీఠాన్ని అధిష్ఠించిన తెలంగాణ బిడ్డ. పీవీ... స్వాతంత్ర్య సమరయోధుడిగా, స్వామీ రామానందతీర్థ శిష్యుడిగా నిజాం వ్యతిరేక పోరాటంలో కూడా అగ్రభాగాన ఉన్నారు.



1971 సెప్టెంబర్‌లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా పదవీ బాధ్యతలను చేపట్టిన పీవీ అహర్నిశలూ రాష్ట్రాభివృద్ధికి కృషి చేశారు. అభివృద్ధికర, ప్రగతిశీల సంస్కరణలు తీసుకొచ్చారు. 1972 సాధారణ ఎన్నికలలో కాంగ్రెసు పార్టీ అభ్యర్థుల ఎంపికలో యువకులకు, బలహీనవర్గాల వారికి ప్రాధాన్యం ఇచ్చారు. అత్యధిక మెజార్టీ సీట్లను గెల్చుకుని మళ్లీ రాష్ట్రానికి ముఖ్యమంత్రి అయ్యారు. చరిత్రాత్మక భూసంస్కరణల బిల్లుకు ఆయన హయాంలోనే శాసనసభ ఆమోదం తెలిపింది. ఆర్థిక అసమానతలు తొలగించడానికి, ఉత్పత్తి పెరుగుదలకు ఉద్దేశించిన ఓ సామాజిక సంస్కరణగా దానిని ఆయన అభివర్ణించారు. ఈ చర్య గిట్టని సొంత పార్టీకి చెందిన ప్రగతిశీల వ్యతిరేక ముఠా ఆయన్ను రాష్ట్ర ముఖ్యమంత్రిగా రాజీనామా చేసే స్థితికి తీసుకొచ్చింది.

పీవీ జాతీయ రాజకీయాలలో చురుకైన పాత్ర పోషించారు. ఇందిరాగాంధీ మంత్రివర్గంలో విదేశీ వ్యవహారాల మంత్రిగా పనిచేశారు. ఆ పదవిలో జవహర్‌లాల్ నెహ్రూ విదేశాంగ విధానాన్ని, దౌత్యనీతిని, దశదిశలా ప్రచారం చేశారు. ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశంలో పీవీ చేసిన ఉపన్యాసం పాత రోజులనాటి కృష్ణమీనన్ ఉపన్యాసాన్ని మరిపించింది. కొంతకాలం హోం శాఖను నిర్వహించారు. 1983 అలీన దేశాల శిఖరాగ్ర సమావేశంలో స్పానిష్ భాషలో మాట్లాడి క్యూబా అధ్యక్షుడు ఫిడెల్ క్యాస్ట్రోను అబ్బురపరచారు.

పంజాబ్ తీవ్రవాదాన్ని విజయవంతంగా అణచివేయడం, ప్రముఖులను కశ్మీరు తీవ్రవాదులు అపహరించినపుడు వారి డిమాండ్లకు లొంగకుండా ఆ ప్రముఖులను విడిపించిన ఘనత కూడా పీవీదే. రాజీవ్‌గాంధీ మంత్రివర్గంలో రక్షణశాఖ మంత్రిగా, మానవ వనరుల అభివృద్ధిశాఖ మంత్రిగా పని చేశారు. నూతన విద్యావిధానాన్ని రూపొందించారు. ఆయన హయాంలోనే జాతీయ శిక్షణ విధానాన్ని కూడా రూపొందించారు. అయిదారు దశాబ్దాల తన రాజకీయ జీవితంలో, శతాబ్దాల అనుభవాన్ని సంపాదించి పలువురికి పంచిపెట్టిన మేధావి. కాకలు తీరిన కాంగ్రెస్ యోధుడు, ఎన్ని ఒడుదుడుకులు ఎదురైనా చిరునవ్వు వీడని ధీశాలి. ఆలోచనల్లో, అమల్లో విజ్ఞాన సర్వస్వం.

జ్ఞానపీఠ్ అవార్డు గ్రహీత, కవిసామ్రాట్ స్వర్గీయ విశ్వనాథ సత్యనారాయణ రచించిన 'వేయిపడగలు' తెలుగు పుస్తకాన్ని హిందీలోకి 'సహస్రఫణ్'గా అనువదించారు పీవీ. అది ఆయన తెలుగు, హిందీ భాషల ప్రావీణ్యానికి నిదర్శనం. క్షణమైనా తీరికలేని రాజకీయ కార్యకలాపాలు ఉన్నా, అన్ని భాషలలోని ప్రముఖ రచయితలతో పీవీ క్రమం తప్పకుండా సంబంధాలు కొనసాగించారు. 17 భాషలలో నిష్ణాతుడు కావడంతో పాటు ఆర్థికశాస్త్రం, చట్టం, చరిత్ర, రాజకీయాలు, కళలలో కూడా ఆయనకు ప్రావీణ్యం ఉంది. తెలంగాణ సాయుధపోరాటం ఇతివృత్తం ఆధారంగా పీవీ రాసిన గొల్ల రామవ్వ కథలో... ఒక గొప్ప సాయుధ పోరాటవీరుడిని రామవ్వ ఏ విధంగా కాపాడిందో అద్భుతంగా వర్ణించారు పీవీ.

నవభారత నిర్మాతల్లో మొట్టమొదటి 'కంట్రీ ప్లానింగ్'కు శ్రీకారం చుట్టి అమలుచేసిన వ్యక్తి పండిట్ జవహర్ లాల్ నెహ్రూ అయితే, ఆర్థిక సంస్కరణలకు ఆద్యుడైన పీవీ నరసింహారావు 'గ్లోబల్ ఇండియా' సృష్టించిన వ్యక్తి. అంతర్జాతీయ రాజకీయ, ఆర్థికవేత్తల, దౌత్య సంబంధాల మహోద్దండ నాయకుల సరసన, పీవీ పేరు సువర్ణాక్షరాలతో లిఖించడం ఖాయం. పీవీ నిరంతర సంస్కరణశీలి. ఏ రంగంలో అయినా సంస్కరణలు తేవడమే ఆయన చేసిన పని. భారత రాజకీయ చరిత్రలో అజరామర నేత. అందుకే పీవీని స్మరించుకోవటం సదా మన కర్తవ్యం. ఆ మహనీయుడికి నివాళి.

– వనం జ్వాలానరసింహారావు

(నేడు పీవీ నరసింహారావు జయంతి)

'నా బిడ్డ నన్ను గుర్తుపట్టలేదు'

దేశంలో ఎమర్జెన్సీ విధించి 50 సంవత్సరాలు అవుతుంది. ఈ సందర్భంగా గతాన్ని తలచుకుంటుంటే ఆనాటి భయంకర జ్ఞాపకాలు కట్టలు తెంచుకొని, ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయి. అందులో కొన్ని బాధించేవి ఉన్నాయి, ఆవేదనాభరితమైనవి ఉన్నాయి, కన్నీరు చెమర్చేవి ఉన్నాయి, ఆశ్చర్యం కలిగించేవీ ఉన్నాయి. ఎమర్జెన్సీ కాలంలో 'మీసా' చట్టం కింద అరెస్టయ్యేనాటికి నా వయసు 30 సంవత్సరాలు. వరంగల్ కేంద్ర కారాగారంలో నన్ను బంధించారు. ఒకరోజు ఏదో కారణంతో నన్ను ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. నన్ను చూడడానికి నా పెద్ద కుమారుడు వివేక్‌ను తీసుకొని, నా శ్రీమతి అక్కడికి వచ్చింది. చాలా రోజుల తర్వాత కన్న కొడుకు కంటికి కనిపించేసరికి ఆత్రంగా ఎత్తుకుని, ముద్దాడాలని ఆరాటపడ్డాను. కానీ, నా చేతికి బేడీలు ఉండడం వల్ల నా కుమారుడిని ఎత్తుకోలేకపోయాను. ఈ సంఘటన ఇప్పటికీ పదే పదే జ్ఞప్తికి వచ్చి నాలో ఒక రకమైన భావోద్వేగాన్ని నింపుతుంది. మరొక సందర్భంలో నా కుమార్తె వినయను తీసుకొని శ్రీమతి జైలుకు వస్తే జైలు అధికారులు ములాఖత్ నిరాకరించారు. అయితే ఒక చిన్న కేసులో శిక్ష అనుభవిస్తున్న మల్లారెడ్డి చెస్కాల ఏదో విధంగా జైలరును ఒప్పించి, నా బిడ్డను మాత్రం జైలులోపలికి తీసుకొచ్చి, నాకు చూపించి, తిరిగి తీసుకెళ్లారు. అయితే, నేను, నా మిత్రబృందం నా చిన్నారిని చూసి ఆనందించాం. కానీ ఆమె మాత్రం నన్ను గుర్తుపట్టలేదు. ఒక తండ్రిగా అప్పుడు నాకు కలిగిన ఆవేదన మరపురానిది. దశాబ్దాలు గడిచినా మనసుల్లో ఇప్పటికీ తాజాగా ఉన్న ఎన్నో మరపురాని సంఘటనలకు ఇవి మచ్చుతునకలు.

లాల్‌కృష్ణ అద్వానీ 'ప్రిజనర్స్ స్క్రాప్ బుక్' ఆనాటి పరిస్థితులను, ఇందిరాగాంధీ మనస్తత్వాన్ని, ఆమెకున్న అభద్రతా భావాన్ని విశదీకరించింది. ఇందిర ఎన్నిక చెల్లదని, ఆరు సంవత్సరాల పాటు ఆమె ఎన్నికలలో పోటీ చేసే అర్హత లేదని అలహాబాద్ హైకోర్టు స్పష్టం చేసింది. అయితే కోర్టు ఏ చట్టాలు, ఉత్తర్వుల ప్రకారం ఆమె లోక్‌సభ సభ్యత్వాన్ని రద్దు చేసిందో, వాటన్నింటికీ సవరణలు తీసుకొచ్చి, అవి ఆమెకు వ్యతిరేకంగా ఇచ్చిన తీర్పునకు ముందు నుంచే అన్వయించేలా (Retrospective) చట్టాలు చేశారు! ఈ తరానికి ఊహకు కూడా అందని ఇలాంటి రాజ్యాంగ విరుద్ధమైన అరాచకాలెన్నో ఎమర్జెన్సీలో జరిగాయి. 1977లో జరిగిన ఎన్నికలలో ప్రజలు నియంతృత్వానికి వ్యతిరేకంగా చరిత్రాత్మక తీర్పునిచ్చారు. మొరార్జీ దేశాయ్ ప్రధాన మంత్రిగా జనతా ప్రభుత్వం కొలువుదీరింది. ఎమర్జెన్సీ కాలంలో తీసుకొచ్చిన నల్ల చట్టాలను జనతా ప్రభుత్వం రద్దు చేసింది. ప్రపంచంలో అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంలో మరొకసారి అలాంటి తప్పు జరగకుండా జాగ్రత్తపడాల్సిన అవసరం ఉంది. ఆ బాధ్యత ప్రజలపైనే ఉంది.



– సిహెచ్. విద్యాసాగర్‌రావు
మహారాష్ట్ర మాజీ గవర్నర్

ఈ సంప్రదింపులు సార్థకమయ్యేనా?

ప్రతి మంత్రిత్వ శాఖకు ఒక సంప్రదింపుల సంఘం ఉంటుంది. పార్లమెంటు ఉభయసభలలోని ఎంపీలను ఈ కమిటీలో సభ్యులుగా నామినేట్ చేస్తారు. అన్ని పార్టీలకు విధిగా ప్రాతినిధ్యముంటుంది. జూన్ 2024లో 18వ లోక్‌సభ ఏర్పాటైన తరువాత ఆర్థిక మంత్రిత్వశాఖ తన సంప్రదింపుల సంఘ సమావేశాన్ని ప్రప్రథమంగా ఈ జూన్ 19న నిర్వహించింది. దేశ ఆర్థిక వ్యవస్థ ఎదుర్కొంటున్న సంక్లిష్ట సమస్యలను సాకల్యంగా పరిశీలించి, పరిష్కారాలు కనుగొనేందుకు ప్రభుత్వం ఈ సంఘాన్ని ఉపయోగించుకుంటే ఆ సంప్రదింపులు నిస్సందేహంగా ప్రయోజనకరమవుతాయి. ఆర్థిక మంత్రి ఈ సమావేశాలకు అధ్యక్షత వహిస్తారు.

ఈ నెల 19న జరిగిన సమావేశం లాంఛనప్రాయమైనది. ప్రభుత్వ ప్రధాన ఆర్థిక సలహాదారు (సీఈఏ) 19 స్లైడ్‌ల పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. సభ్యుల నుంచి వ్యాఖ్యలు, అభిప్రాయాలను ఆహ్వానించారు. ఆర్థికశాఖ కార్యదర్శి వాటన్నిటినీ ప్రశస్తంగా సంగ్రహించారు. అయితే సభ్యుల విమర్శలకు సమాధానమివ్వలేదు, సందేహాలకు వివరణ ఇవ్వలేదు. ఆర్థిక మంత్రి ముగింపు ప్రసంగం చేశారు. ఏ సమస్య విషయమై కూడా సంప్రదింపులు జరపనే లేదు!



■ పి. చిదంబరం

'పళని' పలుకు

అయితే సీఈఏ తన పవర్ పాయింట్ ప్రజంటేషన్ సందర్భంగా నాలుగు సమస్యలపై సభ్యులు సూచనలు ఇవ్వాలని కోరారు. అవి: (1) వ్యవసాయ ఉత్పాదకతను మరింతగా మెరుగుపరిచేందుకు; (2) నిబంధనలను పాటించడంలో కష్టనష్టాలను తగ్గించేందుకు ఉద్దేశించిన డీ రెగ్యులేషన్ అజెండా; (3) మన ఉపాధి శిక్షణా కార్యక్రమాలను కృత్రిమ మేధ, కొత్త సాంకేతికతల ఆధారిత అంతరాయాలను అధిగమించేందుకు అనుగుణంగా రూపొందించుకుని అమలుపరచటం; (4) ఆర్థిక వ్యవస్థ అధికారికీకరణను వేగవంతం చేయడం ఎలా... అన్న అంశాలపై సీఈఏ సభ్యుల సూచనలను ఆహ్వానించారు.

మంచి అభ్యర్థన, సందేహం లేదు. అయితే నేను అక్కడికక్కడే వెన్వెంటనే సూచనలు చేయదలుచుకోలేదు. ఆ తరువాత ఆ నాలుగు అంశాలపైన బాగా ఆలోచించాను. ఇవిగో ఇవీ నా సూచనలు:

సీఈఏ పవర్ పాయింట్ ప్రజంటేషన్‌లోని ఒక స్లైడ్‌లో కనీస మద్దతు ధర, పీఎమ్–కిసాన్, పీఎమ్–ఫసల్ బీమా, కేసీసీ, e–NAM, ఫుడ్ పార్క్స్... ఇవన్నీ వ్యవసాయ ఉత్పాదక సామర్థ్యాన్ని, దిగుబడులను పెంపొందించేందుకు ఉద్దేశించినవి. మరో స్లైడ్‌లో ప్రధాన పంటల దిగుబడుల్లో పెరుగుదల వివరాలు ఇచ్చారు. ప్రతి ప్రధాన పంట విషయంలోను 2013–14, 2023–24 సంవత్సరాల మధ్య ప్రతి హెక్టారుకు దిగుబడుల సగటు పెరుగుదల, ఉత్తమ గరిష్ఠ పెరుగుదల అంకెలు ఇచ్చారు. నిజానికి 2013–14 నుంచే కాదు, 1965లో హరిత విప్లవం ప్రారంభమైన నాటి నుంచీ ఉత్పాదకత పెరుగుదలను ప్రపంచ ప్రమాణాలతో కొలవడం జరుగుతోంది. ఉదాహరణకు హెక్టారుకు గోధుమ, వరి దిగుబడుల విషయాన్ని చూద్దాం. (అంకెలు అన్నీ కిలోల్లో) గోధుమ విషయంలో మన సగటు దిగుబడులు 3,559 కాగా గరిష్ఠ దిగుబడులు 5,045 కాగా ప్రపంచ సగటు 3,548. అయితే గరిష్ఠ దిగుబడులు యూరోపియన్ యూనియన్, ఈజిప్ట్‌లలో 6,500 నుంచి 7,700 దాకా ఉన్నాయి. వరి విషయానికి వస్తే మన సగటు దిగుబడులు 2,882, గరిష్ఠ దిగుబడులు 4,516 కాగా ప్రపంచ సగటు 3,548. ప్రపంచ గరిష్ఠ దిగుబడులు చైనాలో 6,500గా ఉన్నాయి.

మరో ఉత్పాదకత కొలమానం కూడా ఉన్నది: రైతు/ రైతు కూలీ సగటు ఉత్పాదకత. భారత జనాభాలో 58 శాతం మంది వ్యవసాయం, వ్యవసాయ సంబంధిత కార్యకలాపాలపై ఆధారపడి ఉన్నారు (చైనా జనాభాలో కేవలం 22 శాతం మంది మాత్రమే వ్యవసాయంపై ఆధారపడుతున్నారు). ఈ కారణంగా రైతు సగటు ఉత్పాదకత మన దేశంలో తక్కువగా ఉంటోంది. సగటు రైతు పేదవాడు మాత్రమే కాదు, రుణ భారంతో కుంగిపోతున్న కుటుంబీకుడు కూడా.



> దేశ ఆర్థిక వ్యవస్థ ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారాలు కనుగొనేందుకు అన్ని పార్టీల ఎంపీలు సభ్యులుగా ఉండే ఆర్థిక మంత్రిత్వశాఖ సంప్రదింపుల సంఘం సమావేశాలు తోడ్పడవచ్చు. 18వ లోక్‌సభ ఏర్పాటైన తరువాత ఈ నెల 19న ఆ సంప్రదింపుల సంఘం మొదటి సమావేశం జరిగింది. ఆర్థికమంత్రి అధ్యక్షతన జరిగిన ఆ సమావేశంలో పలువురు సభ్యుల సలహాలను, ఈ వ్యాసంలో నేను చేసిన సూచనలను ప్రభుత్వం అంగీకరించవచ్చు లేదా తిరస్కరించవచ్చు. అయితే వాటిని ఎంతమాత్రం ఉపేక్షించకూడదు.

రైతులు ఒక్కొక్కరి ఉత్పాదకత సామర్థ్యాన్ని పెంపొందించేందుకు వ్యవసాయేతర రంగాలలో ఉద్యోగాలు సృష్టించి వ్యవసాయ రంగం నుంచి లక్షలాది రైతులు, రైతుకూలీలను వ్యవసాయేతర జీవనోపాధుల్లోకి పంపడం. అయితే పట్టణ, నగర ప్రాంతాలలో నిరుద్యోగిత ఇప్పటికే చాలా అధిక శాతంలో ఉంది. వస్తు తయారీరంగంలో పరిస్థితులు సజావుగా లేవు. ఈ కారణంగా వ్యవసాయదారులు ఇతర రంగాలకు వలసపోయేలా చేయడమనేది ఒక అడుగు ముందుకు రెండు అడుగులు వెనక్కు చందంగా ఉంది. నిజానికి వ్యవసాయేతర రంగాలలోని శ్రామికులు ఇటీవలికాలంలో వ్యవసాయరంగానికి తిరిగి వెళ్లినట్టు విశ్వసనీయమైన సమాచారం ఉంది. ఈ అంశంపై ఇదీ నా సూచన: వృద్ధిరేటును శీఘ్రగతిన పెంపొందించి, తయారీ రంగాన్ని విస్తరింపచేయాలి.

2014–15 ఆర్థిక సంవత్సరం తరువాత మోదీ ప్రభుత్వం పారిశ్రామిక రంగంపై నియంత్రణ మరింతగా పెంచింది. ఆర్బీఐ, కంపెనీ వ్యవహారాల మంత్రిత్వశాఖ, వాణిజ్య మంత్రిత్వ శాఖ, ఆదాయ పన్ను విభాగం, యూజీసీ, ఇంకా ప్రతి మంత్రిత్వశాఖ, ప్రభుత్వ విభాగం కూడా వందలాది పేజీల నియమ నిబంధనలను రూపొందించి అమలుపరుస్తున్నాయి. పాత నియంత్రణ వ్యవస్థ 'క్రమబద్ధీకరణల' రూపంలో తిరిగి వచ్చింది. భారతదేశంలో వ్యాపారం చేయడమంటే నియమ నిబంధనలు, ప్రభుత్వ ఆదేశాలను సవాల్ చేయడం, న్యాయస్థానాలు, ట్రిబ్యునల్స్‌లో ఉపశమనాలకు ప్రయత్నించడమే. జీఎస్టీ చట్టాలు వ్యాపార సంస్థలపై ఈ భారాలను మరింతగా పెంచాయి. జీఎస్టీ రేట్లు అధిక స్థాయిలో ఉండడం స్వతహాగా శుభస్కర విషయం కాదు. అందునా జీఎస్టీ చట్టాల కింద నియమ నిబంధనలు, నోటిఫికేషన్లు మరిన్ని అవస్థలకు కారణమవుతున్నాయి. ఆదాయపు పన్ను శాఖ, కస్టమ్స్, డీజీఎఫ్‌టీ, జీఎస్టీ విభాగాలు చట్టాలకు చెబుతున్న భాష్యాలు, వాటిని అమలుపరుస్తున్న తీరు తెన్నులు ఏ వ్యాపార సంస్థకైనా వదలని పీడకలలుగా పరిణమించాయి.

ప్రతి వ్యాపారస్తుడు చట్ట అతిక్రమణకు పాల్పడినవాడుగా, ప్రతి చార్టర్డ్ అకౌంటెంట్ సహాపరాధి, ప్రతి న్యాయవాది తోడుదొంగ అయినట్టుగా సీబీఐ, ఈడీ, డీఆర్‌ఐ, జీఎస్టీ, ఎన్‌ఫోర్స్‌మెంట్, ఎస్‌ఎఫ్‌ఐఓ వ్యవహరిస్తున్నాయి! వాణిజ్యం, పరిశ్రమలు ఆర్థికాభివృద్ధి చోదకశక్తులుగా భావిస్తే వాటికి ఊపిరాడకుండా చేస్తున్న పరిస్థితులను తొలగించాలి. ఈ అంశంలో ఇదీ నా సూచన: ప్రతి మంత్రిత్వశాఖ, ప్రతి ప్రభుత్వ విభాగమూ తాము రూపొందించిన నియమనిబంధనల పత్రాలను దహనం చేయాలి.

యాన్యువల్ స్టేటస్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రిపోర్ట్ చదవండి. పాఠశాల బాలల్లో పఠన, లేఖన సామర్థ్యాలు, గణిత కౌశలాలు ఎంత అధ్వాన్నంగా ఉన్నాయో విశదమవుతుంది. నాసిరకం విద్యా ప్రమాణాలతో జీవితంలోకి ప్రవేశించిన వారికి అధునాతన సాంకేతికతలను ఉపయోగించుకునే నైపుణ్యాలు ఉంటాయా? సమాజాభివృద్ధికి దోహదం చేయడం విశ్వవిద్యాలయాల కర్తవ్యం. జ్ఞాన వికాసానికి, కొత్త ఆవిష్కరణలకు అవి తోడ్పడాలి. మరి యూజీసీ, ఎన్‌టీఏ, న్యాక్‌లు విశ్వవిద్యాలయాలు తమ విధ్యుక్తధర్మాలను సమర్థంగా నిర్వర్తించేందుకు సహాయపడుతున్నాయా? ప్రతిభావంతులైన అధ్యాపకులు, పరిశోధకులు, విద్వజ్జులు విదేశాలకు వలసపోక తప్పని పరిస్థితులు కల్పిస్తున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధుల మంజూరును నిలిపివేస్తూ లేదా జాప్యం చేస్తూ విశ్వవిద్యాలయాలు తమ విధులు నిర్వర్తించకుండా అవరోధాలు సృష్టిస్తున్నాయి. దేశవ్యాప్తంగా అనేక విశ్వవిద్యాలయాలలో వేలాది అధ్యాపక పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వాటిని ఎప్పుడు భర్తీ చేస్తారు? అక్టోబర్ 31, 2024న పార్లమెంటులో ప్రభుత్వం ఇచ్చిన ఒక సమాధానం ప్రకారం కేంద్రీయ విశ్వవిద్యాలయాలలో 5,182 అధ్యాపక పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఈ సమస్యకు పరిష్కారం ఆర్థిక మంత్రిత్వ శాఖ అధికారాల పరిధిలో లేదని నేను భావిస్తున్నాను. ఈ అంశంపై ఇదీ నా సూచన: తాను నిర్వర్తించవలసిన పనుల జాబితా నుంచి సీఈఏ ఈ అంశాన్ని తొలగించాలి.

ప్రభుత్వ ప్రధాన సలహాదారు 'ఆర్థిక వ్యవస్థ అధికారికీకరణ' అన్నారు. అంటే ఏమిటి? అనియత రంగంలో నిర్వర్తించే ఆర్థిక కార్యకలాపాల (ఉదాహరణకు మధ్యతరగతి కుటుంబాలలో పనివాళ్ల సేవలు మొదలైనవి)ను అధికారికీకరణ చేయాలని సీఈఏ అభిలషిస్తున్నారా? ఈ అంశంపై స్పష్టత లేదు. నేను చేయగల సూచన ఏదీ లేదు. చివరగా ఒక మాట: నా ఈ సూచనలు ఆమోదించండి లేదా తిరస్కరించండి. అయితే ఎట్టిపరిస్థితులలోను వాటిని ఉపేక్షించవద్దు.

(వ్యాసకర్త కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు)

కాలుష్య సమస్యకు కులం పులుముతున్నారు!

గద్వాల జిల్లా రాజోలు మండలం పెద్ద ధన్వాడ, దానికి సమీపంలోని మరో పన్నెండు గ్రామాల ప్రజలు తమ గ్రామాలు, పొలాల మధ్యలో ఇథనాల్ ప్లాంటు నిర్మాణం ప్రారంభించేందుకు కంపెనీ యాజమాన్యం చేస్తున్న ప్రయత్నాలను వ్యతిరేకిస్తూ ఏడాది కాలంగా ఆందోళన చేస్తున్నారు. ఈ క్రమంలో అధికార పార్టీ నాయకుడు ఒకరు ప్లాంటు నిర్మాణాన్ని ఆపిస్తానని హామీ ఇవ్వటంతో తమకు న్యాయం జరుగుతుందని నమ్మి ఆందోళన విరమించారు. కానీ మూడు నెలల తరువాత కంపెనీ నిర్మాణ ప్రక్రియను తిరిగి ప్రారంభించడంతో ప్రజలు మరలా సంఘటితమయ్యారు. వేలాదిమందిగా కంపెనీ స్థలానికి చేరారు. కంపెనీ బౌన్సర్లు ప్రజలపై దాడి చేయటంతో ఒకామె తలకు గాయమైంది. ఆగ్రహించిన ప్రజలు పనివారి కోసం కట్టిన గుడారాలను ధ్వంసం చేసి, కంటైనర్‌ను తగులబెట్టారు.

దీనిపై పోలీసులు నలభై మందిపై కేసులు పెట్టి, వారిలో పన్నెండు మందిని అరెస్టు చేసి జైలుకు పంపారు. జూన్ 18న వారిని కోర్టుకు తీసుకువచ్చినప్పుడు రైతుల చేతులకు బేడీలు వేశారు. గతంలో లగచర్ల ఘటనలో రైతుల చేతులకు బేడీలు వేయడాన్ని రాష్ట్ర హైకోర్టు తీవ్రంగా తప్పుపట్టి మందలించినా, తిరిగి అదే తప్పును పోలీసులు పెద్ద ధన్వాడ రైతుల విషయంలో చేశారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం కూడా ఖమ్మం రైతులతో ఇలానే వ్యవహరించి, ఫలితాన్ని అనుభవించిందని కాంగ్రెస్ ప్రభుత్వం గుర్తించాలి. పెద్ద ధన్వాడ ఘటన నేపథ్యంలో రాష్ట్ర పరిశ్రమల శాఖామాత్యులు శ్రీధర్‌బాబు ఆ ప్రాంతంలో ఇథనాల్ ప్లాంటు ఏర్పాటు తథ్యమని ప్రకటించారు. ఇథనాల్ ప్లాంట్లతో కాలుష్యానికి అవకాశమే లేదనీ, అత్యాధునిక పద్ధతులలో వాటిని నిర్మిస్తారనీ తెలిపారు. ప్లాంటుకు సంబంధించిన అన్ని అంశాలపై రైతులకు అవగాహన కల్పించామనీ, ప్రభుత్వ వివరణతో ప్రజలు సంతృప్తి చెందారనీ ప్రకటించారు.

ఇథనాల్ ప్లాంట్లతో కాలుష్యానికి అవకాశమే లేదన్నది నిరాధారం. ప్రపంచంలోనే అత్యధికంగా ఇథనాల్ ఉత్పత్తి చేసే దేశం అమెరికా. అక్కడ కాలుష్య నియంత్రణ సంస్థలు వాయు కాలుష్యాన్ని తొలగించడానికి కంపెనీలపై అనేక నియమాలు పెడతాయి. ఇథనాల్ ప్లాంట్ల నుంచి వెలువడే 'వోలటైల్ ఆర్గానిక్ కాంపౌండ్స్' (వీఓసీ)లను తొలగించడానికి థర్మల్ ఆక్సిడైజర్ గానీ, ఇతర బయో ట్రిక్లింగ్ సాధనాలను గానీ వినియోగిస్తే, అవి ప్లాంట్‌ల నుంచి వెలువడే వాయు కాలుష్యం 95–99 శాతం వరకూ తగ్గిస్తాయి. ప్రపంచ వనరుల సంస్థ జూన్ 10 నాటి తమ విశ్లేషణలో అమెరికాలో ఇథనాల్ ఉత్పత్తి, విస్తరణ, దాని వాతావరణ ప్రభావాలపై అనేక ప్రశ్నలను లేవనెత్తింది. ఈ విశ్లేషణ ప్రకారం, 2021లో ఇథనాల్ రిఫైనరీలు 17.4 మిలియన్ మెట్రిక్ టన్నుల కార్బన్ డై ఆక్సైడ్‌కు సమానమైన గ్రీన్‌హౌస్ వాయువులను విడుదల చేశాయి. ఇది 44 బిలియన్ మైళ్ల డ్రైవింగ్‌తో వచ్చే కాలుష్యానికి సమానం. అదనంగా ఈ ప్లాంట్లు ఆయిల్ రిఫైనరీలతో పోలిస్తే నాలుగు రెట్లు ఎక్కువ అసిటాల్డిహైడ్, అక్రోలిన్, ఫార్మాల్డిహైడ్, హెక్సేన్ వంటి వోలటైల్ ఆర్గానిక్ కాంపౌండ్స్‌ను విడుదల చేస్తాయి. ఇవి శ్వాసకోశ సమస్యలకు కారణమవుతాయి. ఇథనాల్ కోసం– అధిక నీటి వినియోగాన్ని కలిగిన వరి, మొక్కజొన్న, సోయాబీన్ పంటల సాగు భూగర్భ జలాలను క్షీణింపజేస్తుంది. అమెరికాలోని ఎన్విరాన్‌మెంటల్ ఇంటెగ్రిటీ ప్రాజెక్ట్ (ఇఐపి) 2024లో విడుదల చేసిన నివేదిక ప్రకారం అక్కడి 191 ఇథనాల్ ప్లాంట్లు, 71 బయో డీజిల్ ప్లాంట్లు, 13 రెన్యూవబుల్ డీజిల్ ప్లాంట్లు కలసి 12.9 మిలియన్ పౌండ్ల విషపదార్థాలను వాతావరణంలోకి విడుదల చేశాయి. తగిన నియంత్రణ పద్ధతులలో 95–99 శాతం వరకూ వాయు కాలుష్యాన్ని తొలగించిన తరువాతనే అదనంగా ఇంత కాలుష్యం విడుదలైందన్నది మనం గుర్తించాలి.



> ఇథనాల్ ప్లాంట్‌ల కాలుష్య సమస్యకు సరైన వివరణ ఇచ్చి ప్రజలను సమాధానపరచే బదులు, కంపెనీ యాజమాన్యం ఈ సమస్యను కుల సమస్యగా చిత్రించే ప్రయత్నం చేసింది. నిజానికి చిత్తనూరు, దిలావర్‌పూర్, పెద్ద ధన్వాడ ప్రాంతాలలో ఇథనాల్ వ్యతిరేక పోరాటాలలో పాల్గొన్న వారిలో అత్యధికులు దళితులు, వెనుకబడిన వర్గాల ప్రజలే. ప్రజల ఆందోళనలకు ప్లాంట్‌ల నుంచి వెలువడే కాలుష్యభయమే ప్రధాన కారణం.

నిజానికి భారతదేశంలో, మన రాష్ట్రంలో ఇథనాల్ ప్లాంట్లకు ఇచ్చే పర్యావరణ అనుమతుల్లో ఈ వాయు కాలుష్యాన్ని అసలు గుర్తించడమే లేదు. అందుకే ఇప్పటికే ఉత్పత్తి ప్రారంభమైన నారాయణపేట జిల్లా మరికల్ మండలం చిత్తనూరు ఇథనాల్ ప్లాంట్ పరిసర గ్రామాల ప్రజలు దుర్వాసనలతో తల్లడిల్లుతున్నారు. ఇథనాల్ ప్లాంట్లు అక్రోలిన్ (శ్వాస సమస్యలు, ఆస్తమాకు కారణం), హెక్సేన్ (నాడీ మండలం దెబ్బతింటుంది), అసెటాల్డిహైడ్, ఫార్మాల్డిహైడ్‌ల (క్యాన్సర్ కారకం) వంటి విష రసాయనాలను ఎక్కువగా విడుదల చేస్తాయి. ఇథనాల్ కోసం అదనంగా పండించే మొక్కజొన్న ఉత్పత్తి భూసార క్షీణతకు, అడవుల నిర్మూలనకు, ఆవాస నష్టానికి కారణమవుతుంది. ఇవన్నీ కలిపి భూతాపాన్ని మరింత పెంచుతాయి.


ఇథనాల్ ప్లాంట్‌ల కాలుష్య సమస్యకు సరైన వివరణ ఇచ్చి ప్రజలను సమాధానపరచే బదులు, కంపెనీ యాజమాన్యం ఈ సమస్యను కుల సమస్యగా చిత్రించే ప్రయత్నం చేసింది. బీసీ కుల సంఘాల నాయకులతో పత్రికా సమావేశం ఏర్పాటు చేయించింది. బీసీలు పరిశ్రమలు నిర్మించి తెలంగాణను అభివృద్ధి చేస్తుంటే, ఓర్వలేని కొంతమంది వ్యక్తులు రాజకీయ పార్టీల మద్దతుతో దాడులకు పాల్పడుతున్నారని వారు ప్రకటించారు. ఈ వాదన ఆధారాలు లేనిది. ఎందుకంటే ఇప్పటివరకూ చిత్తనూరు, దిలావర్‌పూర్, పెద్ద ధన్వాడ ప్రాంతాలలో ఇథనాల్ వ్యతిరేక పోరాటాలలో పాల్గొన్న వారిలో అత్యధికులు దళితులు, వెనుకబడిన వర్గాల ప్రజలే. వారు కేసులకు, రాజ్యహింసకు గురై జైలు పాలయ్యారు. ప్రజల ఆందోళనలకు ఇథనాల్ ప్లాంట్‌ల కాలుష్య భయమే ప్రధాన కారణం.

పైగా, ఈ ప్లాంట్లను నిర్మిస్తున్న ప్రాంతాలలో "రైతులకు ప్రయోజనం, నిరుద్యోగులకు ఉద్యోగాలు" అనే వాదనలు కూడా అబద్ధమని ఇప్పటికే తేలిపోయింది. దేశ వ్యాపితంగా ఈ ఇథనాల్ ప్లాంట్‌లు ప్రారంభమైన ప్రాంతాల్లో స్థానిక కంపెనీలు కనీసమద్దతు ధరలకు నేరుగా రైతుల నుంచి వడ్లు, మొక్కజొన్న కొనుగోలు చేయలేదు. కేంద్ర ప్రభుత్వమే సబ్సిడీ ధరతో ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎఫ్.సి.ఐ) నుంచి బియ్యం సరఫరా చేసింది. కనీసమద్దతు ధరలతో తాము రైతుల నుంచి నేరుగా వరి ధాన్యం, మొక్కజొన్న కొనలేమనీ, అందువల్ల ఈ ప్లాంట్‌లకు ఎఫ్‌సిఐ ద్వారా రాబోయే ఐదేళ్ల పాటు చవక ధరలకు బియ్యం సప్లై చేయాలనీ, జన్యు మార్పిడి మొక్కజొన్నను అమెరికా నుంచి దిగుమతి చేసుకుంటామనీ, దానిపై దిగుమతి సుంకం పూర్తిగా రద్దు చేయాలనీ కోరుతూ ఈ కంపెనీలు కేంద్ర ప్రభుత్వానికి ఉత్తరం రాశాయి. ప్రెస్ మీట్ పెట్టి డిమాండ్ చేశాయి. ఈ ప్లాంట్‌ల వల్ల రైతులకు ఏ లాభమూ లేదు.

పెట్టుబడిదారులు ఏ కులం వారైనప్పటికీ, కాలుష్యం అనేది అన్ని కులాలపై సమానంగా ప్రభావం చూపుతుంది. ఈ సమస్యను పరిష్కరించేందుకు కంపెనీ, ప్రభుత్వం సంయుక్తంగా ఎన్విరాన్‌మెంటల్ ఇంపాక్ట్ అసెస్‌మెంట్ నిర్వహించి, ఫలితాలను ప్రజల ముందు ఉంచాలి. ప్రభుత్వ అధికారులు, పర్యావరణవేత్తలు, ప్రజలు, ప్రజాసంఘాలు, పౌర సమాజ ప్రతినిధులతో ఒక సంయుక్త కమిటీని ఏర్పాటు చేసి క్షేత్రస్థాయి వాస్తవాలు, అంతర్జాతీయ నివేదికల ఆధారంగా చర్చించాలి. ఇప్పటివరకూ రాష్ట్రంలో వివిధ ప్రాంతాలలో జరిగిన ఇథనాల్ వ్యతిరేక పోరాటాలలో పాల్గొన్న వారిపైన, నాయకులపైన పెట్టిన అన్ని కేసులూ వెనక్కు తీసుకోవాలి. పోలీస్ దాడులలో గాయపడిన వారికి, అరెస్ట్ అయిన వారికీ న్యాయం కల్పించేందుకు స్వతంత్ర దర్యాప్తు చేయాలి.

• కలపాల బాబూరావు
సైంటిస్ట్స్ ఫర్ పీపుల్

• కన్నెగంటి రవి
తెలంగాణ పీపుల్స్ జాయింట్ యాక్షన్ కమిటీ



రజక భవనంపై వివాదం

- రూ.6కోట్ల ప్రభుత్వ నిధులతో నిర్మాణం
- కొత్త ట్రస్ట్‌కు భవనం బదిలీప్తై అభ్యంతరం
- ప్రభుత్వానికి వెల్లువెత్తిన ఫిర్యాదులు
- అప్పగింతను వెనక్కి తీసుకున్న ప్రభుత్వం



7



భగమాలిని అలంకారంలో భద్రకాళి దేవి

భగమాలినిగా భద్రకాళి

వరంగల్ కల్చరల్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ప్రసిద్ధ భద్రకాళి ఆలయంలో జరుగుతున్న శాకంబరీ నవరాత్రి మహోత్సవాలు శుక్రవారం రెండో రోజుకు చేరుకున్నాయి. ఉదయం 4గంటలకు నిత్య పూజ నిర్వహించి, దీక్షా హోమం జరిపి చతుష్షానార్చన నిర్వహించారు. అనంతరం అర్చకులు తిథి మండల దేవత యజనంలో భాగంగా అమ్మవారిని జ్ఞానశక్తిని కాళీ క్రమాన్ని అనుసరించి కపాలిని మాత క్రియాశక్తిని శోడషీ అనుసరించి భగమాలిని మాతగా అమ్మవారిని అలంకరించి పూజ ఆరాధనలు నిర్వహించి భక్తుల దర్శనానికి అనుమతించారు. ఈ అమ్మవారు అసుర శక్తుల విధ్వంసం నుంచి సృష్టిని కాపాడుతుందని, పైశాచిక శక్తులను సంహరించి అసుర శక్తులపై దైవీశక్తుల విజయ సంకేతంగా రాక్షసుల కపాలలను మాలగా (మిగతా 8వ పేజీలో)




ఎంజీఎం ఆస్పత్రిలో వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న హెల్త్ కమిషనర్ సంగీత

మరింత మెరుగ్గా వసతులు

- రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక అందిస్తాం..
- ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ సర్వే సంగీత
- నగరంలోని ప్రభుత్వ ఆస్పత్రులు, కేఎంసీలో తనిఖీలు

7



మారని తీరు.. వసూళ్ల జోరు..

అవినీతికి అడ్డాగా మారిన సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు

అక్కడ ముడుపులు ముట్టందే ఫైలు కదలదు.. చేయి తడపందే సంతకం సాక్షాత్కారం కాదు.. ఆ శాఖలో పనిచేసే ఉద్యోగులకే కాదు, దాని చుట్టూ వున్న ఓ వ్యవస్థకూ అక్కడ నోట్ల పండుతుంది.. పాతుకుపోయిన అవినీతిని చూసి కడుపు రగిలినా, చేసేదేమీ లేక సామాన్యుడు జేబులు ఖాళీ చేసుకుంటున్నాడు.. ఆ శాఖలో పనిచేసే అధికారులు అనతికాలంలోనే కోట్లకు పడగలెత్తుతున్నారు.. ఇది ఏ శాఖో ఇప్పటికే సులభంగా అర్థమై ఉంటుంది. అదే రిజిస్ట్రేషన్ శాఖ. అవినీతి కేరాఫ్‌గా మారిన ఈ శాఖపై ఏసీబీ అధికారులు పంజా విసురుతున్నా పరిస్థితి మారడం లేదు. ఉమ్మడి జిల్లాలోని పలు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అధికారుల లంచాల దందా జోరుగా సాగుతోంది. కొందరు డాక్యుమెంట్ రైటర్లు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు దళారుల అవతారమెత్తి వసూళ్ల దందాకు దిగుతున్నారు. సబ్‌రిజిస్ట్రార్లకు ఇవ్వాల్సిన సొమ్ముతో పాటు డాక్యుమెంట్ తయారీ ఖర్చుల పేరుతో వసూళ్లకు పాల్పడుతున్నారు. ప్రభుత్వం ఆన్‌లైన్ విధానాన్ని తెచ్చినప్పటికీ ఫలితం ఉండటం లేదు. లోపాలను సాకుగా చూపి ఒక్కో రిజిస్ట్రేషన్‌కు రూ.10వేల నుంచి రూ.2లక్షల వరకు వసూళ్లు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

■ ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్

- దళారుల అవతారమెత్తిన డాక్యుమెంట్ రైటర్లు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు
- ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ విధానం తెచ్చినా అదే పరిస్థితి
- క్రయవిక్రయాలకు తప్పని అదనపు ముడుపులు
- నాలా కన్వర్షన్ లేకున్నా, అసైన్డ్ భూములైనా దర్జాగా రిజిస్ట్రేషన్లు
- ఒక్కోడాక్యుమెంటుకు రూ.10వేల నుంచి రూ.2లక్షలకు పైగా వసూళ్లు
- పై అధికారులకు నెలకు రూ.లక్షల్లో వాటాలు
- ఫిర్యాదులను తొక్కిపెడుతున్న ఉన్నతాధికారులు
- ఏసీబీ వరుస దాడులతోనూ నియంత్రణ కాని అక్రమార్కులు

ఉమ్మడి వరంగల్ జిల్లాలో 12 సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలు, జిల్లా రిజిస్ట్రేషన్ కార్యాలయం ఉంది. వీటిలో ప్రతీరోజు వందల సంఖ్యలో రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయి. గత ఏడాదికాలంగా 12మంది సబ్‌రిజిస్ట్రార్లలో ముగ్గురు ఏసీబీ అధికారులకు పట్టుబడగా, తాజాగా భీమదేవరపల్లి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఏసీబీ అధికారుల దాడులు, డాక్యుమెంట్ రైటర్స్ వద్ద రూ.96,800 నగదు లభించటం రిజిస్ట్రేషన్ శాఖలో అవినీతికి నిదర్శనంగా చెప్పుకుంటున్నారు. ప్రభుత్వం ప్రజలకు మెరుగైన సేవలు అందించాలనే లక్ష్యంతో అన్ని జూన్ 2వ తేదీ నుంచి అన్ని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో భూముల రిజిస్ట్రేషన్‌ను ఆన్‌లైన్ చేసింది. దళారుల బెడద లేకుండా నేరుగా ప్రజలే క్రయవిక్రయాలు జరుపుకునేలా ప్రభుత్వం ఆన్‌లైన్ విధానాన్ని తీసుకువచ్చింది. అయితే సేవలు ఆన్‌లైన్ అయినప్పటికీ వసూళ్లు మాత్రం ఆఫ్‌లైన్‌లో ఆగటం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. భూములు, ప్లాట్లు రిజిస్ట్రేషన్‌కు కావాల్సిన డాక్యుమెంట్లను స్వయంగా ప్రజలు తయారు (మిగతా 7వ పేజీలో...)



భీమదేవరపల్లి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో తనిఖీలు చేస్తున్న ఏసీబీ అధికారులు(ఫైల్)

ఏసీబీ దాడుల్లో పట్టుపడిన వివరాలు

- జూన్ 26న భీమదేవరపల్లి సబ్‌రిజిస్ట్రేషన్ కార్యాలయంలో ఏసీబీ దాడులు చేసి డాక్యుమెంట్ రైటర్ల వద్ద రూ.96,800 స్వాధీనం చేసుకున్నారు. సబ్‌రిజిస్ట్రార్ టేబుల్‌పై రిజిస్ట్రేషన్ల సంఖ్యతో ఉన్న చీటి లభ్యమైంది.
- మార్చి 20వ తేదీన జనగామ జిల్లా స్టేషన్‌ఘనపూర్ సబ్‌రిజిస్ట్రార్ రామకృష్ణ. ఓ ఇంటి రిజిస్ట్రేషన్ కోసం రూ.18వేల డిమాండ్ చేసి, తన ప్రవేటు అసిస్టెంట్ రమేష్ ద్వారా లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడ్డారు.
- గత ఏడాది జూలై 26వ తేదీన హనుమకొండ జిల్లా పరకాల సబ్ రిజిస్ట్రార్ సునిత 1,173గజాల భూమిని గిఫ్ట్ రిజిస్ట్రేషన్ చేసేందుకు డాక్యుమెంట్ రైటర్ నరేష్ ద్వారా రూ.80వేలు తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు.
- గత ఏడాది మార్చి 22న మహబూబాబాద్ సబ్‌రిజిస్ట్రార్ తస్లీమా 128గజాల ప్లాట్ రిజిస్ట్రేషన్ కోసం ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి వెంకటేశ్ ద్వారా రూ.19,200 లంచం తీసుకుంటూ పట్టుబడ్డారు.



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి

మహిళా డెయిరీ ఏర్పాటుకు సత్వర చర్యలు చేపట్టాలి

పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి

హనుమకొండ కలెక్టరేట్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): పరకాలలో మహిళా డైరీ ఏర్పాటుకు అధికారులు సత్వర చర్యలు తీసుకోవాలని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి కోరారు. జిల్లా కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్‌హాల్‌లో పరకాల మహిళా డైరీ ఏర్పాటు, నిర్వహణకు సంబంధించిన వివిధ అంశాలపై హనుమకొండ, వరంగల్ జిల్లాల కలెక్టర్లు స్నేహ శబరీష్, డాక్టర్ సత్యశారద, పలు శాఖల అధికారులతో శుక్రవారం రాత్రి ఎమ్మెల్యే సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి మాట్లాడుతూ.. మహిళా డైరీ ఏర్పాటుకు సంబంధించిన వివిధ శాఖల అంశాలపై ఆయా శాఖల అధికారులు సమన్వయంతో త్వరగా పూర్తయ్యేలా చూడాలన్నారు. మిల్క్ సెంటర్ల ఏర్పాటు, రవాణా, సొసైటీ ఏర్పాటు, మార్కెటింగ్, చెల్లింపులు, తదితర అంశాలపై ప్రణాళిక రూపొందించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ వెంకటరెడ్డి హనుమకొండ, వరంగల్ జిల్లాల డీఆర్‌డీఓలు మేన శ్రీను, కౌసల్యదేవి, సహకార అధికారులు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

పైసలిస్తేనే 'పాస్' అంటారు...

బిల్లుల చెల్లింపులో బడా కాంట్రాక్టర్లకే జీడబ్ల్యూఎంసీ అధికారుల వత్తాసు

- పాస్ ఆర్డర్లు వేయడంలో ఇష్టారాజ్యం
- సిండికేట్లదే హవా అంటున్న వర్ధమాన కాంట్రాక్టర్లు
- అక్రమాలకు అడ్డాగా మారిన అకౌంట్స్ సెక్షన్

కొత్త కమిషనర్ దిద్దుబాటు చర్యలు తీసుకోవాలని వినతి



వరంగల్ కార్పొరేషన్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ (జీడబ్ల్యూఎంసీ) కార్యాలయానికి గుండెకాయ లాంటి అకౌంట్స్ సెక్షన్ కొంతకాలంగా అక్రమాలకు అడ్డాగా మారిందనే ఆరోపణలున్నాయి. గతంలో పూర్తి స్థాయి ఏవో (అకౌంట్స్ ఆఫీసర్) లేక పోవడంతో ఇక్కడ పని చేసే కొందరు సిబ్బంది ఇష్టారాజ్యంగా బిల్లుల చెల్లింపులకు అడ్డదారిలో తెరలేపారు. పాలక వర్గం పెద్దలు, మంత్రులు, ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లు, సిండికేట్ కాంట్రాక్టర్లు ఇచ్చిన సిఫారసు పత్రాలపై మాత్రమే ఇప్పటికీ చేసిన పనులకు బిల్లుల చెల్లింపు జరుగుతున్నాయని, ఈ అడ్డగోలు సంస్కృతికి కొత్త కమిషనర్ చరమగీతం పాడాల్సిన అవసరం ఉందనే వాదనలు వినిపిస్తున్నాయి. కార్పొరేషన్‌లో ఏ సపోర్టు, పలుకుబడి లేని కాంట్రాక్టర్లు... తాము గత రెండేళ్లుగా చేసిన పనులకు బిల్లులు రాకపోవడంతో గ్రేటర్ ప్రధాన కార్యాలయం అకౌంట్స్ కార్యాలయం చుట్టూ చెప్పులరిగేలా తిరుగుతున్నారు. గ్రేటర్‌లో నెలకొన్న పరిస్థితుల దృష్ట్యా స్మార్ట్ సిటీ పనులు, జనరల్ ఫండ్, సీఎం ఫండ్, ప్రత్యేక నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లులు సీరియల్ వైస్‌గా ఇవ్వాలని సీనియర్ కాంట్రాక్టర్లు కోరుతున్నారు.

జీడబ్ల్యూఎంసీ పరిధిలోని ప్రధాన కార్యాలయంతో పాటు నక్కలగుట్ట, కాశిబుగ్గ, పబ్లిక్‌గార్డెన్, కాజీపేట సర్కిళ్లకు సంబంధించిన సీసీ, డ్రైనేజీ, కల్వర్టు, పూడికతీత పనులకు సంబంధించి అభివృద్ధి పనుల బిల్లులు చెల్లింపులకు అకౌంట్స్ సెక్షన్‌కు వస్తాయి. పనులను బట్టి సీరియల్ ప్రకారంగా బిల్లులు చెల్లింపులు జరగాలి. కానీ గతంలో మంత్రులు, ఎమ్మెల్యేలు, పాలకవర్గం పెద్దలు, కమిషనర్, సిండికేట్ కాంట్రాక్టర్లు, యూనియన్లు, బడాబాబుల ఫోన్లు, సిఫారసు చేసిన లేఖలకే ప్రాధాన్యం ఇచ్చి బిల్లులు చెల్లించినట్లు తెలిసింది. కోట్లలో పనులు చేసిన కాంట్రాక్టర్లకు లక్షకు 5శాతం కమీషన్ చొప్పున క్రమసంఖ్య లేకుండా అడ్డదారిలో బిల్లుల చెల్లింపులు జరిగినట్లు తెలిపారు. చిన్న, వర్ధమాన కాంట్రాక్టర్లు చేసిన బిల్లులు పెండింగ్‌లోనే ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడి సెక్షన్‌లో పని చేసిన ఓ అధికారి అనతికాలంలోనే పెద్దల అండతో కోట్లకు పడగలెత్తినట్లు ఆరోపణలు ఉన్నాయి. గ్రేటర్ పరిధిలో సుమారు 150 మంది కాంట్రాక్టర్లకు రూ.100 కోట్లకు పైగా బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని, అందువల్ల చేసిన పనులకు వరుస క్రమంలో వచ్చిన బిల్లులు మాత్రమే చెల్లించాలని కాంట్రాక్టర్లు కొత్త కమిషనర్‌ను కోరుతున్నారు.

పైసలిస్తేనే ఎంబీలపై సంతకాలు

జీడబ్ల్యూఎంసీ పరిధిలో రూ.5లక్షలలోపు పనులను నామినేటెడ్ పనుల కింద చూపెడుతారు. ఈ క్రమంలో రూ.50లక్షలలోపు పనులు ఈఈ పరిధిలో రూ.50లక్షలకంటే పైన ఎస్ఈ పరిధిలో టెండర్లు పిలిచి కాంట్రాక్టర్లకు పనులను అప్పగిస్తారు. నిర్ణీత గడువులోపు కాంట్రాక్టర్లు ఆయా పనులను పూర్తి చేసి ముందుగా మెజర్‌మెంట్ బుక్‌లను సదరు వర్క్ ఇన్‌స్పెక్టర్‌కు అందిస్తారు. ముందుగా ఏఈ, డీఈ, ఈఈలు ఎంబీలను పరిశీలించిన తర్వాత కొంత పర్సంటేజీ డబ్బులు తీసుకుని క్వాలిటీ కంట్రోల్‌కు పంపిస్తారు. అధికారులు క్షేత్రస్థాయిలో పనులను పరిశీలించిన తర్వాత పనుల నాణ్యతపై ఓ నిర్ణయానికి వచ్చి బిల్స్ తయారు చేసి కమిషనర్ టేబుల్‌పైకి ఎంబీలను పంపాల్సి ఉంటుంది. కానీ చాలాకాలంగా క్యూసీ విభాగంలో పాతుకుపోయి కోట్లకు పడగలెత్తిన ఓ అధికారి పనులను పరిశీలించకుండానే అందిన కాడికి డబ్బులు దండుకుని కాంట్రాక్టర్లు బిల్లులు పొందేందుకు గ్రీన్ సిగ్నల్ ఇస్తున్నట్టు విశ్వసనీయ సమాచారం.

మహిళ మెడలో నుంచి గొలుసు చోరీ



కాజీపేట, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): వాకింగ్ చేస్తున్న మహిళ మెడలో నుంచి ఓ వ్యక్తి బంగారు గొలుసు లాక్కుని పారిపోయాడు. కాజీపేట ఎస్సై నవీన్ కుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండల కేంద్రానికి చెందిన అలువాల కాంతమ్మ కాజీపేట దర్గాలో ఉంటున్న తన తమ్ముడు రమేశ్‌కు ఆరోగ్యం బాగా లేకపోవడంతో చూడటానికి కాజీపేటకు వచ్చింది. శుక్రవారం ఉదయం దర్గా ఇందిరమ్మ కాలనీలో వాకింగ్ చేస్తుండగా గుర్తుతెలియని వ్యక్తి వెనుక నుంచి వచ్చి ఆమె మెడలోని 22 గ్రాములు గొలుసు చోరీ చేసి పారిపోయాడు. సెంట్రల్ జోన్ డీసీపీ సలీమా ఘటనాస్థలికి చేరుకుని వివరాలు సేకరించారు. బాధితురాలు ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. చోరీ అయిన గొలుసు విలువ రూ.1,50,000 ఉంటుందని పోలీసులు చెప్పారు.

పాండవుల గుట్టల స్వరూపం అద్భుతం



పాండవుల గుట్టల వద్ద ప్యానెల్ బోర్డును ఏర్పాటు చేస్తున్న జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా శాస్త్రవేత్తలు

- టూరిజం సైట్‌లో ప్యానల్ బోర్డు
- పూర్తి సమాచారం తెలుసుకునే అవకాశం
- జీఎస్ఐ డైరెక్టర్ మంజు

భూపాలపల్లి, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): ఇక టూరిజం సైట్‌లో పాండవుల గుట్ట సమాచారాన్ని సూచించే ప్యానల్ బోర్డు ఉండనుంది. శుక్రవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని చారిత్రక పాండవుల గుట్ట వద్ద ఇక్కడి రాళ్ల నిర్మాణాలు, భౌగోళిక ప్రాముఖ్యతను సూచించేలా సమాచార ప్యానల్ బోర్డును ప్రారంభించారు. జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా తెలంగాణ డైరెక్టర్ ఎస్.మంజు, సీనియర్ శాస్త్రవేత్తలు డాక్టర్ రమేష్, డాక్టర్ గుండా రమేష్, తుశార్ చంద్రపటేల్, అశోక్, కుమార్‌ల బృందం ఇక్కడి భౌగోళిక ప్రాముఖ్యతను సూచించేలా ఏర్పాటు చేసిన సమాచార ప్యానల్ బోర్డును ప్రారంభించారు. పాండవుల గుట్టకు భౌగోళిక ప్రాముఖ్యత రావడానికి కారణం ఇక్కడి అసామాన్యమైన రాళ్ల నిర్మాణాలు, గుహలు, శిలా సంపద, భారత చరిత్రకు తార్కాణంగా నిలిచే విశేషాలను ఇక్కడి గుహలు కలిగి ఉన్నాయని బృందం పేర్కొంది. ఇక్కడి గుట్టల్లో పల్లెటూరి ప్రజల జీవనశైలి ప్రతిబింబించే ప్యాలియోలితిక్, మెసో లితిక్ శిలా చిత్రాలు, మధ్యయుగ నివాసాలకు సంబంధించిన ఆధారాలు ఇక్కడ కనిపిస్తున్నట్లు పేర్కొన్నారు. శిలా చిత్రాల్లో ప్రధానంగా బైసన్, కృష్ణజింక, పులులు చిత్రాల వంటి పెద్ద జంతువుల చిత్రాలు ఇక్కడ కనిపిస్తున్నట్లు శాస్త్రవేత్తలు తెలిపారు. ఈ చిత్రాలు ఇక్కడి భౌగోళిక ప్రాధాన్యాన్ని మరింత పెంచడమే కాకుండా తెలంగాణ రాష్ట్రంలో పాండవుల గుట్టల ప్రాంతం ఏకైక జియో హెరిటేజ్ ప్రదేశంగా ఉందని అందుకే ఇక్కడి పూర్తి సమాచారాన్ని అందరికీ తెలిసేలా జియో హెరిటేజ్ ఇన్ఫర్మేషన్ ప్యానల్‌ను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

అదనపు గవర్నమెంట్ ప్లీడర్లుగా
ఇద్దరి నియామకం


పొలసాని వాణి


ఎడవెల్లి సత్యనారాయణరెడ్డి

వరంగల్ లీగల్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): ఆర్బిట్రేషన్ కేసుల కోసం అదనపు గవర్నమెంట్ ప్లీడర్‌గా న్యాయవాది పొలసాని వాణిని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు శుక్రవారం ప్రకటనలో వెలువరించారు. హనుమకొండ జిల్లా కోర్టులోని ఆర్బిట్రేషన్‌కు సంబంధించిన కేసులను పర్యవేక్షిస్తారు. వరంగల్ జిల్లా సంగెం మండలం గవిచర్ల గ్రామానికి చెందిన వాణి 18 ఏళ్లనుంచి ఉమ్మడి జిల్లా కోర్టులో న్యాయవాదిగా ప్రాక్టీస్ చేస్తున్నారు. ఆమె ఈ పదవిలో మూడేళ్లపాటు కొనసాగుతారని ఉత్తర్వులో పేర్కొన్నారు. అలాగే హనుమకొండ మొదటి అదనపు జిల్లా జడ్జి కం ల్యాండ్ రిఫామ్స్ అప్పీల్ ట్రిబ్యునల్ కోర్టుకు అదనపు ప్రభుత్వ న్యాయవాదిగా ఎడవెల్లి సత్యనారాయణరెడ్డిని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులను జారీ చేసింది. ఈ మేరకు శుక్రవారం ప్రకటన విడుదల చేశారు. ఆయన ఈ పదవిలో మూడేళ్లు కొనసాగుతారని ఉత్తర్వులో పేర్కొన్నారు. హనుమకొండకు చెందిన సత్యనారాయణరెడ్డి 1990 నుంచి ఉమ్మడి జిల్లా కోర్టులో న్యాయవాదిగా ప్రాక్టీస్ చేస్తున్నారు. గతంలో వరంగల్ జిల్లా ప్రధాన సెషన్స్ జడ్జి పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా, వరంగల్ జిల్లా ఫాస్ట్ ట్రాక్ కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా విధులు నిర్వర్తించారు.

లాడ్జిలో వంట మాస్టర్ మృతి


రాంబాబు (ఫైల్)

నర్సంపేట టౌన్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఓ లాడ్జిలో వంట మాస్టర్ మృతి చెందిన సంఘటన శుక్రవారం జరిగింది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం వివరాలిలా వున్నాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని గుంటూరు జిల్లా గురిజాల గ్రామానికి చెందిన చలవాది రాంబాబు నర్సంపేట పట్టణంలోని అమ్మమ్మ రుచులు హోటల్‌లో బిర్యాని వంట మాస్టర్‌గా పని చేస్తున్నాడు. 20రోజుల కిందట హోటల్ సమీపంలోని వెంకటేశ్వర లాడ్జిలో ఉంటూ పనికి వెళ్లి వస్తున్నాడు. ఈ క్రమంలో గురువారం రాత్రి పని ముగించుకొని లాడ్జికి వచ్చాడు. తిరిగి శుక్రవారం ఉదయం హోటల్‌కు పనిలోకి రాకపోవడంతో హోటల్ సిబ్బంది లాడ్జిలోని రూమ్‌కు వచ్చి పిలువగా రాంబాబు ఎంతకూ పలకకపోవడంతో అనుమానం వచ్చి తలుపులు తెరిచి చూడగా రాంబాబు మృతి చెంది ఉన్నాడు. ఈ విషయంపై టౌన్ సీఐ రఘుపతిరెడ్డిని అడుగగా గుండెపోటుతో మృతి చెంది ఉంటాడని తెలిపారు. మృతి వార్త బంధువులకు సమాచారం అందించినట్లు ఆయన చెప్పారు.

స్నాతకోత్సవాన్ని సమన్వయంతో నిర్వహించాలి

● కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి ● స్నాతకోత్సవ కమిటీ బాధ్యులతో కేయూలో అంతర్గత సమావేశం


స్నాతకోత్సవ సన్నాహక సమావేశంలో పాల్గొన్న వీసీ ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ వల్లూరి రామచంద్రం

కేయూ క్యాంపస్ జూన్ 27, (ఆంధ్రజ్యోతి): జూలై 7న కాకతీయ యూనివర్సిటీ ఆడిటోరియంలో నిర్వహించే 23వ స్నాతకోత్సవాన్ని సమన్వయంతో సమర్థవంతంగా నిర్వహించాలని కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి సూచించారు. శుక్రవారం కేయూ కమిటీ హాల్‌లో కాన్వకేషన్ స్టీరింగ్ కమిటీ బాధ్యులు, సబ్ కమిటీల బాధ్యులతోపాటు వర్సిటీకి చెందిన వివిధ విభాగాల ప్రొఫెసర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కేయూ వీసీ ప్రొఫెసర్ ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రంలు కమిటీల బాధ్యులతో అంతర్గత సమావేశం నిర్వహించారు. కేయూలో జరిగే కాన్వకేషన్‌కు వర్సిటీ చాన్స్‌లర్, రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మతో పాటు, ఐఐసీటీ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డిలు హాజరుకానున్నట్లు తెలిపారు. ఎవ్వరికీ కేటాయించిన పనులను వారు సమర్థవంతంగా నిర్వహించాలని స్పష్టం చేశారు. సమన్వయ కమిటీ బాధ్యులు ఏమేమీ పనులు చేయాలనే విషయంపై దిశానిర్దేశం చేశారు. కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ కట్ల రాజేందర్ స్నాతకోత్సవ ఏర్పాట్లపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. కమిటీ వారిగా పనులు, విధులను స్పష్టం చేశారు. ఒక్కడ ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తగా వ్యవరించాలని పేర్కొన్నారు. స్నాతకోత్సవాన్ని సక్సెస్ చేయాలని కోరారు.

ఐదుగురు ప్రొఫెసర్లతో స్టీరింగ్ కమిటీ

కేయూ స్నాతకోత్సవం నిర్వహణకు స్టీరింగ్ కమిటీని నియమించారు. స్టీరింగ్ కమిటీ చైర్మన్‌గా గణిత శాస్త్రం ప్రొఫెసర్ పి.మల్లారెడ్డిని నియమించారు. స్టీరింగ్ కమిటీ సభ్యులుగా ప్రొఫెసర్ తాళ్ళపల్లి మనోహర్, ప్రొఫెసర్ ఎన్.వాసుదేవారెడ్డి, ప్రొఫెసర్ వరలక్ష్మి, మెంబర్ కన్వీనర్‌గా ప్రొఫెసర్ కట్ల రాజేందర్‌లు నియమితులయ్యారు వీరితోపాటు మరో 10 సబ్ కమిటీలను ఏర్పాటు చేశారు. 10 సబ్ కమిటీల కన్వీనర్లను ఉద్దేశించి వారు చేయాల్సిన వివిధ విభాగాల పనిని స్టీరింగ్ కమిటీ మెంబర్ కన్వీనర్ ప్రొఫెసర్ కట్ల రాజేందర్ పవర్‌పాయింట్ ప్రజంటేషన్‌లో వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేయూ 23 స్నాతకోత్సవంలో మొత్తం 579 పీహెచ్‌డీ డిగ్రీలు 2020- 2025 ఏడాదిలో ప్రదానం చేస్తామని పేర్కొన్నారు. వీరిలో 161మంది అభ్యర్థులు గతంలో డైరెక్టుగా డిగ్రీలు స్వీకరించగా, మరో 418 మందికి స్నాతకోత్సవంలో డిగ్రీ ప్రదానం చేస్తామని వివరించారు. 331 మంది తాజా స్నాతకోత్సవానికి దరఖాస్తులు చేసుకున్నారని తెలిపారు. 2015-16, 2020-21 ఏడాదిలో 564 మందికి వివిధ విభాగాల్లో అత్యున్నత ప్రతిభ చూపినందుకు బంగారు పతకాలను ప్రదానం చేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో వివిధ కమిటీ కన్వీనర్లు, కో కన్వీనర్లు, ప్రొఫెసర్ తాళ్ళపల్లి మనోహర్, మల్లికార్జున్‌రెడ్డి, మల్లారెడ్డి, ప్రొఫెసర్ మామిడాల ఇస్తారి, ప్రొఫెసర్ ఈసం నారాయణ తదితరులు పాల్గొన్నారు.

లోపాలపై సమీక్ష

గతంలో కాకతీయ యూనివర్సిటీలో నిర్వహించిన 22వ స్నాతకోత్సవంలో లోపాలపై సమావేశంలో చర్చ జరిగింది. కాన్వకేషన్‌లో అప్పటి వీసీ ప్రవర్తన వివాదాస్పదంగా మారింది. అలాంటి తప్పులు జరుగకుండా ఎవ్వరెవ్వరు ఎలా ప్రవర్తించాలో, ఏమేమీ చేయాల్లో నిర్దిష్టంగా వివరించారు. ప్రోగ్రామ్ మినిట్ టూ మినిట్ జాగ్రత్తగా ఉండాలని సూచించారు. పీహెచ్‌డీ, బంగారు పతకాలు అందుకునే అభ్యర్థులతోపాటు వారివెంట వచ్చే అతిథులకు సౌకర్యాలు కల్పించేందుకు ఏర్పాట్లు చేయనున్నారు. స్నాతకోత్సవంలో అందరూ హుందాగా వ్యవహరించాలని దిశానిర్దేశం చేశారు.

తప్పు చేస్తే పట్టుబడతామనే భయం ఉండాలి

పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్

వరంగల్ క్రైం, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): తప్పుచేస్తే పట్టుబడుతామనే భయం ఉండే విధంగా టాస్క్‌ఫోర్స్ అధికారులు, సిబ్బంది విధి నిర్వహణ ఉండాలని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ సూచించారు. శుక్రవారం వరంగల్ పోలీస్ కమిషనరేట్ టాస్క్‌ఫోర్స్ కార్యాలయాన్ని సీపీ సందర్శించారు. పరిసరాలను పరిశీలించడంతోపాటు ఇప్పటి వరకు ఛేదించిన కేసులు, విధులు నిర్వర్తిస్తున్న అధికారుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తుల సమాచారాన్ని తెలుసుకునేందుకు బలమైన ఇన్‌ఫార్మర్ వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలన్నారు. నేరాల మూలల్లోకి వెళ్లి క్వాలిటీ వర్క్‌తో నేరస్తులను పట్టుకోవాలన్నారు. టాస్క్‌ఫోర్స్ కీర్తిప్రతిష్టలకు భంగం కలిగించేలా అధికారులు, సిబ్బంది వ్యవహరిస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ మధుసూదన్, ఇన్‌స్పెక్టర్స్ శ్రీధర్, సార్ల రాజు, బాబులాల్, పవన్‌కుమార్, సత్యనారాయణ రెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.


టాస్క్‌ఫోర్స్ పోలీసులతో మాట్లాడుతున్న సీపీ సన్‌ప్రీత్‌సింగ్

'ఆపరేషన్ కగార్' పేరుతో
ఆదివాసీలపై హింసాకాండ

● సీపీఎం రాష్ట్ర నేత ఎం.డి.అబ్బాస్ ● జఫర్‌గడ్ సీపీఎం, కాంగ్రెస్, బీఆర్ఎస్ శ్రేణుల ర్యాలీ



జఫర్‌గడ్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఎం, కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు

జఫర్‌గడ్, జూన్ 27(ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ కగార్ పేరుతో కేంద్రం ఆదివాసీలపై హింసాకాండకు పాల్పడుతోందని, ఈ ఆపరేషన్‌ను వెంటనే నిలిపివేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.డి.అబ్బాస్ డిమాండ్ చేశారు. శుక్రవారం జఫర్‌గడ్‌లో సీపీఎం, కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు భారీ ర్యాలీ నిర్వహించారు. స్థానిక శివాలయం నుంచి గాంధీ సెంటర్ మీదుగా అంబేద్కర్ సెంటర్ వరకు పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా అబ్బాస్ మాట్లాడుతూ.. ఆపరేషన్ కగార్ పేరుతో మావోయిస్టులను ఏరివేస్తామంటూ కేంద్రం ప్రకటిస్తూ అమాయక ఆదివాసీ గిరిజనులను చిత్రహింసలకు గురి చేసి వారిని అడవుల నుంచి ఖాళీ చేయిస్తున్నారని విమర్శించారు. గిరిజనులపై దమనకాండకు పాల్పడుతోందన్నారు. మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నూకల అయిలయ్య, కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు మంచాల ఎల్లయ్య, అన్నెబోయిన భిక్షపతి, కొత్వాల కుమార్ మాట్లాడుతూ.. కేంద్రం ఆపరేషన్ కగార్ పేరుతో అమాయక గిరిజనులను హింసకు గురి చేస్తూ, ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందన్నారు. ఈ కార్యక్రమాల్లో సీపీఎం, కాంగ్రెస్, బీఆర్ఎస్ జిల్లా, మండల నేతలు కుల్ల మోహన్‌రావు, సీహెచ్.కృష్ణమూర్తి, శ్రీధర్, రాపర్తి సోమయ్య, ఎండి.షబాన, గుండెబోయిన రాజు, కాట సుధాకర్, శ్రీను, శంషోద్దీన్, వడ్లకొండ సుధాకర్, రాపర్తి రజిత, వేల్పుల రవి పాల్గొన్నారు.

పెద్దపల్లి ఆర్వోబీ వద్ద విరిగిన క్లస్టర్

● కాజీపేట మీదుగా వెళ్లే రైళ్లకు అంతరాయం ● పలు రైళ్లు రద్దు, రూట్ కుదింపు


పెద్దపల్లిలో క్రాక్‌తో దెబ్బతిన్న బ్రిడ్జీ గిడ్డర్లు

కాజీపేట, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి జిల్లా కూనారం సమీపంలో నిర్మాణంలో ఉన్న ఆర్వోబీ క్లస్టర్ కిందిభాగంలో ఉన్న ఇనుప బీమ్ క్రాక్‌ను శుక్రవారం రైల్వే అధికారులు గుర్తించారు. క్రాక్ ఎక్కువైతే రైళ్ల రాకపోకల సమాయాల్లో పెద్ద ఎత్తున నష్టం జరగొచ్చని భావించిన రైల్వే అధికారులు అప్రమత్తమయ్యారు. ఆ రూట్లలో వెళ్లే తెలంగాణ, కేరళ, వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు పెద్దపల్లి రైల్వేస్టేషన్‌లో నిలిపారు. బల్లార్షా-కాజీపేట మీదుగా ఇరువైపులా నడిచే రైళ్లను గంటలకొద్ది ఎక్కడికక్కడ నిలిపి వేయడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందుల పడాల్సి వచ్చింది. తర్వాత ఆ రైళ్లను మెల్లిగా నడిపించి బ్రిడ్జి దాటించారు. ఈ కారణంగా అధికారులు పలు రైళ్లను రద్దు చేశారు. మరికొన్ని రైళ్లను కుదించి నడిపించారు పలు రైళ్లు ఆలస్యంగా నడిచాయి. భద్రాచలం నుంచి బల్లార్షా రైల్వే స్టేషన్ల మధ్య నడిచే సింగరేణి రైళ్లను భద్రాచలం-వరంగల్ మధ్య నడిపించారు. కాజీపేట జంక్షన్ -సిర్పూర్‌కాగజ్‌నగర్ల మధ్య నడిచే రామగిరి ప్యాసింజర్‌ను కాజీపేట పొత్కపల్లి మధ్య నడిపించారు. హైదరాబాద్ - సిర్పూర్ కాగజ్‌నగర్ల మధ్య నడిచే ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్‌ను హైదరాబాద్ పొత్కపల్లి మధ్య నడిపించారు. సికింద్రాబాద్ -సిర్పూర్ కాగజ్‌నగర్ల మధ్య నడిచే భాగ్యనగర్ ఎక్స్‌ప్రెస్‌ను రద్దు చేశారు. సికింద్రాబాద్ - గుంటూరు మధ్య నడిచే గోల్కొండ ఎక్స్‌ప్రెస్ కాజీపేట - గుంటూర్ మధ్య నడిపించారు. దీంతో రెగ్యులర్‌గా నడిచే రైళ్ల సైతం గంటలకొద్ది ఆలస్యంగా నడవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఉన్నతాధికారులు ఘటనాస్థలికివెళ్లి మరమ్మతు చేయిస్తున్నారు.


స్వాధీనం చేసుకున్న బెల్లంను, నిందితుడిని చూపిస్తున్న సీఐ శివకుమార్

నల్లబెల్లం పట్టివేత

వరంగల్ క్రైం, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : నల్లబెల్లంను తరలిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకొని రూ. 10వేల విలువ చేసే పటిక, నల్లబెల్లంను స్వాధీనం చేసుకున్నట్లు హనుమకొండ సీఐ మచ్చ శివకుమార్ తెలిపారు. సీఐ కథనం ప్రకారం.. మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం ఇప్పల్ తండాకు చెందిన ధరావత్ లచ్చిరామ్ తన గ్రామంలో గుడుంబా విక్రయిస్తుంటాడు. ఈ క్రమంలో మహారాష్ట్ర నుంచి తన స్వగ్రామమైన తండాకు బెల్లం తరలిస్తూ హనుమకొండ బస్టాండ్‌లో పట్టుబడగా అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశామన్నారు. కాగా, నిందితుడిని పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన ఏఎస్సై రఘునా రెడ్డి, కానిస్టేబుల్ కర్ణాకర్‌ను సీఐ అభినందించారు.

సందడిగా జిల్లా స్థాయి అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు

వరంగల్ స్పోర్ట్స్, జూన్ 27(ఆంధ్రజ్యోతి): జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హనుమకొండ జేఎన్ క్రీడా మైదానంలో జిల్లా స్థాయి అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు సందడిగా ప్రారంభమయ్యాయి. శుక్రవారం జేఎన్ఎస్‌లోని సింథటిక్ ట్రాక్‌పై సబ్ జూనియర్స్ బాలబాలికల విభాగంలో ఏర్పాటు చేసిన అథ్లెటిక్స్ పోటీలను ఏఆర్ పీటీసీ ఆర్ఐ ఉదయ్‌భాస్కర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడల్లో స్నేహపూర్వక సంబంధాలు పెంపొందుతాయన్నారు. జిల్లా స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయిలో పతకాలు సాధించాలని ఆశా భావం వ్యక్తం చేశారు. అథ్లెటిక్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి సారంగపాణి మాట్లాడుతూ.. జిల్లాస్థాయిలో సబ్ జూనియర్స్ బాలబాలికల 60మీటర్ల పరుగు పందెం, లాంగ్ జంప్, కిడ్ జవెలిన్ త్రో, స్టాండింగ్ జంప్, విభాగాల్లో నిర్వహించిన ఎంపిక పోటీల్లో జిల్లాలోని మండలాల నుంచి 400మంది అథ్లెట్లు పాల్గొన్నారు. ఇక్కడ జిల్లా స్థాయిలో ప్రతిభ కనబర్చిన అథ్లెట్లు జూలై 6న హనుమకొండ జేఎన్ఎస్‌లో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి సబ్ జూనియర్స్ బాలబాలికల అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొంటారని సారంగపాణి తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఎస్ఏ అథ్లెటిక్స్ కోచ్ శ్రీమన్నారాయణ, పీఈటీ వాసు, అసోసియేషన్ సభ్యులు కృష్ణమూర్తి, మహేందర్, సీనియర్ అథ్లెట్ హరీష్ తదితరులు పాల్గొన్నారు.

మోసం చేసిన ముగ్గురు
వ్యక్తులపై కేసు

నర్సంపేట టౌన్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : ములుగు జిల్లా కేంద్రంలోని భూములను విక్రయించిన వ్యక్తులకు డబ్బులు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేసిన మధ్యవర్తులైన ముగ్గురు వ్యక్తులపై పలు సెక్షన్ల కింద నర్సంపేట పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైన సంఘటన శుక్రవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితురాలి ఫిర్యాదు, పోలీసుల కథనం ప్రకారం వివరాలిలా వున్నాయి. ములుగు జిల్లా కేంద్రానికి చెందిన పోరిక భార్గవి అనే భూ యజమాని వద్ద ఒక ఎకరం 4 గుంటల భూమిని కొనుగోలు చేస్తామని ములుగుకు చెందిన కోట సుధీర్, మారబోయిన సంపత్, జంగాలపల్లికి చెందిన అబ్బు నరేందర్‌లు ఒక కోటి రూపాయలకు విక్రయ ఒప్పందం చేసుకుంటూ రూ.61 లక్షలు ఇచ్చారు. మిగతా డబ్బులు ఇవ్వకుండా కాలయాపన చేస్తూ గత ఏప్రిల్ 3న కాల్వ దుష్యంత్‌రెడ్డి పేరుపై పై ముగ్గురు వ్యక్తులు భార్గవిచేత రిజిస్ట్రేషన్ చేయించారు. రిజిస్ట్రేషన్ పూర్తయినప్పటికీ డబ్బులు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేశారు. చివరికి ఈ నెల 19న డబ్బులు ఇప్పిస్తామని చెప్పడంతో భూ యజమాని భార్గవి.. తన భర్త, తండ్రితో కలిసి కారులో నర్సంపేటకు వచ్చారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న వ్యక్తి నుంచి రూ.41లక్షల50వేలు తీసుకొని కారులో వెళ్తుండగా, నర్సంపేట బస్టాండ్ మూలమలుపు వద్ద కారును అటకాయించిన కోట సుధీర్, మారబోయిన సంపత్, అబ్బు నరేందర్‌లు డబ్బులు లాక్కొన్నారు. కులం పేరుతో దూషించారు. డబ్బుల గురించి అడిగితే చంపేస్తామని బెదిరిస్తూ వెళ్లారు. దీంతో భార్గవి అదే రోజు మనస్థాపానికి గురైన నిద్రమాత్రలు మింగి అస్వస్తతకు గురై ఆస్పత్రిలో చేరింది. ఈ విషయంపై ఈ నెల 23న నర్సంపేట పోలీసులకు భార్గవి ఫిర్యాదు చేసింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కోట సుధీర్, మారబోయిన సంపత్, అబ్బు నరేందర్‌లపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశామని టౌన్ సీఐ రఘుపతిరెడ్డి తెలిపారు.

సివిల్స్ కోచింగ్‌ను సద్వినియోగం చేసుకోవాలి

వరంగల్ ఎంపీ కడియం కావ్య


క్యాంపు కార్యాలయంలో కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎంపీ కడియం కావ్య

వడ్డెపల్లి, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ పేద నిరుద్యోగులు ఉచిత సివిల్ సర్వీస్ కోచింగ్‌ను సద్వినియోగం చేసుకోవాలని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య సూచించారు. శుక్రవారం వడ్డెపల్లి రోడ్డులోని ఎంపీ క్యాంపు కార్యాలయంలో షెడ్యూల్డ్ కులాల అధ్యయన కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించే ఉచిత కోచింగ్ కరపత్రాలను వరంగల్ ఉమ్మడి జిల్లా షెడ్యూల్డ్ కులాల అధ్యయన కేంద్రం సంచాలకులు కొంగర జగన్మోహన్‌తో కలిసి కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ఉచిత కోచింగ్‌ను అర్హులైన అభ్యర్థులు జూలై 7లోగా అధ్యయన కేంద్రంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో అధ్యయన కేంద్రం ప్రతినిధులు సందీప్, సుమన్, స్రవంతి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన ఎన్పీడీసీఎల్ డైరెక్టర్లు


సీఎండీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న డైరెక్టర్లు

రాంనగర్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): ఎన్పీడీసీఎల్ డైరెక్టర్లుగా ఇటీవలే నూతనంగా నియామకమైన వారు శుక్రవారం హనుమకొండ కార్పొరేట్ కార్యాలయంలోని వారి వారి చాంబర్లలో బాధ్యతలు స్వీకరించారు. ఫైనాన్స్ డైరెక్టర్‌గా వి.తిరుపతిరెడ్డి, ఆపరేషన్స్ డైరెక్టర్‌గా టి.మధుసూదన్, ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా వి.మోహన్‌రావు, హెచ్‌ఆర్‌డీ డైరెక్టర్‌గా సి.ప్రభాకర్ విధుల్లో చేరారు. ఈ సందర్భంగా డైరెక్టర్స్ మాట్లాడుతూ.. సీఎండీ వరుణ్‌రెడ్డి సారథ్యంలో కంపెనీ పురోగతికి పాటుపడుతూ వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందించడానికి శక్తి వంచనలేకుండా కృషిచేస్తామన్నారు. అనంతరం సీఎండీని మర్యాదపూర్వకంగా కలసి పుష్పగుచ్చాలు అందజేయగా సీఎండీ డైరెక్టర్లకు శుభాకాంక్షలు తెలియజేశారు.

ఆస్పత్రులు, వైద్య కళాశాలల్లో వసతులు

- రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక అందిస్తాం..
- రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ సర్వే సంగీత
- నగరంలోని ప్రభుత్వ ఆస్పత్రులు, కేఎంసీలో రాష్ట్ర బృందం తనిఖీలు


కేఎంసీ సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర హెల్త్ కమిషనర్ సర్వే సంగీత

వరంగల్ మెడికల్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆస్పత్రులతో పాటు వైద్య విద్య కళాశాలలకు ఎన్ఎంసీ నిబంధనల మేరకు సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వానికి నివేదిక సమర్పించనున్నట్లు రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్, కేఎంసీ, నర్సంపేట, జనగామ వైద్య కళాశాలల పర్యవేక్షణ కమిటీ చైర్‌పర్సన్ సర్వే సంగీత అన్నారు. వరంగల్ కాకతీయ మెడికల్ కళాశాలలో శుక్రవారం హనుమకొండ, వరంగల్ జిల్లాల కలెక్టర్లు స్నేహ శబరీష్, సత్య శారదలతో కేఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ రామ్‌కుమార్‌రెడ్డి, కోఆర్డినేటర్ డాక్టర్ మోహన్‌దాస్ వివిధ విభాగాల అధిపతులు, హనుమకొండ, వరంగల్ జిల్లాలోని అనుబంధ ప్రభుత్వ ఆస్పత్రుల సూపరింటెండెంట్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ముందుగా కేఎంసీలోని బోధన, బోధనేతర, ల్యాబ్, సిబ్బంది, కావాల్సిన వసతులపై సమీక్షించారు. కేఎంసీలోని హెమటాలజీ విభాగాన్ని, వైద్య విద్యార్థినుల వసతి గృహాన్ని క్షేత్రస్థాయిలో సందర్శించి వాటి వివరాలను ప్రిన్సిపాల్ రామ్‌కుమార్‌రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం కేఎంసీలో ఉన్న ప్రధానమంత్రి స్వాస్థ్య సురక్ష యోజన ఆస్పత్రిలోని పలు విభాగాలను సందర్శించారు.

ఎంజీఎం, సీకేఎం ఆస్పత్రుల సందర్శన

వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిని సందర్శించి ఓపీ విభాగంలో ప్రతీరోజు ఎంత మంది వస్తుంటారని, ఓపీ నమోదు కోసం ఎన్ని కౌంటర్లు ఏర్పాటు చేశారని కమిషనర్ అడిగి తెలుసుకున్నారు. ఎంజీఎం ఆస్పత్రిలోని ఈ ఔషధి కేంద్రాన్ని పరిశీలించి, ఎంజీఎం ఆస్పత్రిలో ఓపీ విభాగంలో అదనంగా కౌంటర్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. నియోనాటల్ వార్డులను, వంట గదిని సందర్శించి అక్కడున్న సౌకర్యాలు, కావాల్సిన పరికరాలు, డాక్టర్లు, నర్సుల వివరాలను వైద్యాధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సీకేఎం ఆస్పత్రిలోని ఓపీ విభాగం, ఆరోగ్యశ్రీ, లేబర్ రూమ్, నియోనాటల్ వార్డులను రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ సర్వే సంగీత సందర్శించి ఆయా వార్డుల వివరాలు, ఓపీ సేవలు, రిఫరల్స్ ఫాలో అప్, ప్రసూతి సేవలను గురించి వైద్యులు, సిబ్బంది తదితర వివరాలను వైద్యాధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ, వరంగల్ డీఎంహెచ్ఓలు డాక్టర్ అప్పయ్య, డాక్టర్ సాంబశివరావు, టీజీఎంఐడీసీ ఈఈ ప్రసాద్, కేఎంసీ ఏడీ రమేశ్, ప్రసాద్, ఎంజీఎం సూపరింటెండెంట్ డాక్టర్ కిశోర్, డాక్టర్ కిశోర్ కుమార్, ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రి, సీకేఎం సూపరింటెండెంట్‌లు డాక్టర్ రాజేశ్వరి, డాక్టర్ షర్మిల, వైద్యులు డాక్టర్ సునీత, డాక్టర్ భరత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రి సందర్శన

హనుమకొండలోని ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రిని సందర్శించి ఓపీ విభాగం, ఆరోగ్యశ్రీ,లేబర్ రూమ్ వార్డులను సందర్శించి ఆయా వార్డుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కాకతీయ యూనివర్సిటీ జంక్షన్ సమీపంలోని ప్రభుత్వ ఛాతి, క్షయ వ్యాధుల ఆస్పత్రిని కమిషనర్ సందర్శించి అక్కడికి వస్తున్న పేషెంట్లు, అందుతున్న ఓపీ సేవలను, మెడికల్ వ్యర్థాలను ఎక్కడికి తరలిస్తున్నారు? ఎలా తరలిస్తున్నారనే వివరాలను సంబంధిత వైద్యాధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సమీక్షా సమావేశంలో వివిధ విభాగాల్లో వనరుల కొరత, యూజీ మెడికల్ ఎడ్యుకేషన్ ఎన్ఎంసీ నిబంధనల ప్రకారం ఉండాల్సిన, సమకూర్చాల్సిన సౌకర్యాల గురించి కూలంకశంగా చర్చించారు. కాకతీయ మెడికల్ కళాశాలతోపాటు ప్రభుత్వ ఆస్పత్రులలో వసతులు, సౌకర్యాల గురించి ప్రభుత్వానికి నివేదిక అందజేయనున్నట్లు సంగీత తెలిపారు.

జాతీయ సదస్సులో లక్నేపల్లి ఉపాధ్యాయుడి ప్రాజెక్టు ప్రదర్శన

రాష్ట్రం నుంచి ఆంగ్ల భాష విభాగంలో ఎంపిక


సదస్సులో ప్రాజెక్టును వివరిస్తున్న ఉపాధ్యాయుడు సత్యం

నర్సంపేట టౌన్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): జాతీయ విద్యా పరిశోధన శిక్షణా మండలి (ఎన్‌సీఈఆర్‌టీ) ఉపాధ్యాయ విద్యా విభాగం ఆధ్వర్యంలో న్యూ ఢిల్లీలో ఈ నెల 26, 27 తేదీలలో వినూత్న పద్ధతులు, ప్రయోగాలు, ప్రాజెక్టుల ప్రదర్శనలో వరంగల్ జిల్లా నర్సంపేట మండలం లక్నేపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని ఆంగ్ల ఉపాధ్యాయుడు సత్యం తాను రూపొందించిన ప్రాజెక్టును ప్రదర్శించాడు. సత్యం ప్రాజెక్టు ఆధారిత బోధనా పద్ధతి, ఉన్నత పాఠశాల విభాగంలో 'అకడమిక్ అచీవ్‌మెంట్ అండ్ ప్రొఫిషియన్సీ ఇన్ ఇంగ్లిష్ లాంగ్వేజ్ అండ్ డిస్‌కోర్సెస్' అనే అంశంపై రూపొందించిన ప్రాజెక్టు గత ఏడాది రాష్ట్రంలోనే మొట్టమొదటి సారిగా ఆంగ్ల భాషలో ఎంపికైంది. విద్యార్థుల్లో ఆంగ్ల భాషా నైపుణ్యాలను, డిస్‌కోర్సెస్ పెంపొందించుటకు పాఠశాల ప్రధానోపాధ్యాయుడి పర్యవేక్షణలో గత ఏడాది అక్టోబర్ నుంచి 2025 మార్చి వరకు బోధన చేశారు. న్యూఢిల్లీలో ఎన్‌సీఈఆర్‌టీ ఆధ్వర్యంలో ఈ నెల 26, 27 తేదీలలో నిర్వహించిన సదస్సులో పాల్గొన్న డాక్టర్ సత్యం.. తన ప్రాజెక్టు ద్వారా విద్యార్థులకు బోధించిన తీరు తెన్నులను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సదస్సుల్లో దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి 25 మంది ఉపాధ్యాయుల ప్రాజెక్టులు ప్రదర్శనకు వచ్చాయి. ఇదిలావుండగా, సత్యం 2019-2020 విద్యా సంవత్సరంలో రూపొందించిన ప్రాజెక్టుకు ప్రత్యామ్నాయ బోధనా పద్ధతుల పరిశోధకుడు అనే అవార్డును జాతీయ విద్యా పరిశోధన శిక్షణా మండలి, విద్యా విభాగం నుంచి తీసుకున్నారు. కాగా, సత్యంను లక్నేపల్లి పాఠశాల హెచ్ఎం మాధురి, ఉపాధ్యాయులు అభినందించారు.

హేమాచలుడిని దర్శించుకున్న ఎంపీ


ఆలయంలో ఎంపీ బలరాంనాయక్‌కు ఆశీర్వచనం చేస్తున్న అర్చకులు

మంగపేట, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్లూరు హేమాచల కొండలపై వెలిసిన లక్ష్మీనర్సింహ స్వామిని శుక్రవారం మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాంనాయక్ కాంగ్రెస్ నాయకులతో కలిసి దర్శించుకున్నారు. ముందుగా ఆలయ సంప్రదాయం ప్రకారం ప్రధానార్చకుడు ముక్కమల్ల రాజశేఖరశర్మ, కారంపూడి పవన్‌కుమారచార్యులు పూర్ణకుంభంతో ఎంపీకి స్వాగతం పలికారు. వేదాశీర్వాచనాలతో కొండపై కొలువై ఉన్న స్వయంభు పుట్టుస్వామి వద్దకు వాయిద్యాలతో అర్చకులు తోడ్కొని వెళ్లి ఆదిలక్ష్మి, చెంచులక్ష్మి దేవతలను దర్శనాలు చేయించారు. స్వామి వారిని దర్శనం గావించి తీర్థప్రసాదాలను అందజేసి ఆలయ విశిష్టతను వివరించారు. తదనంతరం స్వామి వారి శేషవస్త్రాలు, గజమాలతో సత్కరించి ఆశీర్వచనం గావించారు. ఈ సందర్భంగా ఎంపీ బలరాంనాయక్ మాట్లాడుతూ మహిమాన్విత క్షేత్రం హేమాచలమని, స్వామి వారిని దర్శించుకుంటే సకల పాపాలు తొలుగుతాయని తెలిపారు. ఆలయం అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తుందని, ఇప్పటికే మంత్రి సీతక్క చాలా అభివృద్ధి పనులు చేయించిందన్నారు. ఎంపీ వెంట మల్లూరు గుట్ట మాజీ చైర్మన్లు యర్రంకారి సురేష్, పూజారి సమ్మయ్య, కాంగ్రెస్ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు గుమ్మడి సోమయ్య, జిల్లా నాయకులు పెద్ది నర్సింహరావు, తూడి భగువాన్‌రెడ్డి, అయ్యోరి యానయ్య, గొల్లపల్లి రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

'ధూపదీప నైవేద్యం' కల్పించండి..

- ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి 270 దరఖాస్తులు
- క్షేత్ర స్థాయిలో పరిశీలన ప్రారంభం

కొడకండ్ల జూన్ 27 (ఆంధ్రజ్యోతి): ధూపదీప నైవేద్యం పథకం కింద ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి భారీగా దరఖాస్తులు వచ్చాయి. మే 2న తెలంగాణ దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో వెలువడిన నోటిఫికేషన్‌కు మంచిస్పందన వచ్చింది. వరంగల్ జిల్లా నుంచి 55, హన్మకొండ నుంచి 56, భూపాలపల్లి నుంచి 69, ములుగు నుంచి 28, మహబూబాబాద్ నుంచి 74, ఉమ్మడి జిల్లాలోనే ఉన్నా యాదాద్రి జోన్‌కు మార్చిన జనగామ జిల్లా నుంచి మరో 43 కలిపి మొత్తం 325 దరఖాస్తులు వచ్చాయి. రాష్ట్రం మొత్తానికి ఈ నోటిఫికేషన్ ద్వారా సుమారు 270 దేవాలయాలను పథకం కింద ఎంపిక చేయనున్నారు. 33 జిల్లాల్లో ఒక్కో జిల్లాకు 8 నుంచి 9 మాత్రమే ఎంపిక చేసే అవకాశం ఉంది.

ఎంపికైతే గౌరవ వేతనం..

ఎలాంటి ఆదాయం లేని గ్రామీణ ప్రాంతాల్లోని దేవాలయాల్లో ప్రతీరోజు ధూపదీప నైవేద్యాలు అందాలని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా డాక్టర్ రాజశేఖర్‌రెడ్డి ఉన్న సమయంలో 2007లో ధూపదీప నైవేద్య పథకాన్ని ప్రారంభించారు. రూ.1,500 అర్చకుడికి, రూ.వేయి పూజాద్రవ్యాలకు కలిపి రూ.2,500 గౌరవ వేతనం ఇచ్చేవారు. తర్వాత కేసీఆర్ తెలంగాణ ముఖ్యమంత్రిగా ఉన్నపుడు గౌరవ వేతనాన్ని రూ.6వేలకు, తర్వాత రూ.10వేల పెంచారు. నోటిషికేషన్ ద్వారా పురాతన ఆలయాలను ఎంపిక చేసి ధూపదీప నైవేద్య పథకాన్ని అమలు చేస్తున్నారు.


గ్రామీణ దేవాలయం

ఆలయాల ఎంపిక నిబంధనలు

జిల్లాల వారీగా దేవాదాయ శాఖ నియమించిన కమిటీ సభ్యులు సహాయ కమిషనర్ ఆధ్వర్యంలో క్షేత్రస్థాయిలో దేవాలయాల పరిశీలన ప్రక్రియ ప్రారంభమైంది. కనీసం 15ఏళ్ల కన్నా పురాతన ఆలయాలు, ఆలయ చరిత్ర, ఆదాయాలు, ఆలయ భూములను పరిగణనలోకి తీసుకుని ఎంపిక చేయనున్నారు. త్రిసభ్య కమిటీ సభ్యులు పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదిక ఇవ్వనున్నారు. కమిషనర్ స్థాయిలో తుది నిర్ణయం తీసుకుంటారు.

ప్రలోభాలకు గురికావద్దు



దేవాదాయ, ధర్మాదాయ శాఖ నిర్ణయించిన నిబంధనల ప్రకారమే గ్రామీణ ప్రాంతాల్లోని ఆలయాలను ధూపదీప నైవేద్య పథకానికి ఎంపిక జరుగుతుంది. క్షేత్రస్థాయిలో కమిటీ సభ్యులతో కలిసి దరఖాస్తు పెట్టుకున్న ప్రతీ ఆలయాన్ని పరిశీలించి నివేదికలు తయారుచేస్తాం. ఎవరి మాటలు నమ్మి మోసపోవద్దని సూచించారు. అర్హత ఉన్న ఆలయాలనే ఎంపిక చేస్తాం.

\- రామాల సునీత,
వరంగల్ సహాయ కమిషనర్, దేవాదాయశాఖ

దివ్యాంగులకు అండగా ప్రభుత్వం

ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు


మహదేవపూర్‌లో దివ్యాంగుడికి ట్రైసైకిల్ అందజేస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు

మహదేవపూర్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం దివ్యాంగులకు ఎల్లప్పుడు అండగా ఉంటుందని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. శుక్రవారం మహదేవపూర్‌లోని ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అలింకో సంస్థ ద్వారా అందిస్తున్న ట్రైసైకిళ్లు, ఇతర ఉపకరణాల పంపిణీ కార్యక్రమంలో మంత్రి పాల్గొని మాట్లాడారు. మండల వ్యాప్తంగా మొత్తం 200పై చిలుకు దివ్యాంగులను గుర్తించామని.. మొదటి విడతలో 50 మందికి సాయం చేశామన్నారు. ఇల్లు లేని దివ్యాంగులకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామని, త్వరలోనే నూతన పెన్షన్లు మంజూరు చేస్తామని తెలిపారు. మండలానికి చెందిన 89మందికి రూ.90లక్షల విలువ చేసే కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. దీనికి ముందు ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో రూ.20లక్షలతో నిర్మించిన చిల్డ్రన్స్ పార్కును రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ చైర్మన్ అయిత ప్రకాష్‌రెడ్డి, కుడా చైర్మన్ వెంకట్రామిరెడ్డితో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, ఇన్‌చార్జి డీడబ్ల్యూ మల్లీశ్వరి, సీడీపీవో రాధిక, స్థానిక నాయకులు కట్కం అశోక్, ఎరవెల్లి విలాస్‌రావు, కోట రాజబాపు తదితరులున్నారు.

డేంజర్ జోన్ నిర్వాసితుల సమస్యలు పరిష్కరిస్తాం

మల్హర్ : జెన్‌కో భూ ఉపరితల బొగ్గు గనుల తవ్వకాల్లో భాగంగా పెద్ద తాడిచర్ల డేంజర్ జోన్‌లోని నిర్వాసితుల సమస్యలను త్వరలోనే పరిష్కరించనున్నట్లు ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. శుక్రవారం మండలంలోని తాడిచర్ల నుంచి కిషన్‌రావుపల్లి మీదుగా భూపాలపల్లి సంబంధించిన రోడ్డుకు భూమి పూజ కార్యక్రమాన్ని కిషన్‌రావుపల్లిలో నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇటీవల జిల్లా పర్యటనకు వచ్చిన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క దృష్టికి భూసేకరణ సమస్యను తీసుకొని వెళ్లగా త్వరలో పరిష్కరించే విధంగా చర్యలు చేపడుతామన్నారన్నారు. అలాగే రూ.16లక్షలతో తాడిచర్లలో నిర్మాణం చేపట్టిన చిల్డ్రన్స్ పార్కును ప్రారంభించారు. తాడిచర్లలో నిర్వహించిన సంస్థాగత నిర్మాణ సన్నాహక సమావేశంలో పాల్గొని నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో కలెక్టర్ రాహుల్ శర్మ, రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ ఐత ప్రకాష్‌రెడ్డి, సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, పీఏసీఎస్ చైర్మన్ ఇప్ప మొండయ్య, పార్టీ మండల అధ్యక్షుడు బడితల రాజయ్య, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు దండు రమేష్, మాజీ ఎంపీపీ చింతలపల్లి మల్హల్‌రావు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఐత రాజిరెడ్డి, క్రాంతికుమార్, జంగిడి శ్రీనివాస్, కొండ రాజమ్మ, మండల రాహుల్, అశోక్‌రావు తదితరులు పాల్గొన్నారు.

మారని తీరు.. వసూళ్ల జోరు...

(5వ పేజీ తరువాయి)

చేసుకునే పరిస్థితి లేదు. ఒకవేళ తయారు చేసుకున్నప్పటికీ రిజిస్ట్రేషన్‌కు వెళ్లే సరికి సబ్‌రిజిస్ట్రార్లు అనేక కొర్రీలతో తిరస్కరిస్తున్నారనే ప్రచా రం ఉంది. దీంతో తప్పని పరిస్థితుల్లో భూముల రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ల కోసం క్రయవిక్రయదారులు డాక్యుమెంట్ రైటర్లను సంప్రదించాల్సి వస్తోంది.

ఇదే అదనుగా డాక్యుమెంట్ రైటర్లు బేరసారాలకు దిగుతున్నారు. ఎక్కువ మొత్తంలో రిజిస్ట్రేషన్లు జరిగే హనుమకొండ, వరంగల్ జిల్లాల్లో ఉన్న కొన్ని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో కొందరు డాక్యుమెంట్ రైటర్లు దళారులుగా అవతారమెత్తి వసూళ్లకు దిగుతున్నారనే ప్రచారం జరుగుతోంది.

అయినా.. లంచం తప్పట్లే..

స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖను ప్రక్షాళన చేసేందుకు ప్రభుత్వం ఎన్ని సంస్కరణలు తీసుక వచ్చినప్పటికీ లంచాల బెడద తప్పటం లేదనే ప్రచారం ఉంది. అన్ని పత్రాలు సక్రమంగా ఉండి.. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసినప్పటికీ ప్రతీ డాక్యుమెంట్‌కు రూ.2వేల నుంచి రూ.10వేల వరకు ఇచ్చుకోవల్సిందేనని బాధితులు వాపోతున్నారు. వరంగల్ నగరానికి చెందిన ఓ రిటై ర్డు ఉద్యోగి హనుమకొండలో ఓ ప్లాట్ కొనుగో లు చేశారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేస్తే లింకు డాక్యుమెంట్లు సక్రమంగా లేవని తిరస్కరించారని, డాక్యుమెంట్ రైటర్‌ను సంప్రదిస్తే గంటలోనే పని అయిందని తెలిపారు. ఇక నాలా కన్వర్షన్ లేకున్నా వరంగల్ మహానగరంతో పాటు భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్, తొర్రూరు, జనగామ తదితర పట్టణాల్లో దర్జాగా రిజిస్ట్రేషన్ల ప్రక్రియ నిర్వహిస్తున్నారు. చాలాచోట్ల నాన్‌లేవుట్ ప్లాట్లు కొనుగోలు చేసినవారు, ఫామ్‌ల్యాండ్ పేరిట భూములు కొనుగోలు చేసినవారికి చాలావరకు నాలా కన్వర్షన్ లేదు. దీంతో ఇంటి నిర్మాణానికి తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ అవసరం కావటంతో రిజిస్ట్రేషన్ కార్యాలయాల చుట్టూ తిరిగుతున్నారు. ఇదే అదనుగా వీటి కోసం ప్రతీ డాక్యుమెంట్‌కు రూ.20వేల నుంచి రూ.50వేల వరకు ఏరియాను, భూమికి మార్కెట్ విలువను బట్టి దళారులు వసూళ్లు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.


లింకు పేపర్లు లేకపోతే డా క్యుమెంట్‌కు అదనంగారూ.5వేల నుంచి రూ.20 వేల వరకు, వివాదాస్పద భూములు, కోర్టు కేసుల్లో ఉన్న భూములు, అసైన్డ్, ప్రభుత్వం భూములైతే ఏరియాను బట్టి రూ.20వేల నుంచి రూ.2లక్షల వరకు డిమాండ్ చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. వెంచర్ల ప్లాట్ రిజిస్ట్రేషన్‌కు వస్తే గజానికి రూ.200 వరకు వసూలు చేస్తున్నారని సమాచారం.

అంతా పెద్ద సారు కనుసన్నుల్లోనే..

స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖలో ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఓ అధికారి చక్రం తిప్పుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. గత ఏడాది తన సొంత జిల్లాకు చెందిన ఓ మంత్రి పైరవీ ద్వారా ఉమ్మడి జిల్లాలో పోస్టింగ్ పొందిన ఉన్నతస్థాయి అధికారి కనుసన్నుల్లోనే దందా సాగుతోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. చాలామంది సబ్‌రిజిస్ట్రార్‌లు కూడా తన జిల్లాకు చెందినవారే కావటంతో టార్గెట్‌లు గట్టిగా పెట్టి వాయిస్తున్నారనే చర్చ జరుగుతోంది. ఒక్కో సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి వచ్చే అదాయాన్ని బట్టి ప్రతీనెల రూ.50వేల నుంచి రూ.2లక్షల వరకు టార్గెట్ విధిస్తున్నారనే ప్రచారం ఉంది. సదరు ఉన్నతాధికారితో పాటు ఇక్కడే చాలాఏళ్లుగా తిష్టవేసిన మరో పైఅధికారి కూడా వాటాల కోసం ఒత్తిడి తెస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో కొంతమంది సబ్‌రిజిస్ట్రార్‌లు తప్పని పరిస్థితుల్లో అడ్డదారులు తొక్కి అడ్డంగా బుక్ అవుతున్నారనే చర్చ జరుగుతోంది. సబ్‌రిజిస్ట్రార్‌లపై ఫిర్యాదులు చేసినా బుట్టదాఖలు చేస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. పొరుగు జిల్లాకు చెందిన ఓ మంత్రితో ఉన్న సంబంధాలతో పాటు పైఅధికారుల అభయహస్తం ఉండటంతో వసూళ్ల దందాకు అడ్డూఅదుపు లేకుండా పోతోందనే ప్రచారం ఉంది.

రజక భవనంపై వివాదం

- రూ.6కోట్ల ప్రభుత్వ నిధులతో నిర్మాణం
- కొత్త ట్రస్ట్‌కు భవనం బదిలీపై ఫిర్యాదు
- భవనంపై గుత్తాధిపత్యానికి కుట్ర అని విమర్శలు
- ప్రభుత్వానికి వెల్లువెత్తిన ఫిర్యాదులు
- భవనం అప్పగింతను వెనక్కి తీసుకున్న ప్రభుత్వం


న్యూశాయంపేటలోని రజక భవనం


పేరు మారిన భవనం

హనుమకొండ, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ న్యూశాయంపేట క్రాస్ రోడ్డు వద్ద నిర్మించిన మడివేలు మాచదేవ కల్చరల్ ఎడ్యుకేషన్ అండ్ సోషల్ కాంప్లెక్సు (రజక భవనం)పై పెద్ద ఎత్తున వివాదం చెలరేగుతోంది. ఇటీవల కొత్తగా ఏర్పాటైన మడివేలు మాచదేవ కల్చరల్ ఎడ్యుకేషనల్ అండ్ సోషియో ఎకనమిక్ డెవలప్‌మెంట్ ట్రస్ట్‌పేర ఈ భవనం బదిలీ కావడం విమర్శలకు దారితీసింది. దీనిపై ఫిర్యాదులు వెల్లువెత్తడంతో ప్రభుత్వం స్వయంగా విచారణకు ఆదేశించింది. చివరకు ఈ భవనాన్ని కొత్తట్రస్ట్ నుంచి వెనక్కి తీసుకొని నిర్వహణ బాధ్యతను బీసీ సంక్షేమ శాఖకు అప్పగించడంతో వివాదం కొత్తమలుపు తిరిగింది.

పై చదువులు, పోటీ పరీక్షలకు కోసం ఇతర ప్రాంతాల నుంచి వచ్చే రజక కుటుంబాల పిల్లలకు వసతి సౌకర్యం కల్పించేందుకు, వివాహాలు, ఇతర శుభకార్యాలు, రజకుల సభలు, సమావేశాల నిర్వహణకుగాను అన్ని హంగులతో విశాలమైన భవన నిర్మాణానికిగాను రాష్ట్రంలో రెండు చోట్ల రజక కమ్యూనిటీ భవనాలను నిర్మించాలని గత బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో ఒకటి ఉమ్మడి వరంగల్ జిల్లాకు కేటాయించింది. ఇందులో భాగంగా న్యూశాయంపేట క్రాస్ రోడ్డులో పదేళ్ల కిందట 20 గుంటల స్థలాన్ని కేటాయించింది. ఇందులో రూ.6కోట్ల వ్యయంతో భవనాన్ని నిర్మించారు. దీనికి మడివేలు మాచదేవ కల్చరల్ ఎడ్యుకేషన్ అండ్ సోషియల్ కాంప్లెక్స్ అని పేరు పెట్టారు. భవనం గ్రౌండ్ ఫ్లోర్, మొదటి అంతస్తు స్లాబ్ వరకు నిర్మాణం జరిగింది. భవనం పూర్తికావడానికి మరో రూ.1.50 కోట్లు అవసరమవుతాయి.

ఫిర్యాదుల వెల్లువ

గతంలో ఈ భవన నిర్మాణంలో పాలుపంచుకున్నవారు ఈ మార్పును జీర్ణించుకోలేకపోయారు. తమకు తెలియకుండా ఒకే కుటుంబానికి చెందిన వారితో ఏకపక్షంగా ట్రస్ట్ ఏర్పాటు కావడాన్ని వ్యతిరేకిస్తూ రజక సంఘ సీనియర్ నేత, మాజీ ఎంపీడీవో అప్పా దోమీ సమాజ్ భారత్, మనక రజక సంఘం కోఆర్డినేటర్ కొల్లూరు మల్లేశ్ కుమార్ బీసీ సంక్షేమ శాఖ సెక్రెటరీకి ఫిర్యాదు చేశారు. రజకులందరికీ ఉపయోగపడాల్సిన, కోట్లాది రూపాయల విలువైన ఈ భవనంపై శాశ్వతంగా గుత్తాధిపత్యం చెలాయించడానికి ఏకపక్షంగా కొత్త ట్రస్ట్ ఏర్పాటైందని, భవన నిర్మాణం జరిగిన చాలా ఏళ్లవరకు అందులో ఎలాంటి కార్యక్రమాలు నిర్వహించడానికి ముందుకురానివారు ఇప్పుడు తాజాగా కొత్త ట్రస్టు పేరుతో తెరపైకి రావడం వెనుక కుట్రదాగి ఉందని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై విచారణ జరిపి భవనం అన్యాక్రాంతం కాకుండా చూడాలని అభ్యర్థించారు. తెలంగాణ రజక నవ నిర్మాణ సంఘం అధ్యక్షుడు చీకటి రాజు సైతం హనుమకొండ కలెక్టర్‌కు, బీసీ సంక్షేమ శాఖ సెక్రెటరీకి వినతిపత్రాలు సమర్పించారు.

ఈ భవనం ద్వారా వచ్చే ఆర్థిక లాభాలను ఈ 13మందే అనుభవించే దుర్బుద్ధితో అధికారులపై రాజకీయ ఒత్తిడితెచ్చి హస్తగతం చేసుకున్నారని ఆరోపించారు. ఈ ట్రస్టును రద్దు చేసి ఉమ్మడి జిల్లాలోని అన్ని మండలాల నుంచి ఆరుగురు సభ్యుల చొప్పున రజక కులపెద్దలతో విస్తృత కమిటీని వేసి నిర్వహణ బాధ్యతను దానికి అప్పగించాలని అభ్యర్థించారు. మల్లేశ్ కుమార్ ఫిర్యాదుకు స్పందించిన బీసీ సంక్షేమ శాఖ సెక్రెటరీ విచారణకు ఆదేశించారు. తెలంగాణ వాషర్‌మెన్ కోఆపరేటివ్ సొసైటీస్ ఫెడరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ ఎం.చంద్రశేఖర్‌ను విచారణ అధికారిగా నియమించారు. ఆయన ఈనెల 12వ తేదీన విచారణ నిర్వహించి ప్రభుత్వానికి నివేదిక సమర్పించారు. దీంతో ప్రభుత్వం ట్రస్ట్‌పేరు మీద ఉన్న భవనాన్ని వెనక్కితీసుకొని వివాదం పరిష్కారం అయ్యే వరకు భవన సంరక్షణ బాధ్యతను బీసీ శాఖకు అప్పగించింది.

కొత్త ట్రస్ట్ ఆవిర్భావం

కొద్ది రోజుల కిందట మాజీ మంత్రి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య చైర్మన్‌గా 13మంది సభ్యులతో మడివేలు మాచదేవ కల్చరల్ ఎడ్యుకేషనల్ అండ్ సోషియో ఎకనమిక్స్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ పేర కొత్త కమిటీ ఏర్పాటైంది. ఇందులో సభ్యులుగా సారయ్య కుటుంబసభ్యులే ఎక్కువగా ఉండడం విమర్శలకు తావిచ్చింది. సారయ్య తమ్ముడు బస్వరాజు కుమారస్వామి, చిన్నాన్న రామచంద్రం, ఆయన బంధువు మచ్చ లక్ష్మీనారాయణతో పాటు వాళ్లకు సన్నిహితులైన డాక్టర్ సాట్ల మధుచందర్, డాక్టర్ సాట్ల వెంకట్, డాక్టర్ గోపాల్, చిట్యాల బిక్షపతి, ఎదులాపురం కుమారస్వామి, మునికుంట్ల రాములు, మామిడాల నర్సయ్య, పోరండ్ల శ్రీకాంత్ సభ్యులుగా ఉన్నారు. ఈ ట్రస్ట్ రిజిస్ట్రేషన్ సమయంలో సాక్షిగా సంతకం పెట్టింది కూడా సారయ్య కారు డ్రైవర్ కావడం గమనార్హం. ఏకపక్షంగా ఏర్పాటైన ఈ ట్రస్ట్ పట్ల పెద్ద ఎత్తున విమర్శలు వెల్లువెత్తాయి. ట్రస్ట్ ఏర్పాటైన తర్వాత భవనం ఈ ట్రస్ట్‌పేర బదిలీ అయింది. గతంలో ఉన్న మడివేలు మాచదేవ కల్చరల్ ఎడ్యుకేషన్ అండ్ సోషియల్ కాంప్లెక్స్ పేరు కూడా మారింది. ఆ స్థానంలో మడివేలు మాచదేవ కల్చరల్ ఎడ్యుకేషన్ అండ్ సోషియో ఎకనమిక్స్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ పేరుతో ఫ్లెక్సీ ఏర్పాటైంది.

వేధింపులకు గురైతే డయల్ 100కు ఫోన్ చేయాలి

వరంగల్ క్రైం, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): మహిళలు వేధింపులకు గురైనట్లయితే వెంటనే డయల్ 100కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని షీటీం ఇన్స్పెక్టర్ సుజాత కోరారు. సెయింట్ పీటర్స్ ఫార్మసీ కళాశాలలో శుక్రవారం సైబర్ నేరాలు, మత్తు పదార్థాలు, మహిళల రక్షణపై షీటీం ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. సైబర్ మోసాలపై 1930 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేయాలన్నారు. తప్పుడు ప్రచారాలకు ఆకర్షితులై మోసపోవొద్దన్నారు. అదే విధంగా యువత ట్రాఫిక్ రూల్స్ పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న షీటీం ఇన్స్పెక్టర్ సుజాత



డైరెక్టర్ తిరుపతిరెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న అకౌంట్స్ ఆఫీసర్స్

ఫైనాన్స్ డైరెక్టర్ తిరుపతిరెడ్డికి అభినందనలు

రాంనగర్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): ఎన్పీడీసీఎల్ ఫైనాన్స్ డైరెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన వంటేరు తిరుపతిరెడ్డిని విద్యుత్ అకౌంట్స్ ఆఫీసర్స్ అసోసియేషన్ (వీఏఓఏ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంజయ్య ఆధ్వర్యంలో శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ కార్యక్రమంలో వీఏఓఏ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.అశోక్, ఉపాధ్యక్షుడు శ్యామల్ రావు, షరీఫ్, టీజీఎన్పీడీసీఎల్ అధ్యక్షుడు వేణుబాబు, కార్యదర్శి సుదర్శన్, ఉపేందర్, స్వామి, పరమేశ్వర్, అనిల్, వెంకటేశ్వర్లు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా 327 యూనియన్ స్టేట్ సెక్రటరీ జనరల్ ఇనుగాల శ్రీధర్, గిరిజన విద్యుత్ ఉద్యోగుల సంక్షేమ సంఘం కంపెనీ ప్రధాన కార్యదర్శి శ్రీరాంనాయక్ ఆధ్వర్యంలో ఆయా అసోసియేషన్‌ల నాయకులు నలుగురు డైరెక్టర్‌లను కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.

గ్రామ పంచాయతీ కార్మికుల అరెస్టు దుర్మార్గం

హనుమకొండ చౌరస్తా, జూన్ 27(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం హైదరాబాద్‌లోని గ్రామ పంచాయతీ కమిషనర్ కార్యాలయం వద్ద ధర్నాకు శుక్రవారం బయలుదేరిన గ్రామ పంచాయతీ కార్మికులను అడ్డుకొని అక్రమ అరెస్టులు చేయడం దుర్మార్గమని తెలంగాణ గ్రామ పంచాయతీ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు బొట్ల చక్రపాణి మండిపడ్డారు. తమ హక్కుల కోసం శాంతియుతంగా హైదరాబాద్‌లోని కమిషనర్ కార్యాలయం ముందు శాంతి యుతంగా ధర్నా నిర్వహించడానికి బయలుదేరిన పరకాల, కమలాపురం, ఐనవోలు, దామెర మండలాలకు చెందిన కార్మిక నాయకులతో పాటు గ్రామ పంచాయతీ కార్మికులను అడ్డుకొని పోలీస్‌స్టేషన్లకు తరలించడం సిగ్గు చేటన్నారు. గ్రామ పంచాయతీ కార్మికుల న్యాయమైన డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఆయన కోరారు.

కేయూలో ఒకరికి కారుణ్య నియామకం

కేయూ క్యాంపస్ జూన్ 27, (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీలో శుక్రవారం ఆఫీస్ సబార్డినేట్‌గా ఉద్యోగం కల్పిస్తూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం ఉత్తర్వులు జారీ చేశారు. కేయూ హాస్టల్స్‌లో కుక్‌గా విధులు నిర్వహిస్తు మరణించిన దామెర స్వామి కుమారుడు దామెర శశికాంత్‌కు ఉద్యోగపత్రాన్ని కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం ఉత్తర్వులు జారీ చేశారు. స్వామి గత జూలై 2024న మృతిచెందగా అతడి కుమారుడు శశికాంత్‌కు అడ్మినిస్ట్రేషన్ విభాగంలో ఆఫీస్ సబార్డినేట్‌గా నియామించారు.

కేయూలో దిష్టిబొమ్మ దహనానికి యత్నం



నిరసన చేస్తున్న పీడీఎస్‌యూ నేతలు

కేయూ క్యాంపస్ జూన్ 27, (ఆంధ్రజ్యోతి): కేయూ భూములను ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణానికి కేటాయిస్తూ వర్సిటీ పాలక మండలిలో తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ శుక్రవారం కేయూ పరిపాలన భవనం ఎదుట దిష్టిబొమ్మను దహనం చేసేందుకు పీడీఎస్‌యూ నేతలు ప్రయత్నించారు. పోలీసులు అడ్డుకుని విద్యార్థులు పంపించారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి మర్రి మహేశ్ మాట్లాడుతూ.. వర్సిటీ భూములను వర్సిటీ అవసరాలకు ఉపయోగించాలని అన్నారు. ఇంటిగ్రేటెడ్ స్కూల్‌కు పాలక మండలి సభ్యులు ఆమోదం తెలుపడం గర్హనీయమని పేర్కొన్నారు. వర్సిటీ భూములను కాపాడాలని అన్నారు. పాలక మండలి తీసుకున్న నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాజేశ్, వంశీ, కేశవ, అశోక్, రామ్, సూర్య, నరసింహ, కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

భగమాలిని అలంకారంలో భద్రకాళి

(5వ పేజీ తరువాయి)

ధరిస్తుందని, భగమాలినీ అమ్మవారిని బ్రాహ్మీ శక్తిగా అమ్మవారిని ఆరాధిస్తే సంతానం, సౌభాగ్యం కలుగుతాయని అర్చకులు తెలిపారు. కాగా, శుక్రవారం ఉదయం 5 గంటల నుంచి భక్తుల తాకిడి మొదలైంది. మధ్యాహ్నం 12 గంటలకు పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవాల సందర్భంగా అమ్మవారి దేవాలయంలో దర్శనం అనంతరం భక్తులకు ఉచిత ప్రసాదాన్ని వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో ఈవో శేషు భారతితో పాటు చైర్మన్ డాక్టర్ శివసుబ్రహ్మణ్యం ధర్మకర్తలు తొనుపునూరి వీరన్న, శ్రవణ్‌కుమార్‌రెడ్డి, పూర్ణచందర్, క్రాంతి, సతీష్, మయూరి, స్రవంతి, సుగుణ, ఆంజనేయులు, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్‌తోపాటు ఆలయ సిబ్బంది అద్దంకి విజయ్‌కుమార్, కూచన హరినాథ్, శ్యాంసుందర్, అశోక్‌తో పాటు ఏసీపీ సత్యనారాయణ, సీఐ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నాగబాబు భార్య రాక

ప్రముఖ సినీ నటుడు కె.నాగబాబు సతీమణి కె.పద్మజ శుక్రవారం భద్రకాళి అమ్మవారిని దర్శించుకున్నారు. హైదరాబాద్ నుంచి కుటుంబసభ్యులతో కలిసి దేవాలయానికి విచ్చేసి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఈవో శేషుభారతి అమ్మవారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. దర్శనం అనంతరం పద్మజ దేవాలయ స్థపన మండపంలో కొంత సేపు ధ్యానం చేశారు.

31వ డివిజన్‌ను అభివృద్ధి చేస్తాం..

- వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి
- ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి శంకుస్థాపన

న్యూశాయంపేట, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు బల్దియా పరిధిలోని 31వ డివిజన్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. గురువారం స్థానిక కార్పొరేటర్ మామిండ్ల రాజు, మేయర్ గుండు సుధారాణి, కమిషనర్ చహత్ బాజ్‌పాయ్‌తో కలిసి డివిజన్‌లోని ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి కొబ్బరికాయ కట్టి శంకుస్థాపన చేశారు. అలాగే వాసవి, గాయత్రి కాలనీల్లో రూ.90 లక్షలతో నిర్మించే అంతర్గత రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గత పాలకుల చేతుల్లో అభివృద్ధికి నోచుకోని ప్రాంతాలను యుద్ధప్రాతిపదికన అభివృద్ధి చేస్తున్నామన్నారు. అంతర్గత రోడ్లు, సైడ్ డ్రైనేజీ, విద్యుత్ సమస్యలను పరిష్కారానికి కృషి చేస్తున్నానన్నారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు సకాలంలో పనులను ప్రారంభించుకోవాలన్నారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు సురేందర్, కాంగ్రెస్ నాయకులు సత్తు రమేష్, కృష్ణ, తాళ్లపల్లి రాజు, పిండి రమేష్ యాదవ్, మామిండ్ల సురేష్, ఈఈ, డీఈ, పీడీ తదితరులు పాల్గొన్నారు.



వాసవికాలనీలో అంతర్గత రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే నాయిని

ప్రభుత్వ పెన్షనర్ల అసోసియేషన్ కమిటీ ఎన్నిక

హసన్‌పర్తి, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్ తెలంగాణ ఎస్సారెస్పీ చింతగట్టు బ్రాంచ్ కమిటీ ఎన్నిక శుక్రవారం క్యాంపు బ్రాంచ్‌లో జరిగింది. ఈ సందర్భంగా గౌరవ అధ్యక్షుడిగా రిటైర్డ్ సీఈ పొన్నల రామయ్య, అధ్యక్షుడిగా రిటైర్డ్ ఏఈ ఎ.వెంకటేశం, ఉపాధ్యక్షులుగా రిటైర్డ్ ఏఈ కె.యాదగిరి, రిటైర్డ్ జేటీవో కె.జలందర్, ప్రధాన కార్యదర్శిగా రిటైర్డ్ సీనియర్ అసిస్టెంట్ పి.శ్యాంసుందర్‌రెడ్డి, సహాయ కార్యదర్శిగా రిటైర్డ్ డిప్యూటీ ఈఈ ఎస్.సూర్యప్రకాష్, రిటైర్డ్ డిప్యూటీ ఈఈ వి.రవిందర్, కోశాధికారిగా రిటైర్డ్ ఏఈ వై.కృష్ణారెడ్డి, ముఖ్య సలహాదారుడిగా హనుమకొండ జిల్లా అధ్యక్షుడు ఇ.నర్సింహారెడ్డి, సలహాదారులుగా రిటైర్డ్ ఈఈఆర్.సూర్యనారాయణ, పి.కృష్ణమూర్తి,ఎస్.చంద్రశేఖర్‌రావులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారులు రాష్ట్ర అసోసియేషన్ అధ్యక్షులు, జి.వీరస్వామి, హనుమకొండ జిల్లా శాఖ కోశాధికారి సీహెచ్.సూర్యప్రకాష్‌లు ప్రకటించారు. ఈ కమిటీ 2025-2028 కాల పరిమితి ఉంటుందని తెలిపారు.



ఎన్నికైన పెన్షనర్స్ అసోసియేషన్ కమిటీ సభ్యులు

ర్యాగింగ్, డ్రగ్స్ వాడకం చట్టరీత్యా నేరం

జిల్లా లీగల్ సెల్ అథారిటీ సెక్రెటరీ, జడ్జి క్షమా దేశ్‌పాండే

హనుమకొండ, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): ర్యాగింగ్, డ్రగ్స్ వినియోగం చట్టరీత్యా నేరమని, వీటికి యువత, ముఖ్యంగా విద్యార్థులు దూరంగా ఉండాలని జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ సెక్రెటరీ జడ్జి క్షమా దేశ్‌పాండే అన్నారు. శుక్రవారం హనుమకొండలోని సెయింట్ పీటర్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ కాలేజీలో ర్యాగింగ్, మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా అవగాహన కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన జడ్జి క్షమా దేశ్‌పాండే మాట్లాడుతూ.. ర్యాగింగ్, డ్రగ్స్ వినియోగం వంటి నేరాలకు పాల్పడితే కఠిన శిక్షలు ఉంటాయన్నారు. విద్యార్థులు తమ ఉజ్వల భవిష్యత్తు కోసం చదువుపైనే ప్రధానంగా దృష్టి సారించాలని కోరారు. అనురాగ్ సొసైటీ చైర్‌పర్సన్ అనితారెడ్డి మాట్లాడుతూ.. ర్యాగింగ్, డ్రగ్స్ నిర్మూలనలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులు ర్యాగింగ్ వంటి ఇబ్బందులు ఎదుర్కొన్న పక్షంలో 100కు డయల్ చేయాలని, లేదా డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీస్ అథారిటీకి ఫిర్యాదు చేయాలని సూచించారు. షీటీం సీఐ సుజాత, ఎస్ఐ మహేందర్ రెడ్డి ర్యాగింగ్, డ్రగ్స్‌కు సంబంధించిన చట్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రతీ కాలేజీలో యాంటీ ర్యాగింగ్ కమిటీ, ఇతరత్రా ఇంటర్నల్ కమిటీలను వేయాలని అన్నారు.

అనంతరం యాంటీ ర్యాగింగ్, యాంటీ డ్రగ్స్ అబ్యూస్, షీటీమ్ పోస్టర్లను ఆవిష్కరించారు. కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న జిల్లా లీగల్ సెల్ అథారిటీ సెక్రెటరీ, జడ్జి క్షమా దేశ్‌పాండే, కేయూ పాలక మండలి సభ్యురాలు అనితా రెడ్డి

టైలర్స్ వర్కర్స్ యూనియన్ నూతన కార్యవర్గం

హనుమకొండ చౌరస్తా, జూన్ 27(ఆంధ్రజ్యోతి): తెలంగాణ టైలర్స్ వర్కర్స్ యూనియన్ హనుమకొండ, వరంగల్ సిటీ నూతన కమిటీని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సోమ వెంకటేశ్, ప్రధాన కార్యదర్శిగా జారతి కిశోర్, కోశాధికారి రాపర్తి సుమన్, ఉపాధ్యక్షులుగా రాపర్తి వేణుగోపాల్, రఘు, చందర్, ప్రశాంత్, కార్యనిర్వాహణ కార్యదర్శులుగా అడప సుధాకర్, వీరస్వామి, రమేష్, మహేష్, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా పెండ్యాల నగేష్, రాచర్ల రాజు, గట్ల సదానందం, రాయబారపు రమేష్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కమిటీ రెండేళ్ల పాటు పదవిలో ఉంటుంది.

డ్రంకెన్ డ్రైవ్‌లో వాహనదారులకు జరిమానా

వరంగల్ క్రైం, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ 18 మంది వ్యక్తులను శుక్రవారం కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి వేణుగోపాల్‌చారి రూ.17,000 జరిమానా విధించినట్లు హనుమకొండ ట్రాఫిక్ సీఐ జి.సీతారెడ్డి తెలిపారు. అదేవిధంగా డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా పట్టుబడ్డ 9 మందికి రూ.4,800 జరిమానా విధించామన్నాం.

ఉద్యోగ ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవాలి

కేయూ క్యాంపస్ జూన్ 27, (ఆంధ్రజ్యోతి): యువత ఉద్యోగ, ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకుని జీవితంలో స్థిరపడాలని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి ఉద్బోధించారు. శుక్రవారం హనుమకొండ వృత్తి విద్యా జూనియర్ కళాశాలలో అప్రెంటీస్ జాబ్‌మేళాను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. వృత్తి విద్యా కోర్సులు చదివిన విద్యార్థులకు ఉద్యోగ నైపుణ్యాలు, ఉపాధి కల్పనకు అప్రెంటీషిప్ మేళాను ఉపయోగపడుతాయని చెప్పారు.

ఈ సమావేశంలో అధ్యక్షుడిగా ప్రిన్సిపాల్ శ్రీధర్ వ్యవరించగా డీఐఈఓ గోపాల్, చందర్, శ్రీనివాసరావు, సంపత్‌కుమార్, శ్రీనివాసరెడ్డి, భగవద్గీత, శరద్యుతి, రాజిరెడ్డి, శ్రీనివాస్, డాక్టర్ రేణుకుంట్ల ప్రవీణ్‌కుమార్, ప్రభుత్వ, ప్రైవేట్ కార్పోరేట్ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

నేడు కేయూలో పీవీ 104వ జయంతి వేడుకలు

కేయూ క్యాంపస్ జూన్ 27, (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ రాజనీతిశాస్త్ర విభాగంలో మాజీ ప్రధాని పీవీ నరసింహారావు 104వ జ యంతి వేడుకలను జూన్ 28న శనివారం ఉదయం 11గంటలకు నిర్వహిస్తామని కేయూ పీవీ నాలెడ్జ్ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ జి.కృష్ణయ్య తెలిపారు. కేయూ రాజనీతిశాస్త్ర విభాగం సెమినార్ హాల్‌లో జరిగే కార్యక్రమంలో కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రంలు హాజరుకానున్నట్లు వెల్లడించారు. బోధన, బోధనేతర సిబ్బందితో పాటు స్కాలర్స్, స్టూడెంట్స్ హాజరుకావాలని కోరారు.

పీవీ జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలి

- రచయిత అభినయ శ్రీనివాస్
- పీవీపై రూపొందించిన సీడీ ఆవిష్కరణ

వడ్డెపల్లి, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): బహుభాషా కోవిదుడు, మాజీ ప్రధాని పీవీ నర్సింహరావు జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలని ప్రముఖ రచయిత, గాయకుడు అభినయ శ్రీనివాస్ అన్నారు. ప్రముఖ ఆయుర్వేద వైద్యుడు డాక్టర్ పాములపర్తి రామారావు సమర్పణలో పీవీ జయంతిని పురస్కరించుకొని రూపొందించిన ఆడియోను శుక్రవారం హనుమకొండ బాలసముద్రంలోని ప్రెస్ క్లబ్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పీవీ తెలుగు ప్రజల ఠీవీ అని కొనియాడారు. పీవీపై రూపొందించి విడుదల చేసిన ఆడియో సీడీలను తెలుగు రాష్ట్రాల్లోని యూనివర్సిటీలకు పంపిణీ చేస్తామన్నారు. పీవీ ఖ్యాతిని ప్రపంచవ్యాప్తంగా చాటాలని ప్రజలకు పిలుపు నిచ్చారు. వైజాక్ ఆర్కెస్ట్రా బృందం ఆధ్వర్యంలో ఆడియో గీతాలను విడుదల చేశారు. కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టులు పీవీ మదన్‌మోహన్, పిన్న శివకుమార్, శ్రీధర్, తెలంగాణ సాంస్కృతిక సారథి జిల్లా ప్రతినిధి దారా దేవేందర్, సంగీత అభిమానులు, సాహితీ ప్రియులు పాల్గొన్నారు.



ఆడియోను విడుదల చేస్తున్న ఏ. శ్రీనివాస్, పాములపర్తి రామారావు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ స్నేహ శబరీష్

ప్రమాదాలను నివారించాలి

- రహదారుల భద్రతపై తనిఖీలు నిర్వహించాలి
- అధికారుల సమీక్ష సమావేశంలో కలెక్టరేట్ స్నేహ

హనుమకొండ కలెక్టరేట్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): రహదారుల భద్రతా చర్యల్లో భాగంగా 15రోజులకోసారి ఆర్అండ్‌బీ, పోలీసు, జాతీయ రహదారులు, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ అన్నారు. జిల్లా కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్‌హాల్‌లో రోడ్డు భద్రతపై రోడ్లు, భవనాలు, పోలీసు, జాతీయ రహదారులు, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ అధికారులతో శుక్రవారం కలెక్టర్ సమావేశం నిర్వహించారు. సంబంధితశాఖల అధికారులు ఈ సందర్భంగా రోడ్డు భద్రతకు తీసుకుంటున్న చర్యల గురించి కలెక్టర్‌కు వివరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో జాతీయ రహదారులు, రాష్ట్ర రహదారుల్లో రద్దీ ప్రాంతాలు, ప్రమాదకర ప్రాంతాలు క్రిటికల్ జంక్షన్లను గుర్తించి సంబంధిత శాఖల అధికారులు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. కటాక్షపూర్ వద్ద నిర్మాణంలో ఉన్న జాతీయ రహదారిపై ప్రమాదాల నివారణకు రేడియంతో కూడిన సైన్‌బోర్డులు, బ్లింకర్లు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. తరచుగా ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతాలను గుర్తించి ఆ జాబితాను అందజేయాలన్నారు. ప్రమాదాల నివారణకు మూతలులేని, నిర్మాణ పనులు జరుగుతున్న చోట్ల, మ్యాన్‌హోల్స్ వద్ద ప్రమాద హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. ఈ సమావేశంలో గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్, జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, ఆర్అండ్‌బీ ఈఈ సురేష్‌బాబు, నేషనల్ హైవేస్ ఈఈ మనోహర్, హనుమకొండ, పరకాల ఆర్డీఓలు, అడిషిన్ డీసీపీ, ఏసీపీలు, రవాణాశాఖ అధకారులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన క్రెడాయ్ నూతన కార్యవర్గం



ఎమ్మెల్యే నాయినికి పూలమొక్కలు అందజేస్తున్న క్రెడాయ్ నూతన కార్యవర్గ సభ్యులు

హనుమకొండ సిటీ, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): రియల్ ఎస్టేట్ అభివృద్ధికి కృషిచేస్తున్న ప్రముఖ సంస్థల సమాఖ్య క్రెడాయ్ నూతన కార్యవర్గ సభ్యులు శుక్రవారం పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డిని క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్కలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నగర అభివృద్ధిలో నిర్మాణ రంగం కీలకపాత్ర పోషిస్తోందని, భవన నిర్మాణంలో నాణ్యతతోపాటు పారదర్శకత అవసరమన్నారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో క్రెడాయ్ చైర్మన్ ఆరబెల్లి తిరుపతిరెడ్డి, అధ్యక్షుడు నాయిని అమరేందర్‌రెడ్డి, ప్రెసిడెంట్ ఎలెక్ట్ కంది శ్రీనివాస్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి శాకమూరి అమర్, ఉపాధ్యక్షులు మందల రవీందర్‌రెడ్డి, లెక్కల రజనీకాంత్‌రెడ్డి, జాయింట్ సెక్రటరీలు ఏ.కొండల్‌రెడ్డి, ఆలేటి నాగరాజు, ఈసీ మెంబర్లు రిషిన్ రెడ్డి, రమేశ్‌బాబు, వెంకటేశ్వర్లు, సాయికుమార్, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

జిల్లా ఫిషరీస్ వైస్ చైర్మన్‌గా సతీష్ నియామకం

హనుమకొండ జిల్లా జిల్లా ఫిషరీస్ కార్పొరేషన్ వైస్ చైర్మన్‌గా సిరబోయిన సతీష్ నియామకం అయ్యారు. శుక్రవారం వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి చేతుల మీదుగా నియామక పత్రాన్ని స్వీకరించారు.

40 ఏళ్లుగా గుడిసెలే దిక్కు

- ఇళ్ల పంపిణీ కోసం పేదల ఎదురుచూపులు
- సర్వేల పేరుతో అధికారులు కాలయాపన
- వెంటనే ఇళ్ల కేటాయించాలని గుడిసెవాసుల విజ్ఞప్తి

హనుమకొండ టౌన్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): ఉండడానికి నిలువ నీడలేక ఏళ్లతరబడి నిరుపేదలు గుడిసెలలోనే మగ్గుతున్నారు. హనుమకొండలోని అంబేద్కర్ నగర్, జితేందర్‌సింగ్ కాలనీవాసులు 40 ఏళ్లుగా గుడిసెలలో నివాసం ఉంటున్నారు. ప్రభుత్వాలు మారినా వారి జీవితాలు మాత్రం మారడంలేదు, ఇల్లులేని నిరుపేదలకు డబుల్‌బెడ్రూమ్ ఇళ్ల ఇవ్వాలనే లక్ష్యంతో గత బీఆర్ఎస్ ప్రభుత్వం హనుమకొండ బాలసముద్రంలోని బస్టాండ్ సమీపంలో 590 డబుల్ బెడ్రూమ్ ఇళ్లు నిర్మించారు. అర్హులైన లబ్ధిదారులకు ఇళ్లు ఇవ్వాల్సి ఉండగా.. అధికారులు, ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యంతో పదేళ్లుగా కాలయాపన చేస్తున్నట్లు గుడిసెవాసులు చెబుతున్నారు.

కోడ్ వస్తే రెండు నెలలు ఆలస్యం

అసలే వర్షకాలం ప్రారంభం కావడంతో గుడిసెలలో నివాసం ఉంటున్న కాలనీ ప్రజలకు డబుల్ బెడ్ రూంలు కేటాయింపు చేయకపోవడంతో వర్షాలు కురుస్తుండడంతో పిల్లలతో పస్తులుంటున్నట్లు వాపోతున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల కోడ్ వస్తే మరో రెండు నెలలు ఇళ్ల పంపిణీ ఆలస్యం జరుగుతుందని, వెంటనే అర్హులైన వారికి ఇళ్లు కేటాయించాలని పేద ప్రజలు కోరుతున్నారు.



హనుమకొండలోని జితేందర్‌సింగ్ నగర్ గుడిసెలలో నివాసం ఉంటున్న కాలనీ వాసులు

ఇళ్ల పంపిణీకి సర్వే పూర్తి

నిరుపేదల కోసం నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల కోసం రెవెన్యూ అధికారులు గత నెలలో ఇంటింటికీ తిరుగుతూ ప్రతీ గుడిసెలో ఉంటున్న కాలనీవాసుల వివరాలు తీసుకున్నారు. ఆధార్‌కార్డుతో పాటు ఎన్ని కుటుంబాలు, ఎన్నేళ్లుగా నివాసం ఉంటున్న వివరాలతో సర్వే పూర్తి చేసినట్లు అధికారులు తెలిపారు.

ఇళ్ల కేటాయింపుపై ఉత్కంఠ

ఇళ్ల పంపిణీ కోసం అధికారులు చేసిన సర్వే ఆధారంగా ఇళ్ల కేటాయింపు ఉంటుందని అధికారులు చెబుతున్నారు. ఇప్పటికే స్థానిక ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అధికారులతో సమీక్షలు చేసి అర్హులైన వారికి ఇళ్ల ప్రొసీడింగ్‌ల జాబితా సిద్ధం చేయాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చినట్లు తెలుస్తోంది. ఇళ్ల కేటాయింపులో అర్హులకు ఇస్తారా? లేక గతంలో ఇందిరమ్మ ఇళ్లు తీసుకున్న వారికి ఇళ్లు కేటాయిస్తారా? అని కాలనీవాసులు ఉత్కంఠతతో చూస్తున్నారు. ఇప్పటికైనా ఇళ్ల పంపిణీలో కాలయాపన చేయకుండా ఎన్నో ఏళ్లుగా ఉండడానికి నిలువ నీడలేక గుడిసెలలో ఉంటున్న నిరుపేదలను గుర్తించి డబుల్‌బెడ్ రూమ్ ఇళ్లు ఇవ్వాలని కాలనీ ప్రజలు ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డిని, జిల్లా అధికారులును కోరుతున్నారు.

40 ఏళ్లుగా ఇబ్బందులు

హనుమకొండ బాలసముద్రంలోని అంబేద్కర్‌నగర్, జితేందర్‌సింగ్ కాలనీలో 40 ఏళ్లుగా గుడిసెలు వేసుకుని జీవనం సాగిస్తున్నారు. వర్షాకాలంలో ఇళ్లలోకి పాములు, కుక్కలు, కోతులతో ఇబ్బందులు పడుతున్నట్లు కాలనీవాసులు చెబుతున్నారు. అధికారులు ఇళ్ల పంపిణీ కోసం సర్వే చేసిన ఇప్పటివరకు ఇళ్లు కేటాయించకుండా నిర్లక్ష్యం చేస్తున్నట్లు చెబుతున్నారు.

ఆ వ్యాఖ్యలపై వివరణ ఇవ్వండి

- కొండా మురళికి పీసీసీ క్రమశిక్షణ కమిటీ పిలుపు
- నేడు గాంధీభవన్‌లో భేటీకి హాజరు కావాలని ఆదేశం

వరంగల్/హైదరాబాద్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): సొంత పార్టీ ఎమ్మెల్యేలపై విమర్శలు చేసిన మంత్రి కొండా సురేఖ భర్త, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళిని టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ వివరణ కోరింది. శనివారం గాంధీభవన్‌లో సమావేశం కానున్న ఎంపీ మల్లు రవి నేతృత్వంలోని క్రమశిక్షణ కమిటీ.. ఉదయం 11 గంటలకు హాజరై వివరణ ఇవ్వాల్సిందిగా కొండా మురళిని ఆదేశించింది. ఈ నెల 19న కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ జన్మదినం సందర్భంగా వరంగల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, రేవూరి ప్రకాశ్‌రెడ్డిలపై కొండా మురళి తీవ్ర పదజాలంతో విమర్శలు చేయడం తెలిసిందే. దీనిపై ఉమ్మడి వరంగల్ జిల్లా కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, నేతలు ఈ నెల 23న ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్‌తోపాటు క్రమశిక్షణ కమిటీ చైర్మన్ మల్లు రవికి, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్‌కు ఫిర్యాదు చేశారు. కాగా, వీరి ఫిర్యాదుపై శుక్రవారం పీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్‌తో మల్లు రవి చర్చించినట్లు తెలిసింది. త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఎమ్మెల్యేల మధ్య విభేదాలు పార్టీకి మంచిది కాదనే అభిప్రాయానికి వారు వచ్చినట్లు సమాచారం. ఈ మేరకు తొలుత మురళి నుంచి సంజాయిషీ తీసుకోవాలని నిర్ణయించినట్లు తెలిసింది. మరోవైపు కొండా సురేఖ అనుచరులు కూడా ఎమ్మెల్యేల తీరుపై టీపీసీసీ అధ్యక్షుడికి ఫిర్యాదు చేసినట్లు, సురేఖ మంత్రి పదవి పోతుందంటూ ఎమ్మెల్యేలు దుష్ప్రచారం చేశారని చెప్పినట్లు సమాచారం.

పథకాల పేరు మార్పు సిగ్గుచేటు: బండి సంజయ్



హైదరాబాద్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): హిందువుల మనోభావాలను దెబ్బతీసేలా తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం పథకాల పేర్లను మారుస్తోందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ మండిపడ్డారు. 'అన్నపూర్ణ' పేరిట అందిస్తున్న రూ.5భోజనం పథకానికి ఇందిరాగాంధీ పేరు పెట్టడం సిగ్గుచేటని 'ఎక్స్' వేదికగా ధ్వజమెత్తారు. మార్పు తీసుకొస్తామని ఎన్నికల ముందు హామీ ఇచ్చిన కాంగ్రెస్.. ఆయా కార్యక్రమాల పేర్లలో మాత్రమే మార్పు తీసుకువచ్చిందని విమర్శించారు. కాగా, యూరియా బస్తాకు రూ.25చొప్పున రవాణా ఖర్చును రైతులపై వేయాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని బీజేపీ అధికార ప్రతినిధి రాణిరుద్రమ డిమాండ్ చేశారు.

రేపు రాష్ట్ర పర్యటనకు రానున్న అమిత్ షా

కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఆదివారం రాష్ట్ర పర్యటనకు రానున్నారు. మధ్యాహ్నం ఒంటి గంటకు ఆయన ప్రత్యేక విమానంలో బేగంపేట విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడి నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి 1.45 గంటలకు నిజామాబాద్ చేరుకుంటారు. అక్కడ జాతీయ పసుపు బోర్డు కార్యాలయాన్ని ప్రారంభిస్తారు. దివంగత నేత డి.శ్రీనివాస్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తారు. అనంతరం, పాలిటెక్నిక్ కాలేజ్ మైదానంలో ఏర్పాటు చేసే బహిరంగ సభలో పాల్గొంటారు. తిరిగి హైదరాబాద్ చేరుకుని ఢిల్లీ వెళతారు.

అఖిల పక్షాన్ని వెంటనే ఢిల్లీకి పంపాలి: జాజుల

బర్కత్‌పుర, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): బీసీలకు విద్య, ఉద్యోగ, స్థానిక సంస్థల్లో 42%రిజర్వేషన్ల సాధనకు సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం 48 గంటల్లో అఖిలపక్ష బృందాన్ని ఢిల్లీకి పంపాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. తమిళనాడు మాజీ సీఎం జయలలిత లాగానే సీఎం రేవంత్ కూడా ఢిల్లీకి వెళ్లి బీసీ రిజర్వేషన్లను సాధించుకున్న తర్వాతనే తెలంగాణలో అడుగుపెట్టాలన్నారు. శుక్రవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో బీసీ సంఘాల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన జాజుల శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ.. జూలై 21నుంచి జరిగే పార్లమెంటు సమావేశాల్లో బీసీ రిజర్వేషన్ల బిల్లును ప్రవేశపెట్టి, ఆమోదించేలా కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని సూచించారు.

తెల్లాపూర్‌లో డ్రోన్లతో భూ సరిహద్దుల గుర్తింపు

రామచంద్రాపురం టౌన్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): భూ సరిహద్దుల గుర్తింపునకు డ్రోన్లను వినియోగించే విషయంలో కసరత్తులు జరుగుతున్నాయి. ఇస్రోకు అనుబంధంగా పని చేస్తున్న బాలానగర్‌లోని నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్(ఎన్ఆర్ఎస్‌సీ) నిపుణులు శుక్రవారం దీనిని ప్రయోగాత్మకంగా పరిశీలించారు. తెల్లాపూర్ పురపాలక పరిధిలోని కొల్లూరు గ్రామానికి చెందిన 297 సర్వే నంబరు భూములను డ్రోన్‌తో చిత్రీకరించారు. అనంతరం ఆ ఫొటోల నాణ్యతను పరిశీలించారు. వెబ్‌లో అప్‌లోడ్ చేసిన తర్వాత ఆ ఫొటోలు జూమ్ చేస్తే ఎంత స్పష్టత ఉంటుందనే విషయాన్ని పరిశీలిస్తామని అధికారులు తెలిపారు.

ఆర్‌అండ్‌బీలో 72 మంది డీఈఈలకు పదోన్నతి

హైదరాబాద్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): రోడ్లు, భవనాల శాఖలో పదోన్నతుల ప్రక్రియ కొనసాగుతోంది. శాఖలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు(డీఈఈ)గా ఉన్న 72 మందికి తాజాగా ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు(ఈఈ)గా పదోన్నతి కల్పించడంతో పాటు వారిలో 64 మందికి పోస్టింగ్‌లు ఇచ్చారు. వీరిలో ఇద్దరు, ముగ్గురు ఈ నెల 30న పదవీ విరమణ చేయనున్నారు. శాఖలో ఇప్పటి వరకు వివిధ స్థాయిల్లో 223 మందికి పదోన్నతులు లభించాయి. కాగా, ప్రజల మన్ననలు పొందేలా ఆర్ అండ్ బీ ఇంజనీర్లు పనిచేయాలని ఆ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కోరారు. ముఖ్యమంత్రిని ఒప్పించి ఏ శాఖలో లేని విధంగా తన శాఖలో ప్రత్యేకంగా పదోన్నతులు ఇప్పించానని తెలిపారు.

అర్చక పోస్టుల భర్తీకి చర్యలు

- ఖాళీల వివరాలు ఇవ్వాలని ఉన్నతాధికారుల ఆదేశాలు

దేవాదాయ శాఖ పరిధిలోని ఆలయాల్లో అర్చక పోస్టుల ఖాళీల భర్తీకి ఉన్నతాధికారులు చర్యలు చేపట్టారు. దేవాదాయ శాఖ పరిధిలోని అన్ని ఆలయాల్లో ప్రధాన అర్చకులు, ఉప ప్రధాన అర్చకులు, అర్చకుల పోస్టులు ఖాళీల వివరాలు అందించాలని ప్రధాన కార్యాలయం నుంచి అన్ని జిల్లాల అధికారులకు ఆదేశాలు జారీ అయ్యాయి. ఖాళీల ఆధారంగా ఆయా పోస్టుల్ని త్వరలో భర్తీ చేయనున్నారు. దేవాదాయ శాఖ పరిధిలోని అన్ని ఆలయాల్లో సుమారు 300 పోస్టులు ఖాళీగా ఉన్నట్లు సమాచారం.

పదో తరగతి అడ్వాన్స్డ్ సప్లిమెంటరీ ఫలితాల్లో 73.35 శాతం ఉత్తీర్ణత

- రీకౌంటింగ్, రీవెరిఫికేషన్‌కు జూలై 7 వరకు గడువు

హైదరాబాద్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి అడ్వాన్స్డ్ సప్లిమెంటరీ పరీక్ష ఫలితాలను శుక్రవారం విడుదల చేశారు. ఈ నెల 3 నుంచి 13 వరకు నిర్వహించిన పరీక్షలకు 42,834 మంది దరఖాస్తు చేసుకోగా 38,741మంది హాజరయ్యారు. వీరిలో 28,415(73.35%)మంది ఉత్తీర్ణత సాధించారని ప్రభుత్వ పరీక్షల విభాగం సంచాలకుడు ఎ.క్రిష్ణారావు తెలిపారు. వీరిలో అబ్బాయిలు 71.05 శాతం, అమ్మాయిలు 77.08 శాతం ఉన్నారు. జనగామ జిల్లా 100శాతం ఉత్తీర్ణతతో రాష్ట్రస్థాయిలో మొదటి స్థానం సాధించగా.. 55.90శాతంతో సంగారెడ్డి చివరిస్థానంలో నిలిచింది. హైదరాబాద్ జిల్లాలో 61.13శాతం, రంగారెడ్డి జిల్లాలో 82.13 శాతం ఉత్తీర్ణత నమోదైంది. పరీక్ష కేంద్రాల నుంచి సమాచారం రావాల్సి ఉన్నందున కొందరి ఫలితాలు విత్‌హెల్డ్‌లో పెట్టామని, వాటిని త్వరలో ప్రకటిస్తామని క్రిష్ణారావు తెలిపారు. రీకౌంటింగ్‌కు సబ్జెక్టుకు రూ.500, రీవెరిఫికేషన్‌కు రూ.1,000చొప్పున 7వ తేదీలోపు చెల్లించాల్సి ఉంటుందన్నారు.

జూలై 31 వరకు ఇంటర్ ప్రవేశాలు: ఇంటర్ బోర్డు

పదో తరగతి అడ్వాన్స్డ్ సప్లిమెంటరీ పరీక్ష ఫలితాలు విడుదలైన నేపథ్యంలో ఇంటర్మీడియట్ కోర్సుల్లో ప్రవేశాలకు రెండో విడత తేదీలను ఇంటర్ బోర్డు ప్రకటించింది. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు, గురుకులాలు, కేజీబీవీ, మోడల్ స్కూళ్లు జూలై 31 వరకు ప్రవేశాలు తీసుకోవచ్చని ఇంటర్ విద్య కమిషనర్ కృష్ణ ఆదిత్య తెలిపారు. ఇంటర్ ప్రవేశాలకు ఇదే చివరి అవకాశమని, తర్వాత పొడిగింపు ఉండదని ఆయన శుక్రవారం ఓ ప్రకటనలో స్పష్టం చేశారు. ఇంటర్ బోర్డు గుర్తింపు ఉన్న కాలేజీల్లోనే చేరాలని, అనుమతి ఉన్న కాలేజీల వివరాలు వెబ్‌సైట్లో ఉన్నాయని చెప్పారు.

వారంలోనే ఆత్మీయ భరోసా



(మొదటిపేజీ తరువాయి)

ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం వర్తింపజేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. రాష్ట్ర వ్యాప్తంగా 5,19,191 మంది.. ఈ పథకానికి అర్హులని తేల్చింది. వీరికి ఏడాదికి రూ.12వేల చొప్పున (6 నెలలకోసారి రూ.6వేల చొప్పున రెండు విడతల్లో) ఆర్థిక సాయం అందిస్తామని మార్గదర్శకాల్లో పేర్కొంది. ఈ ఏడాది జనవరి 26న పథకాన్ని ప్రారంభించిన ప్రభుత్వం.. 2024-25 ఆర్థిక సంవత్సరం తొలివిడత (రూ.6వేల చొప్పున) చెల్లింపుల్లో భాగంగా 83,887 మంది కూలీలకు మాత్రమే రూ.50.33కోట్లు చెల్లించింది. నిధుల కొరత కారణంగా మిగతా 4,35,304 మంది కూలీలకు రూ.261.18కోట్లు చెల్లించలేదు. ఇటీవల రైతు భరోసా చెల్లింపులను ప్రభుత్వం 9 రోజుల్లోనే పూర్తి చేసిన నేపథ్యంలో ఆత్మీయభరోసా పెండింగ్ నిధులు విడుదల చేయాలనే ప్రతిపాదన వచ్చింది. కొందరు ఎమ్మెల్యేలు, మంత్రులు కూడా ఈ అంశాన్ని ముఖ్యమంత్రి రేవంత్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిసింది. స్థానిక సంస్థల ఎన్నికలకు కసరత్తు జరుగుతున్న నేపథ్యంలో గ్రామీణ ప్రాంతాల్లోని వ్యవసాయ కూలీలకు ఆత్మీయ భరోసా చెల్లిస్తే బాగుంటుందనే చర్చ జరిగినట్లు సమాచారం. దీనిపై స్పందించిన సీఎం.. వెంటనే చెల్లించాలని ఆదేశాలు ఇచ్చినట్లు విశ్వసనీయవర్గాల ద్వారా తెలిసింది. ఈ మేరకు 2024- 25 సంవత్సరానికి సంబంధించి తొలివిడత చెల్లింపులను పూర్తి చేయాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు చెబుతున్నారు. ఇప్పటికే గ్రామీణాభివృద్ధి శాఖ నుంచి బిల్లులు కూడా ఆర్థిక శాఖకు అందినట్లు తెలిసింది. ఒకటి, రెండు తేదీల్లో ఉద్యోగుల వేతనాలు చెల్లించగానే.. ఆత్మీయ భరోసాకు నిధులిచ్చేలా ఆర్థికశాఖ ఏర్పాట్లు చేస్తోంది.

రెండో విడత కూడా చెల్లిస్తారా?

2024-25 సంవత్సరానికి సంబంధించి తొలివిడత ఆత్మీయ భరోసా పంపిణీ పూర్తయితే.. రెండో విడత నిధులు ఎప్పుడు చెల్లిస్తారన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. మొత్తం 5,19,191 మంది కూలీలకు రెండో విడతలో రూ.6 వేల చొప్పున చెల్లించాలంటే రూ.311.51కోట్లు సర్దుబాటు చేయాల్సి ఉంటుంది. వాస్తవానికి గత ఆర్థిక సంవత్సరంలోనే ఈ పథకానికి బడ్జెట్ కేటాయింపులు చేశారు. మార్చి 31తో గత ఆర్థిక సంవత్సరం ముగిసిపోయింది. కానీ, పథకాన్ని పూర్తి స్థాయిలో అమలు చేయలేదు. మొదటి విడతలోనే కొంత మందికి ఇచ్చి, మిగతా వారికి ఆపేశారు. అయితే, వచ్చే వారం, పది రోజుల్లో మొదటి విడత పూర్తి చేసి, రెండో విడత చెల్లింపులపైనా ప్రభుత్వం దృష్టి పెట్టనున్నట్లు తెలిసింది. వీలైతే రెండో విడత సొమ్మును కూడా జూలైలోనే చెల్లించి, ఒక ఏడాది ఆత్మీయ భరోసా సాయాన్ని పూర్తి చేయాలనే ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్లు సమాచారం.

వ్యథల చెరలో వార్ధక్యం

(హైదరాబాద్ సిటీ-ఆంధ్రజ్యోతి)



తరాలు తిన్నా తరగనంత సంపద ఉన్నా, ప్రతి నెలా వేలల్లో పెన్షన్, అద్దెలు వస్తున్నా.. 68 ఏళ్ల చక్రధర్ (పేరు మార్చాం) భార్య చనిపోయి చాలాకాలమైంది. పిల్లలు విదేశాల్లో ఉంటున్నారు. ఖాతాలో బోలెడంత డబ్బున్నా.. వేళకింత ముద్ద పెట్టేవాళ్లు లేరు! ఆయన ఖాతాలో భారీగా ఉన్న డబ్బు గురించి తెలుసుకున్న సైబర్ నేరగాడొకడు ఆయనతో మాట కలిపాడు. ఫలానా యాప్ ద్వారా పెట్టుబడులు పెడితే బోలెడన్ని లాభాలు వస్తాయంటూ.. ఒక లింకు పంపాడు. చక్రధర్ ఆ మోసగాడి మాటలు నమ్మి ఆ యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకోగానే.. ఆయన బ్యాంకు ఖాతాలన్నీ ఖాళీ అయ్యాయి!!

సొంతూరిలో కొడుకులు, కూతుళ్లు.. కళ్లముందే మనుమళ్లు, మనుమరాళ్లతో హాయిగా సాగుతున్న రామయ్య, సరోజినమ్మ(అసలు పేర్లు కాదు) జీవితాల్లో ఊహించని కుదుపు. ఆస్తి పంపకాల్లో తమ్ముడికి తనకన్నా ఎక్కువ ఇచ్చారని అన్న.. తమకు వాటా ఇవ్వలేదని కూతుళ్లు.. అంతా అలిగారు. పెద్ద కొడుకు తండ్రిపై కోపంతో ఆయన్ను చంపేశాడు. భర్త మరణాన్ని.. పిల్లల తీరును భరించలేక సరోజినమ్మ ఆత్మహత్య చేసుకుంది.

..ఇలా ఒకటా, రెండా.. పింఛను డబ్బుకోసం తండ్రి నాలుక కోసిన పుత్రరత్నం, ఆస్తి పంచట్లేదని కన్నతండ్రిని ట్రాక్టర్‌తో గుద్ది చంపిన కుమారులు.. వంటి అమానవీయ ఘటనలు కోకొల్లలు. పల్లెల్లో ఆస్తి తగాదాల కారణంగా కన్నవారిని ఇంటి నుంచి పొమ్మంటుంటే, పట్టణాల్లో పిల్లల నిరాదరణ తల్లిదండ్రులకు శాపంగా మారుతోంది. మంచి ఉద్యోగాల్లో స్థిరపడ్డ చాలా మంది.. తల్లిదండ్రులను బాగానే చూసుకుంటున్నా.. వారి బిజీలో వారు ఉండిపోతున్నారు. తాము బాగా సంపాదిస్తున్నాం కాబట్టి.. "తండ్రికి పెన్షన్ ఎంతొస్తోంది? అనే విషయాన్ని కూడా పట్టించుకోవట్లేదు. కానీ, తాము తల్లిదండ్రులతో మనసు విప్పి మాట్లాడకపోవడమే కన్నవారి అసలు సమస్య అనే విషయం ఆ పిల్లలకు అర్థం కావట్లేదు. ఏ వ్యాపకం లేకుండా ఉండడం.. చేతిలో బోలెడంత డబ్బుండడంతో.. స్మార్ట్‌ఫోన్ ద్వారా సైబర్ మోసగాళ్ల వన్నే ఉచ్చుకు, హనీట్రాప్‌లకు చిక్కుతున్నారు. రాష్ట్రంలో సైబర్ నేరగాళ్ల బారిన పడుతున్న వయోధికుల్లో 70-85% ఒంటరి మగవాళ్లే కావడం ఇందుకు రుజువు. విదేశాల్లో ఉంటున్న చాలామంది పిల్లలకు కన్నవారిని పట్టించుకునే తీరికే ఉండట్లేదు.

పల్లెల్లో అలా...

పట్టణాలతో పోలిస్తే గ్రామీణ వాతావరణంలో ఒంటరితనానికి పెద్దగా తావుండదు. ఉద్యోగ, ఉపాధి అవకాశాలరీత్యా పిల్లలు ఇతర ప్రాంతాలలో స్థిరపడినా... పల్లెల్లోని పెద్దలకు ఇరుగుపొరుగుతో బోలెడంత కాలక్షేపం. ఈ మధ్య పల్లెలు కూడా సెమీ అర్బన్ సంస్కృతిని సంతరించుకుంటున్న నేపథ్యంలో... అక్కడా ఒంటరితనం తాలూకు సమస్యలు కొంత పెరుగుతున్నాయి. కానీ ఏదో ఒక పనికల్పించుకోడానికి అవకాశం, పలకరించడానికి చుట్టూ బంధు, మిత్రులున్నారన్న ధైర్యం గ్రామీణ వయోధికుల్లో కొంత వరకు భరోసా కల్పిస్తుంది. అయితే, ఈ మధ్యకాలంలో ఆస్తి తగాదాలు, పిల్లల్లో సఖ్యత లేకపోవడం వారికి పెద్ద కష్టాలను తెచ్చిపెడుతున్నాయి. పిల్లలకు పంచగా, తల్లిదండ్రుల అవసరార్థం అట్టిపెట్టుకున్న ఆస్తిమీద కన్నేసిమరీ కన్నవారిని కాటికి పంపుతున్న అమానవీయ ఘటనలు ఏపీ, తెలంగాణలోనూ ఈ మధ్య వెలుగుచూశాయి. పట్టణాలతో పోలిస్తే గ్రామాల్లోనే వయోధికులపై వేధింపులు అధికంగా ఉన్నాయని హెల్పేజ్ ఇండియా ప్రతినిధులు చెబుతున్నారు. కచ్చితంగా పింఛను డబ్బు వచ్చే రోజున ఇంటిమీద పడి నానా యాగీ చేసి తల్లిని కొట్టి మరీ ఆ సొమ్మును తాగడానికి తీసుకెళుతున్న ప్రబుద్ధులకు తెలుగునాట కొదవలేదు. మగపిల్లలతో పోలిస్తే కూతుళ్లు కన్నవారి పట్ల ప్రేమ, కరుణతో ఉంటారని ఒక నమ్మకం. కానీ.. ఇటీవలి కాలంలో పల్లెల్లో ఆడపిల్లలు సైతం అమ్మానాన్నపట్ల కర్కశత్వంగా వ్యవహరిస్తున్న ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. ఇటీవలికాలంలో భూముల రేట్లు ఆకాశాన్నంటుతుండడంతో ఇలాంటి గొడవలు పల్లెల్లో మరీ ఎక్కువగా జరుగుతున్నాయని హెల్పేజ్ ఇండియా ప్రాజెక్టు కోర్డినేటర్ శ్యామ్ తెలిపారు. ఇలాంటి సమస్యల నుంచి బయటపడాలంటే వృద్ధులు సాంఘిక జీవనాన్ని పెంపొందించుకోవాలని.. వయోధికుల హక్కుల సంఘానికి చెందిన డాక్టర్ రావు చెలికాని సూచిస్తున్నారు.

వృద్ధుల కోసం హెల్ప్‌లైన్లు

కుటుంబం, సమాజం నుంచి వేధింపులు, సమస్యలు ఎదుర్కొంటున్న వయోధికులకు తగిన సహాయం అందించడానికి హెల్పేజ్ ఇండియా ఒక ఉచిత హెల్ప్‌లైన్ నిర్వహిస్తోంది. నంబరు.. 18001801253. బాధితులే కాదు, కష్టాల్లో ఉన్న వృద్ధుల గురించి ఎవరైనా ఈ సహాయ కేంద్రానికి తెలియజేయచ్చు.అలాగే, వయోధికులకు అండగా కేంద్ర ప్రభుత్వం 14567 హెల్ప్‌లైన్‌ను అందుబాటులోకి తెచ్చింది. పథకాలు, పెన్షన్, పింఛన్లు తదితర విషయాలకు సంబంధించిన అనుమానాలను నివృత్తి చేయడంతో పాటు మానసిక స్థైర్యాన్ని అందించే కౌన్సెలింగ్ లాంటి సేవలను ఉచితంగా పొందవచ్చు. ఉదయం 8 నుంచి రాత్రి 8 గంటల వరకూ ఈ హెల్ప్‌లైన్ పనిచేస్తుంది.

అమ్మానాన్నలతో రోజూ మాట్లాడండి

పట్టణ ప్రాంతాల్లో 20-25 శాతం వృద్ధుల్లో మానసిక కుంగుబాటు కనిపిస్తోంది. అందుకు ప్రధానకారణం ఒంటరితనం. ఈ మధ్యకాలంలో 60-75 ఏళ్లలోపు ఒంటరి మగవాళ్లు హనీట్రాప్ లాంటి మోసాలకు గురవుతున్నారు. అందులోనూ మరొక తోడు కోసం పరితపిస్తున్న పెద్దలే ఎక్కువమంది బాధితులు. కనుక వారి మానసిక స్థితిని అర్థంచేసుకోవాలి. అలాగే.. వయోధికులకు డిజిటల్ లిటరసీ చాలా అవసరం. పిల్లలు కూడా.. ఎంత బిజీగా ఉన్నా తల్లిదండ్రులతో రోజూ కాసేపు మాట్లాడాలి. సరైన సమయంలో గుర్తించి తగిన వైద్య సహాయం అందించాలి.

\- డాక్టర్ మధువంశీ, సైకియాట్రిస్ట్

ఆశకు పోతే ఖాతా ఖాళీ.. జరభద్రం

స్టాక్ మార్కెట్, షేర్ మార్కెట్లో సొమ్ము పెడితే రెట్టింపు అవుతుందన్న ప్రకటనలు నమ్మి కొంతమంది వయోధిక మహిళలు కూడా లక్షల రూపాయలు పోగొట్టుకున్నారు. డిజిటల్ అరెస్టులు, 'మీ కొడుకును నార్కోటిక్ కేసులో బంధించాం' లాంటి బెదిరింపులతో డబ్బు గుంజేస్తున్నారు. బీమా కంపెనీల పేరుతో ఓటీపీలు తీసుకొని బ్యాంకు ఖాతాలు ఖాళీచేస్తున్నారు. కాబట్టి వృద్ధులు ఇలాంటివాటిపట్ల జాగ్రత్తగా ఉండాలి. వ్యక్తిగత విషయాలు, బ్యాంకు ఖాతా వివరాలు, పాస్‌వర్డ్‌లు ఎవరితోనూ చెప్పకూడదు. అధిక లాభాలు వస్తాయని ఎవరైనా చెప్తే ఆశపడి ఆన్‌లైన్ వ్యాపారాల్లో పెట్టుబడి పెట్టద్దు. మీరు మోసపోయినట్లు గుర్తించినా, మిమ్మల్ని ఎవరైనా బెదిరించినా ధైర్యంగా ఫిర్యాదు చేయండి.

\- జి. నాగేశ్వరరావు, స్టేట్ కౌన్సిల్ ఫర్ సీనియర్ సిటిజన్స్ సభ్యుడు

వ్యాపకాలు కల్పించుకోవాలి

వృద్ధాప్యంలో అయినవారి ప్రేమాభిమానాలు, ఆత్మీయ స్పర్శ చాలా అవసరం. అవి కుటుంబం నుంచి లభిస్తే.. చాలా సమస్యలు పరిష్కారమవుతాయి. వృద్ధులు కూడా ఒంటరితనాన్ని జయించడానికి మంచి వ్యాపకాలు కల్పించుకోవాలి. అందుకే మేము నెలకు రెండు సార్లు వయోధికులతో ఆత్మీయ సమావేశాలు ఏర్పాటుచేస్తున్నాం.

\- రాజేశ్వరి, తోడు-నీడ ఫౌండేషన్

ఆటో డ్రైవర్లకు ఇస్తామన్న 12 వేల భృతి ఏది?

- ఎన్నికల్లో ఇచ్చిన హామీ ఊసే లేదేం?
- ఏడాదిన్నరలో 142 మంది ఆత్మహత్య
- ఇవన్నీ ప్రభుత్వ హత్యలే :హరీశ్



హైదరాబాద్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): ఎన్నికలకు ముందు ఆటో డ్రైవర్లకు ఏడాదికి రూ.12,000 భృతి ఇస్తామని హామీ ఇచ్చి.. అధికారంలోకి వచ్చాక ఆ ఊసే ఎత్తకుండా వారిని మోసం చేశారని ప్రభుత్వంపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు ధ్వజమెత్తారు. శుక్రవారం పటాన్‌చెరువు ఆటోడ్రైవర్ల సంఘం ప్రతినిధులు హరీశ్‌ను కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన 18 నెలల వ్యవధిలో 142 మంది ఆటో డ్రైవర్లు ఆత్మహత్య చేసుకున్నారని, ఇవి ముమ్మాటికీ రేవంత్ ప్రభుత్వం చేసిన హత్యలే అని ఆరోపించారు. ఆటో డ్రైవర్ల సంక్షేమానికి బీఆర్ఎస్ పార్టీ ఎప్పుడూ ముందుంటుందన్నారు. ముఖ్యమంత్రి ఎన్నికల హామీలను అమలు చేసి, ఆటో డ్రైవర్లకు భద్రత కల్పించాలని, చనిపోయిన ఆటో డ్రైవర్ల కుటుంబాలకు కనీసం రూ.10 లక్షల సాయం అందించాలని హరీశ్ డిమాండ్ చేశారు.

ప్రాజెక్టుల భవితవ్యం ప్రశ్నార్థకం

ఉన్న ప్రాజెక్టులను సరిగా నిర్వహించక, కొత్త ప్రాజెక్టుల ఆలోచన లేక తెలంగాణ సాగునీటి రంగాన్ని ప్రభుత్వం సంక్షోభంలో నెడుతున్నదని హరీశ్ విమర్శించారు. ఏడాదిన్నరగా కాళేశ్వరంపై ఏడుస్తూ కాలం వెళ్లదీయడం తప్ప, ఒక చెరువు తవ్వింది లేదు, కొత్తగా ఒక్క ఎకరానికి కూడా నీరిచ్చింది లేదని విమర్శించారు.

అందాల పోటీల్లో ప్లేట్ భోజనం లక్ష: కేటీఆర్

హైదరాబాద్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం పాఠశాలలు, గురుకులాలు, విశ్వవిద్యాలయాల్లో విద్యార్థులకు కనీసం పట్టెడన్నం కూడా పెట్టడం లేదు కానీ అందాల పోటీల పేరుతో విందుల్లో ప్లేటు భోజనానికి లక్ష రూపాయలు ఖర్చు పెట్టిందని కేటీఆర్ ఎక్స్ వేదికగా విమర్శలు గుప్పించారు. 'అన్నపురాశులు ఒకచోట.. ఆకలి మంటలు ఒకచోట.. హంస తూలికలు ఒకచోట.. అలసిన దేహాలు ఒకచోట' అని కవి కాళోజి నారాయణరావు చెప్పిన మాటలను తన ట్వీట్‌లో ప్రస్తావించారు. వేములవాడలో నిర్వహించిన కాంగ్రెస్ సభకు అధికారులు ఆలయ ఆదాయంతో ప్లేట్ భోజనానికి 36 వేలు, ఒక్కో పట్టు పంచకు 10 వేల రూపాయలు ఖర్చు చేశారని దుయ్యబట్టారు. అంతర్జాతీయ స్థాయిలో సమీకృత పాఠశాలలు అంటూ వందల కోట్లు దండుకునేందుకు టెండర్లు పిలిచిన కాంగ్రెస్ ప్రభుత్వం.. ఉన్న గురుకులాలు, విశ్వవిద్యాలయాల్లో భోజనం పెట్టకుండా విద్యార్థులను గోస పెడుతోందని పేర్కొన్నారు. విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేస్తూ భావి తెలంగాణ భవిష్యత్తును కాంగ్రెస్ ప్రభుత్వం బలిపెడుతోందని విమర్శించారు.

ఏడాదిన్నర కాలంలో లక్ష కోట్లు ఖర్చుపెట్టాం

- సంక్షేమంలో రాజీ లేదు: మంత్రులు
- హుస్నాబాద్‌కు పొన్నం, తుమ్మల, కోమటిరెడ్డి, దామోదర..
- నర్మెట్ట ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ పరిశీలన



హుస్నాబాద్‌లో ఫోర్‌లేన్ రహదారి పనులకు శంకుస్థాపన చేసిన మంత్రులు కోమటిరెడ్డి, తుమ్మల, దామోదర, పొన్నం

సిద్దిపేట, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ విధ్వంసాలతో ఏడాదిన్నరగా ఆర్థిక కష్టాలు వెంటాడుతున్నా.. సంక్షేమం, అభివృద్ధి విషయంలో రాజీపడకుండా పని చేస్తున్నామని మంత్రులు అన్నారు. అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రైతుల కోసం లక్ష కోట్ల రూపాయలు ఖర్చు చేశామని వారు పునరుద్ఘాటించారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లో మంత్రులు పొన్నం ప్రభాకర్, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, దామోదర రాజనర్సింహ, తుమ్మల నాగేశ్వర రావు పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన సభలో మంత్రి తుమ్మల మాట్లాడుతూ.. నర్మెటలో 300 కోట్లతో నిర్మిస్తున్న పామాయిల్ ఫ్యాక్టరీని ఆగస్టులో సీఎం చేతుల మీదుగా ప్రారంభింపజేస్తామని ప్రకటించారు. మరో మంత్రి దామోదర మాట్లాడుతూ 'సీసాలు, పైసల కోసం ఓట్లు అమ్ముకోవద్దని, మంచి నాయకుడిని ఎన్నుకుంటేనే మంచి భవిష్యత్తు ఉంటుందని' తెలిపారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ప్రసంగిస్తూ తెలంగాణ కోసం సోనియాగాంధీ కాంగ్రెస్ పార్టీనే త్యాగం చేశారని, అందుకే ఆంధ్రప్రదేశ్‌లో కనీసం వార్డుమెంబర్ కూడా లేదని అన్నారు. మంత్రి పొన్నం మాట్లాడుతూ తనను గెలిపించిన హుస్నాబాద్ ప్రజల గౌరవాన్ని పెంచడానికి కృషి చేస్తున్నానని తెలిపారు. ఆనాడు నక్సలైట్లకు ఆ తర్వాత కమ్యూనిస్టులకు కేంద్రంగా ఉన్న జిల్లా ఇప్పుడు కాంగ్రెస్‌కు కేరాఫ్ అడ్రస్‌గా మారిందని అన్నారు. మంత్రి పొన్నంతో ఇతర మంత్రులు జరిపిన సరదా సంభాషణతో సభలో నవ్వులు విరబూశాయి. తన నియోజకవర్గానికి నిధులు మంజూరు చేయాలని పొన్నం మిగతా మంత్రులను పదేపదే చేతులెత్తి దండం పెడుతూ అడిగారు. దీంతో మంత్రి కోమటిరెడ్డి జోక్యం చేసుకుని తెలంగాణ ఉద్యమ సమయంలో సీఎంగా ఉన్న కిరణ్‌కుమార్‌రెడ్డి హెలికాప్టర్‌నే పేల్చివేస్తానని పొన్నం ప్రభాకర్ వార్నింగ్ ఇచ్చాడని గుర్తు చేశారు. 'నువ్వేదడిగితే అది ఇవ్వడానికి అందరం సిద్ధంగానే ఉన్నామని, నిధుల కోసం అడగడం కాదు.. ఆర్డర్ వేయాలని' నవ్వుతూ చెప్పారు.

మంత్రాలు చదివిన కలెక్టర్

మంత్రుల పర్యటనలో భాగంగా మాతా, శిశు ఆరోగ్య కేంద్ర ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న సిద్దిపేట కలెక్టర్ హైమవతి మంత్రాలు చదివి ఆకట్టుకున్నారు. ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభించాలని కలెక్టర్‌కు సూచించగా, ఆమె మంత్రాలు చదువుతూ రిబ్బన్ కట్ చేశారు. దీంతో మంత్రాలు బాగా చదివారంటూ మంత్రులు కలెక్టర్‌కు కితాబునిచ్చారు.

దక్షిణ భారత రైతులంటే కేంద్రానికి చిన్నచూపు: తుమ్మల

దక్షిణ భారత రైతులంటే కేంద్ర ప్రభుత్వానికి మొదటి నుంచి చిన్న చూపేనని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. కేంద్రం రూ.లక్ష కోట్లు పెట్టి ఆయిల్‌పామ్ దిగుమతి చేసుకునే బదులు తెలంగాణ రైతులకు సహకరిస్తే ఆ లక్ష కోట్ల మారక ద్రవ్యాన్ని నిలుపుకోవచ్చని చెప్పారు. ఆయిల్‌పామ్ పంటకు కనీసం రూ.25 వేల మద్దతు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం నర్మెట్టలో నిర్మిస్తున్న ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ నిర్మాణ పనులను మంత్రులతో కలిసి పరిశీలించారు. అనంతరం తుమ్మల మాట్లాడుతూ.. ఉత్తర భారతదేశంలో ఆయిల్‌పామ్ సాగు లేదని, తెలంగాణలోనే ఎక్కువ ఉత్పత్తవుతుందని చెప్పారు. ఆయిల్‌పామ్‌పై దిగుమతి సుంకాన్ని తొలుత 27 శాతం పెంచిన కేంద్రం ఆ తర్వాత దానిని 10 శాతానికి తగ్గించడం వల్ల రైతులు బాధపడుతున్నారని తెలిపారు. కేంద్రం పునరాలోచించి ఈ విషయంలో రైతులకు లాభం జరిగేలా చూడాలన్నారు.

డిమాండ్‌కు తగ్గట్టుగా విద్యుదుత్పత్తి ఉండాలి

- అధికారులతో డిప్యూటీ సీఎం భట్టి సమీక్ష
- ఫ్లోటింగ్ సోలార్ కోసం సమన్వయ కమిటీని ఏర్పాటుచేయాలని సూచన



హైదరాబాద్, జూన్ 27(ఆంధ్రజ్యోతి): రాబోయే ఐదు, పదేళ్ల కాలంలో విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా విద్యుత్ ఉత్పత్తికి అవసరమైన ప్రణాళికలు చేసుకొని ముందుకెళ్లాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. ప్రజాభవన్‌లో శుక్రవారం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కొత్త పరిశ్రమల రాక, ప్రజల జీవన ప్రమాణాల మెరుగుదలతో విద్యుత్ వినియోగం గణనీయంగా పెరుగుతోందన్నారు. 2035నాటికి థర్మల్ విద్యుత్తుకు ఉండే డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకుని 50 ఏళ్ల కిందట కట్టిన రామగుండం, కేటీపీఎస్ థర్మల్ పవర్ స్టేషన్ల స్థానంలో కొత్తవాటిని నిర్మించడానికి ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. కొత్తగూడెం, రామగుండంలో కాలం చెల్లిన ప్లాంట్ల స్థానంలో 800మెగావాట్ల చొప్పున నూతన థర్మల్ ప్లాంట్లను నిర్మించే అవకాశం ఉందన్నారు. థర్మల్ ప్లాంట్లన్నీ జెన్‌కో ఆధ్వర్యంలోనే ఏర్పాటు చేయాలనే యోచనలో ఉన్నామని, ఈ నేపథ్యంలో నూతన డైరెక్టర్లు అందుకు తగిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. గృహ జ్యోతి, ఇందిరమ్మ ఇళ్లపై రూఫ్ టాప్ సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేసి, ఆయా వర్గాలకు ఆదాయంతో పాటు సోలార్ విద్యుత్ అందించడానికి ప్రణాళికలు రూపొందించాలన్నారు. నీటిపై తేలియాడే విద్యుత్ ప్లాంట్ల కోసం నీటిపారుదలశాఖ, జెన్‌కోతో సమన్వయం చేసుకోవడానికి ఒక బృందాన్ని ఏర్పాటు చేయాలని సూచించారు.

బీఆర్ఎస్ వల్లే 'బనకచర్ల' గొడవ

- కమీషన్ల కోసమే గోదావరిపై కాళేశ్వరం నిర్మాణం: మంత్రి ఉత్తమ్



పాలకవీడు, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): బనకచర్ల ప్రాజెక్టు వివాదానికి బీఆర్ఎస్సే కారణమని భారీ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. తెలంగాణకు న్యాయం జరిగేదాకా ఆ ప్రాజెక్టుపై పోరాడతామని తెలిపారు. సూర్యాపేట జిల్లా పాలకవీడు మండలంలో రూ.350కోట్లతో చేపడుతున్న జాన్‌పహాడ్ జవహర్, బెట్టెతండా ఎత్తిపోతల పథకాల పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఉత్తమ్ మాట్లాడారు. కాళేశ్వరం ప్రాజెక్టు బదులుగా గోదావరిపై దేవాదుల, సీతారామ, సమ్మక్క సారక్క ప్రాజెక్టులను పూర్తి చేసి ఉంటే బనకచర్ల వివాదం ఉండేదికాదన్నారు. కాళేశ్వరం పేరుతో బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.లక్షల కోట్లు వృథా చేసిందని, అదే డబ్బును గోదావరిపై ఇతర ప్రాజెక్టులకు ఖర్చు చేస్తే రాష్ట్రం సస్యశామలం అయ్యేదని తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టు రైతుల ప్రయోజనాల కోసం కాదని, బీఆర్ఎస్ నేతల కమీషన్ల కోసమని విమర్శించారు. ఆ ప్రాజెక్టు మీద తెచ్చిన అప్పుకు ఏటా వడ్డీల రూపంలో రూ.16వేల కోట్లు కడుతున్నామని తెలిపారు. బీఆర్ఎస్ హయాంలో జరిగిన అప్పులను, తప్పులను సరిచేస్తున్నామని చెప్పారు. ఉమ్మడి ఏపీలో కృష్ణా నీటిని 811 టీఎంసీలు కేటాయిస్తే.. అందులో ఏపీకి 512 టీఎంసీలు, తెలంగాణకు 299 టీఎంసీలు సరిపోతాయని అప్పటి నీటి పారుదల మంత్రి హరీశ్ లిఖితపూర్వకంగా కేంద్రానికి తెలియజేశారని గుర్తు చేశారు. కృష్ణా, గోదావరి నీటి వాటాలో తెలంగాణకు న్యాయం జరిగేదాకా పోరాడతామని అన్నారు.

చిత్రజ్యోతి
★ SINCE 1965 ★


గర్జన వినడానికి కాదు.. భయపెట్టడానికి!



సాంప్రదాయక చీర, ముక్కు పుడక, ఇతర ఆభరణాలతో గోండు యువతిగా రష్మిక కనిపించే కొత్త చిత్రం 'మైసా'. దర్శకుడు హను రాఘవపూడి శిష్యుడు రవీంద్ర పుల్లే ఈ సినిమాతో దర్శకుడిగా పరిచయమవుతున్నారు. అజయ్, అనిల్ సయ్యపురెడ్డి నిర్మిస్తున్న ఈ చిత్రం ఫస్ట్ లుక్, పోస్టర్‌ను దర్శకుడు హను రాఘవపూడి విడుదల చేశారు. తమిళ పోస్టర్‌ను తమిళ హీరో ధనుష్, మలయాళ పోస్టర్‌ను దుల్కర్ సల్మాన్, కన్నడ పోస్టర్‌ను శివరాజ్ కుమార్, హిందీ పోస్టర్‌ను విక్కీ కౌశల్ విడుదల చేశారు. వీరందరూ రష్మికకు శుభాకాంక్షలు తెలిపారు. ఇంతకు ముందెన్నడూ చూడని విధంగా ముఖాన రక్తపు మరకలు, చేతిలో ఆయుధంతో కొత్తగా కనిపించారు రష్మిక. 'ఓర్పు ఆమె ఆయుధం. ఆమె గర్జన వినడానికి కాదు.. భయపెట్టడానికి' అని చిత్ర నిర్మాణ సంస్థ పేర్కొంది. టైటిల్, ఆమె లుక్.. ప్రాజెక్ట్ మీద అంచనాలు పెంచాయి. 'రెండేళ్ల కష్టానికి రూపం 'మైసా' చిత్రం. గోండు తెగల ప్రపంచం ఆధారంగా ఎమోషనల్ యాక్షన్ థ్రిల్లర్‌గా ఈ సినిమా ఉంటుంది' అని దర్శకుడు చెప్పారు.

జూనియర్.. నో ఫియర్!

● హీరోగా గాలి జనార్ధన రెడ్డి కుమారుడు



ప్రముఖ రాజకీయ నాయకుడు, వ్యాపారవేత్త గాలి జనార్ధన రెడ్డి కుమారుడు కిరీటి రెడ్డి హీరోగా ఎంట్రీ ఇస్తున్న చిత్రం 'జూనియర్'. యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్‌గా రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రాన్ని రాధాకృష్ణ దర్శకత్వంలో రజని కొర్రపాటి నిర్మిస్తున్నారు. ఈ సినిమా టీజర్‌ను శుక్రవారం విడుదల చేశారు. ఇందులో 'జూనియర్.. నో ఫియర్' అనిపించే హుషారైన కాలేజీ కుర్రాడిగా కిరీటి కనిపించారు. తన చుట్టూ ఉన్న వారిని ఆకర్షించే వ్యక్తిత్వం ఉన్న ఈ యువకుడు శ్రీలీలను ఇష్టపడతాడు. గొడవతో మొదలైన వారి జర్నీ క్రమంగా ఎట్రాక్టివ్ కెమిస్ట్రీగా మారుతుంది. ఈ టీజర్‌లో కిరీటి అదరగొట్టాడనే చెప్పాలి. తన డ్యాన్స్, స్టంట్స్, స్పాట్ ఆన్ కామిక్ టైమింగ్ అద్భుతంగా ఉన్నాయి. అలాగే కిరీటి చెప్పిన డైలాగులు ఆకట్టుకున్నాయి. ఈ సినిమాలో శ్రీలీల కథానాయికగా నటిస్తున్నారు. టీజర్ చివరిలో బాస్ పాత్రలో జెనీలియా డిసౌజా కనిపించడం ఆసక్తికరం. అలాగే హాస్య పాత్రలో వైవా హర్ష కనిపించారు. కె.కె.సెంథిల్ కుమార్ సినిమాటోగ్రఫీ గ్రాండ్ విజువల్స్‌తో అద్భుతంగా ఉంది. అలాగే దేవిశ్రీప్రసాద్ సంగీతం కూడా అలరించింది. తెలుగు, కన్నడ, తమిళ, మలయాళ, హిందీలో భాషల్లో జులై 18న గ్రాండ్‌గా 'జూనియర్' విడుదల కానుంది.

కావాల్సినంత వినోదం



హవీష్, కావ్య థాపర్ జంటగా నక్కిన త్రినాధరావు దర్శకత్వంలో తెరకెక్కుతోన్న కుటుంబ కథా చిత్రం 'నేను రెడీ'. హార్నిక్స్ ఇండియా ఎల్ఎల్‌పీ బేనర్‌పై నిఖిల కోనేరు నిర్మిస్తున్నారు. తాజాగా ఈ చిత్రానికి సంబంధించిన టైటిల్, గ్లింప్స్‌ను చిత్రబృందం విడుదల చేసింది. హీరో హవీష్ మాట్లాడుతూ 'త్రినాధరావు అన్ని సినిమాల్లో కంటే ఇది బెస్ట్ స్క్రిప్ట్ అవుతుంది. మిక్కీ మ్యూజిక్, నిజార్ విజువల్స్ అద్భుతంగా ఉంటాయి' అని అన్నారు. హీరోయిన్ కావ్య థాపర్ మాట్లాడుతూ 'ఈ రోజు మేము చూపించింది చిన్న గ్లింప్స్ మాత్రమే. సినిమాలో మీకు కావాల్సినంత వినోదం ఉంది. అన్ని వర్గాల ప్రేక్షకుల్ని ఆకట్టుకునే చిత్రమిది' అని అన్నారు. చిత్రదర్శకుడు త్రినాధరావు మాట్లాడుతూ 'అప్పట్లో 'పెళ్లిసందడి' సినిమాలో ఇండస్ట్రీలోని హాస్య నటులంతా నటించారని విన్నాం. ఈ సినిమా కూడా ఫ్రేమ్ నిండా ఆర్టిస్టులతో కళకళగా ఉంటుంది' అని అన్నారు. నిర్మాత నిఖిల కోనేరు మాట్లాడుతూ 'నా మొదటి చిత్రాన్ని త్రినాధరావు లాంటి పెద్ద దర్శకుడితో తీయడం చాలా ఆనందంగా ఉంది' అని అన్నారు.

కమల్ హాసన్‌కు అరుదైన గౌరవం

● ఆస్కార్ కమిటీ ఆహ్వానం



ప్రపంచ చిత్రపరిశ్రమలో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా భావించే ఆస్కార్ అకాడెమీలో కోలీవుడ్ అగ్ర నటుడు కమల్ హాసన్‌కు అరుదైన గౌరవం లభించింది. ఆస్కార్ అకాడెమీలో సభ్యులుగా చేరాలంటూ కమల్ హాసన్‌తో పాటు పలువురు భారతీయ ప్రముఖ నటీనటులకు ఆహ్వానం లభించింది. ఈ మేరకు 'ది అకాడెమీ ఆఫ్ మోషన్ పిక్చర్ ఆర్ట్స్ అండ్ సైన్సెస్' తాజాగా విడుదల చేసిన కొత్త సభ్యుల జాబితాలో కమల్ హాసన్ పేరు ఉంది. ఎంతో మంది హాలీవుడ్ నటీనటులతో పాటు ఆస్కార్ ఓటింగ్ ప్రక్రియలో కమల్ హాసన్ పాలుపంచుకోనున్నారు. ఆస్కార్‌కు నామినేట్ అయ్యే చిత్రాల్లో ఫైనల్ ఎంపిక ప్రక్రియలో వీరికి ఓటు వేసే అవకాశాన్ని కల్పిస్తుంది. కాగా, ఈ ఏడాది మొత్తం 534 మంది సభ్యులను ఆహ్వానించినట్టు అకాడెమీ తెలిపింది. ప్రతిభావంతులైన వీరికి అకాడెమీలో చోటు కల్పించడం ఎంతో ఆనందంగా ఉందని పేర్కొంది.

చెన్నై (ఆంధ్రజ్యోతి)

మా అన్న ఇంత బాగా చేస్తాడనుకోలేదు

- మంచు మనోజ్



మనోజ్ తన సోదరుడు విష్ణును పొగడడం మంచు అభిమానులను సంభ్రమాశ్చర్యాలకు గురిచేసింది. విష్ణు ప్రధాన పాత్రలో నటించిన 'కన్నప్ప' చిత్రం శుక్రవారం విడుదలైంది. మనోజ్ ఈ సినిమాను థియేటర్‌లో చూశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ 'సినిమా చాలా బాగుంది. నేను అనుకున్న దాని కంటే వెయ్యి రెట్లు బాగా వచ్చింది. చివరి 20 నిమిషాలు అదిరిపోయింది. ప్రభాస్ యాక్టింగ్ అదిరింది. మా అన్న కూడా ఇంత బాగాచేస్తాడనుకోలేదు. ఈ సినిమా ఘన విజయాన్ని అందుకోవాలని దేవుడిని ప్రార్థిస్తున్నా' అని అన్నారు. కాగా, గత కొన్ని రోజులుగా మంచు కుటుంబంలో నెలకొన్న కలహాలు తెలిసిందే. ఈ క్రమంలో సినిమా విడుదలకు ఒక రోజు ముందు 'కన్నప్ప' చిత్రబృందానికి ఆల్ ద బెస్ట్ చెబుతూ మనోజ్ ట్వీట్ చేశారు. ఇందులో విష్ణు పేరును ప్రస్తావించకపోవడం గమనార్హం. అయితే సినిమా చూసిన తర్వాత తన అన్న విష్ణును మనోజ్ మెచ్చుకోవడంతో ఫ్యామిలీ అంతా మళ్లీ ఒక్కటయ్యే సమయం ఆసన్నమవుతోంది అంటూ మంచు అభిమానులు సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తున్నారు.

ఇందిరమ్మ ఇళ్ల బిల్లులు రాకుంటే
నా ఇల్లు అమ్మి చెల్లిస్తా: వాకిటి శ్రీహరి



మక్తల్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు బిల్లుల విషయంలో ఎలాంటి అనుమానం అవసరం లేదని.. బిల్లులు రాకుంటే తన ఇల్లు అమ్మి అయినా చెల్లిస్తానని తెలంగాణ క్రీడలు, యువజన, మత్స్య, పశు సంవర్థక శాఖల మంత్రి వాకిటి శ్రీహరి చెప్పారు. శుక్రవారం ఆయన నారాయణపేట జిల్లా మక్తల్‌లోని ఓ ఫంక్షన్‌హాల్‌లో జరిగిన కార్యక్రమంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ అందించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడారు. మక్తల్ మున్సిపాలిటీకి 291 ఇళ్లు మంజూరు అయ్యాయని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 18 నెలల్లోనే ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ అందిస్తోందని వివరించారు. తమది చేతల ప్రభుత్వమని, పేదలకు అండగా ఉంటామని చెప్పారు. రాబోయే రోజుల్లో రూ.500 కోట్లతో మక్తల్ నియోజకవర్గ రూపురేఖలు మార్చుతానని పేర్కొన్నారు.

గిగ్ వర్కర్ల కోసం త్వరలో చట్టం: వివేక్

హైదరాబాద్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): గిగ్ వర్కర్ల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని, గిగ్ వర్కర్ల సంక్షేమం కోసం త్వరలో ఓ చట్టాన్ని తీసుకువస్తామని రాష్ట్ర గనులు, కార్మిక, ఉపాధి కల్పన శాఖల మంత్రి జి.వివేక్ వెంకటస్వామి తెలిపారు. గిగ్ వర్కర్ల నమోదు, వారి సమస్యల పరిష్కారం, సంక్షేమ కార్యక్రమాల అమలుకు ప్రత్యేకంగా ఓ బోర్డు ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఆన్‌లైన్ బిజినెస్ సంస్థల ప్రతినిధులు, గిగ్ వర్కర్లతో మంత్రి వివేక్ సమావేశమయ్యారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో దాదాపు నాలుగన్నర లక్షల మంది జొమాటో, స్విగ్గీ, బ్లింకిట్ వంటి ఆన్‌లైన్ బిజినెస్ సంస్థల్లో గిగ్ వర్కర్లుగా పని చేస్తున్నారని చెప్పారు. రాష్ట్రంలోని గిగ్ వర్కర్ల కోసం ఓ చట్టాన్ని తీసుకువస్తున్నామని, ఇందుకు సంబంధించి ముసాయిదా ఇప్పటికే సిద్ధమైందని చెప్పారు. కనీస వేతన అంశంతోపాటు మరికొన్ని డిమాండ్లను శుక్రవారం నాటి భేటీలో గిగ్ వర్కర్లు ప్రభుత్వం దృష్టికి తెచ్చారని తెలిపారు. వీటన్నింటినీ పరిగణనలోకి తీసుకుని దేశానికే ఆదర్శంగా నిలిచేలా గిగ్‌వర్కర్ల కోసం చట్టాన్ని తీసుకువస్తానమి వివేక్ వివరించారు. త్వరలో జరిగే క్యాబినెట్ సమావేశంలో ఈ చట్టం ముసాయిదాను మంత్రిమండలి ముందు ఉంచుతామని తెలిపారు.

మున్సిపల్ ఎన్నికలు ఎప్పుడు నిర్వహిస్తారు?

- 11లోగా సమాధానం ఇవ్వండి
- ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశాలు

హైదరాబాద్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ ఎన్నికలు ఎప్పటిలోగా నిర్వహిస్తారో చెప్పాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ప్రశ్నించింది. ఎన్నికల నిర్వహణపై వచ్చేనెల 11 నాటికి వివరణ ఇవ్వాలని సూచించింది. నిర్మల్ మున్సిపాల్టీకి ఎన్నికలు నిర్వహించకపోవడాన్ని సవాల్ చేస్తూ ఎస్పీ రాజేందర్ అనే వ్యక్తి పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ బీ విజయ్‌సేన్‌రెడ్డి ధర్మాసనం విచారణ చేపట్టింది. మున్సిపల్ ఎన్నికల నిర్వహణలో ఆలస్యానికి కారణం ఏమిటని ప్రభుత్వ న్యాయవాదిని ప్రశ్నించింది. ప్రభుత్వం వివరణ తెలుసుకుని చెప్పడానికి సమయం కావాలని కోరడంతో విచారణను జూలై 11కు వాయిదా వేసింది.

జస్టిస్ రాధారాణికి ఘనంగా వీడ్కోలు

- కుల వ్యవస్థపై పోరాడారని ప్రశంసలు

హైదరాబాద్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): హైకోర్టు న్యాయమూర్తిగా పదవీవిరమణ చేసిన జస్టిస్ జి. రాధారాణికి హైకోర్టు న్యాయమూర్తులు, న్యాయవాదులు శుక్రవారం ఘనంగా వీడ్కోలు పలికారు. మొదటి కోర్టు హాల్‌లో జరిగిన ఫుల్ కోర్టు సమావేశంలో జస్టిస్ రాధారాణి చేసిన సేవలను తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజోయ్‌పాల్, అడ్వకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి కొనియాడారు. ఒక నాస్తికురాలిగా కులవివక్ష, కుల వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడారని గుర్తు చేశారు. కులం అనే వ్యవస్థ వల్లే సమాజంలో వివక్ష, అసమానతలు పెరిగిపోతున్నాయని నమ్మి పోరాటం చేశారని పేర్కొన్నారు. జిల్లా జడ్జిగా సైతం అనేక సంస్కరణలను చేపట్టారని తెలిపారు. హైకోర్టు జడ్జిగా ఐదువేలకు పైగా కేసులు పరిష్కరించడంతోపాటు కీలక తీర్పులు వెలువరించారని పేర్కొన్నారు. జస్టిస్ రాధారాణి మాట్లాడుతూ తన జీవితంలో ఎదురైన సవాళ్లను మెట్లుగా మలుచుకున్నట్లు పేర్కొన్నారు. తన తండ్రి పెద్దగా చదువుకోకపోయినా గొప్ప హేతువాది అని, తనకు, తన సోదరునికి కులాంతర వివాహాలు చేశారని పేర్కొన్నారు. అనంతరం హైకోర్టు బార్ అసోసియేషన్‌లో జరిగిన కార్యక్రమంలో జస్టిస్ రాధారాణి, సీఎల్ఎన్ గాంధీ దంపతులను సత్కరించారు.

అధిక వడ్డీ పేరుతో
రూ.కోట్ల వసూళ్లు !

- ఏజెంట్లకు కమీషన్లు, నజరానాలు
- గిరిజనుల నుంచి భారీగా డబ్బు సేకరణ
- ఓ ప్రైవేటు వ్యాపారంపై నల్లగొండ జిల్లా కలెక్టర్‌కు డీఏపీఎఫ్ఏజీ సంస్థ ఫిర్యాదు

నల్లగొండ, జూన్ 27(ఆంధ్రజ్యోతిప్రతినిధి): అధిక వడ్డీలు ఆశ చూపి గిరిజనుల నుంచి కోట్ల రూపాయల డబ్బు అప్పుగా తీసుకుంటూ భారీ స్థాయిలో వ్యాపారం చేస్తోన్న ఓ వ్యక్తిపై నల్లగొండ జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు అందింది. దేవరకొండ ఏరియా పబ్లిక్ ఫ్రాడ్ అవేర్‌నెస్ గ్రూప్ (డీఏపీఎఫ్ఏజీ) అనే స్వచ్ఛంద సంస్థ ఈ ఫిర్యాదు చేసింది. ఆర్‌బీఐ నిబంధనలు పాటించకుండా ఏజెంట్ల సాయంతో డబ్బు వసూలు చేస్తోన్న నల్లగొండ జిల్లా పెద్దఅడిశర్లపల్లి మండలం పలుగుతండాకు చెందిన రమావత్ బాలాజీపై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని కోరింది. రమావత్ బాలాజీ ప్రజల నుంచి దాదాపు రూ.1000 కోట్లు సేకరించాడని డీఏపీఎఫ్ఏజీ తన ఫిర్యాదులో పేర్కొంది. ఈ ఫిర్యాదుకు స్పందించిన జిల్లా కలెక్టర్ ఇలాత్రిపాఠి.. ఈ వ్యవహారంపై విచారణ చేపట్టాలని ఎస్పీ శరత్‌చంద్రపవార్‌ను, ఆదాయ పన్ను శాఖ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు రమావత్ బాలాజీని అదుపులోకి తీసుకున్న పోలీసులు రహస్య ప్రదేశంలో విచారణ చేస్తున్నట్టు తెలిసింది.


ఏజెంట్ వ్యవస్థ.. సకాలంలో వడ్డీ చెల్లింపులు

స్థానికుల కథనం ప్రకారం.. రమావత్ బాలాజీ హైదరాబాద్‌లో ఉంటూ నాలుగు నెలలుగా ఈ వ్యాపారం చేస్తున్నాడు. చేపల వ్యాపారైన తండ్రి రమావత్ జబ్బార్ సొంత తండాలో పలుకుబడి కలిగిన వ్యక్తి కావడంతో బాలాజీ నగదు సేకరణ సులువుగానే చేపట్టాడు. క్రమంగా దాదాపు 15 మంది ఏజెంట్లను ఏర్పాటు చేసుకుని... పీఏపల్లి, చందంపేట, కొండమల్లేపల్లి, మిర్యాలగూడ, దేవరకొండ, తిరుమలగిరిసాగర్ ప్రాంతాల్లో ఉండే గిరిజనులు, ఇతరుల నుంచి డబ్బులు సేకరిస్తున్నాడు. తనకు డబ్బు ఇచ్చిన వారికి నెలకు పది శాతం వడ్డీ ఇస్తాడు. ఆయా వడ్డీలను నెలనెలా క్రమం తప్పకుండా చెల్లిస్తున్నాడు. దీంతో బాలాజీకి డబ్బు ఇచ్చేందుకు చాలా మంది ముందుకొస్తున్నారు. బాలాజీ ఇలా రూ.కోట్లలో డబ్బు సేకరించాడని చెబుతున్నారు. ఖాతాదారులను తీసుకొచ్చిన ఏజెంట్లకు బాలాజీ 6 శాతం కమీషన్ ఇస్తాడని, పెద్ద మొత్తంలో పెట్టుబడులు తెచ్చిన వారికి అదనంగా నజరానాలు కూడా ఇస్తుంటాడని చెబుతున్నారు. రూ.2 కోట్ల వరకు పెట్టుబడి తెచ్చిన ఏజెంట్‌కు స్విఫ్ట్ కారు, రూ.కోటి పెట్టుబడి తెచ్చిన వారికి రూ.1లక్ష విలువైన బైక్ ఇచ్చినట్టు సమాచారం. దీంతో ఏజెంట్లు కూడా పోటీ పడి నగదు సేకరణ చేపడుతున్నారు. కాగా, బాలాజీ విలాసవంతమైన జీవితం గడుపుతున్నాడని, రాజకీయాల్లోకి రావాలనే ఆలోచనలో కూడా ఉన్నట్టు పోలీసులు దర్యాప్తులో తేలినట్టు తెలిసింది. ఫిర్యాదు, విచారణ వ్యవహారం బయటికి రావడంతో బాలాజీని నమ్మి డబ్బు ఇచ్చిన పలువురు నల్లగొండ ఎస్పీ కార్యాలయానికి వచ్చి ఆరా తీస్తున్నారు. అయితే, పూర్తి స్పష్టత వచ్చిన తర్వాతే పోలీసులు వివరాలు వెల్లడించాలని నిర్ణయించినట్టు తెలిసింది. కాగా, ఈ వ్యవహారంపై వివరణ కోసం జిల్లా ఎస్పీ శరత్‌చంద్రపవార్‌ను 'ఆంధ్రజ్యోతి' సంప్రదించే ప్రయత్నం చేయగా అందుబాటులోకి రాలేదు.

ట్యాపింగ్ ద్వారా రూ.13 కోట్ల
ఎలక్టోరల్ బాండ్లు!

నా స్నేహితుడిని బెదిరించి వసూలు చేశారు.. పార్టీని వదిలేశాక నా ఫోన్ ట్యాపింగ్

- నా భార్య సంగీత ఫోన్ కూడా ట్యాప్ చేశారు
- పోలీసులు ఇంట్లో జొరబడి లైవ్ బగ్ పెట్టారు
- నాటి డీజీపీ మహేందర్‌రెడ్డి హస్తం ఉంది
- బీజేపీ ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి ఆరోపణ
- ఫోన్ ట్యాపింగ్‌పై సిట్ ముందు వాంగ్మూలం
- నక్సలైట్ పేరుతో నన్ను ట్యాప్ చేశారు: రఘునందన్



సిట్ ఆఫీసు ప్రాంగణంలో ఎంపీ కొండా విశ్వేశ్వరరావు

హైదరాబాద్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): కేసీఆర్ ప్రభుత్వం తన ఫోన్ ట్యాపింగ్ చేయడమే కాకుండా తన ఇంట్లో బగ్ కూడా పెట్టి ఇంట్లో ఏం జరుగుతుందో లైవ్ సంభాషణ విన్నదని బీజేపీ నేత, చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అనుమానం వ్యక్తం చేశారు. తన ఆఫీసుకు వారంట్ లేకుండా కొందరు పోలీసు అధికారులు వచ్చి, దౌర్జన్యం చేశారని, అప్పటి నుంచి తన ఇంట్లో సంభాషణలు లైవ్ రికార్డు చేశారని చెప్పారు. తనపై ట్యాపింగ్ వ్యవహారం వెనుక నాటి డీజీపీ మహేందర్‌రెడ్డి హస్తం ఉందని ఆరోపించారు. శుక్రవారం ఆయన సిట్ ఆఫీసుకు 11.45 ప్రాంతంలో వచ్చారు. ఆయన ఫోన్ ట్యాపింగ్ అయిన విషయాన్ని సిట్ అధికారులు వివరించారు. ఆయన వాంగ్మూలాన్ని నమోదు చేశారు. అనంతరం కొండా బయటకు వచ్చి మీడియాతో మాట్లాడారు. నాటి బీఆర్ఎస్ ప్రభుత్వంపై ఘాటు విమర్శలు చేశారు. 2018లో బీఆర్ఎస్ నుంచి బయటకు వచ్చినప్పటి నుంచి తన ఫోన్, భార్య సంగీత ఫోన్ ట్యాపింగ్ చేశారని తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వం రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజల్లో వ్యతిరేకత వచ్చిందని, దీంతో అభద్రతా భావంతో ఎడాపెడా ట్యాపింగ్‌కు పాల్పడ్డారని ఆరోపించారు. ముఖ్యంగా మునుగోడు, దుబ్బాక, హుజురాబాద్ ఉప ఎన్నికల సమయంలో పోలీసులు తన ఫోన్‌ను ట్యాపింగ్ చేశారన్నారు. ఎన్నికల సమయాల్లో తనతోపాటు తన ప్రధాన అనుచరుల ఫోన్లు ట్యాపింగ్ చేయించారని చెప్పారు. ఎన్నికల సమయంలో తన స్నేహితుడి వద్ద రూ.72 కోట్లు పట్టుకుని అది తన డబ్బుగా చెప్పాలని బెదిరించారని ఆరోపించారు. అదే విధంగా తాను భూమి అమ్మగా కొనుగోలు చేసిన వ్యక్తి డబ్బులు చెల్లించాడని, ఫోన్ ట్యాపింగ్ ద్వారా పోలీసులు విషయం తెలుసుకొని, ఆయన్ని బెదిరించి ఒక రాజకీయ పార్టీకి రూ.13 కోట్ల ఎలక్టోరల్ బాండ్లు రాయించారని చెప్పారు. ఈటెల రాజేందర్‌కు తాను డబ్బు ఇచ్చినట్లుగా నిందలు మోపారని, తాను ఈటెలకు డబ్బు ఇవ్వలేదని, మద్దతు మాత్రమే ఇచ్చానని తెలిపారు. తన ఫోన్లను చట్ట విరుద్ధంగా ట్యాప్ చేయడమే కాకుండా ఇలా జరుగుతోందని ఫిర్యాదు చేస్తే వేరే వ్యవహారాల్లో నాన్ బెయిల్‌బుల్ కేసులు పెట్టి ఇబ్బందుల పాలు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభాకర్‌రావుతో పాటు ఈ కేసులో బాధ్యులైన అందర్నీ కఠినంగా శిక్షించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ అంశాన్ని పార్లమెంటులో కూడా ప్రస్తావిస్తానని చెప్పారు.

రఘునందన్ వాంగ్మూలం తీసుకున్న సిట్

సిట్ అధికారులు ఎంపీ రఘునందన్ వాంగ్మూలం కూడా తీసుకున్నారు. కాలుకి స్వల్ప గాయంతో యశోదా ఆసుపత్రిలో చికిత్స తీసుకుంటున్న రఘునందన్ వద్దకు సిట్ అధికారులు శుక్రవారం రాత్రి వచ్చి స్టేట్‌మెంట్ తీసుకున్నారు. అంతకుముందు రఘునందన్, బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మాట్లాడిన సందర్భంగా సిట్‌పై విమర్శలు చేశారు. 2020 నవంబరులో జరిగిన దుబ్బాక ఉప ఎన్నిక సమయంలో ఫోన్ ట్యాపింగ్ పంచాయతీ మొదలైందని, అప్పటి డీజీపీకి పదిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని విమర్శించారు. తనతో పాటు తన కుటుంబ సభ్యుల ఫోన్‌లు కూడా ట్యాప్ చేశారన్నారు. గాంధీభవన్‌లోని కాంగ్రెస్ సోషల్ మీడియాకు కూడా నోటీసులిస్తూ తనకు ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. ఈ నేపథ్యంలోనే సిట్ రఘునందన్ వాంగ్మూలం తీసుకుంది. రెండు గంటల పాటు ఆయన స్టేట్‌మెంట్ నమోదు చేసుకుంది. ఉదయం పార్టీ కార్యాలయంలో మాట్లాడినపుడు రఘునందన్ సిట్‌కు చిత్తశుద్ధి లేదని, ఉంటే నిందితులను రిమాండ్ ఎందుకు చేయరని ప్రశ్నించారు. మాజీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి సిట్‌కు ఇచ్చిన 615 ఫోన్ నెంబర్‌ల వివరాలను బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. ఒక నక్సలైట్ నాయకుడి పేరు రాసి, దాని పక్కన తన ఫోన్ నంబర్ వేసి ట్యాపింగ్ కోసం పంపించారని రఘునందన్ ఆరోపించారు.

రేవంత్ సన్నిహితుడినని
నా ఫోన్ ట్యాపింగ్: దేవరాజు

కామారెడ్డిలో రేవంత్‌రెడ్డి పోటీ చేసినపుడు నియోజకవర్గ బాధ్యతలు తనకు అప్పగించారని, అప్పటి నుంచి బీఆర్ఎస్ ప్రభుత్వం తన ఫోన్లను ట్యాప్ చేయడం ప్రారంభించిందని కామారెడ్డి జిల్లా కాంగ్రెస్ లీగల్ సెల్ అధ్యక్షుడు దేవరాజు గౌడ్ తెలిపారు. తన ఫోన్ ట్యాప్ అయ్యిందని సిట్ అధికారులు తెలపడంతో దేవరాజు వాంగ్మూలం ఇవ్వడానికి వచ్చారు.

ఆ మెయిలే పట్టిచ్చింది!

(మొదటిపేజీ తరువాయి)

ఉండే ఒక నోడల్ అధికారితో డీల్ చేస్తుంది. ప్రతి పదిహేను రోజులకు ఒకసారి మీరు ఈ నెలలో అడిగిన ఫోన్ ట్యాపింగ్ నెంబర్లు ఇవీ, సరి చూసుకోండి అని టీఎస్‌పీల తరఫున నోడల్ ఆఫీసర్ ఎస్ఐబీకి మెయిల్ పంపించేవారు. ప్రభాకర్‌రావు టీం ఈ విషయాన్ని మర్చిపోయారు. ఆధారాలు ధ్వంసం కాగానే ప్రభాకర్‌రావు బృందం తమనెవరు గుర్తించలేదని అనుకున్నారు. ప్రణీత్‌రావు 2023 డిసెంబరు నాలుగో తేదీ రాత్రి ఎస్ఐబీ కార్యాలయానికి వెళ్లి సీసీ కెమేరాలు ఆఫ్ చేసి 17 కంప్యూటర్లలోని ఆధారాలను ధ్వంసం చేశారు. కొన్ని వేల పేజీల డేటాను బూడిద చేశారు. 42 హార్డ్ డిస్కులు తీసి వేసి కొత్త హార్డ్ డిస్కులు పెట్టారు. సమాచారం ఉన్న హార్డ్ డిస్కులను కట్టర్‌తో ముక్కలు చేసి మూసీలో పడేశారు. ఎస్ఐబీలో ప్రణీత్‌రావు అరాచకాన్ని తర్వాత కొన్ని నెలలకు ఎస్ఐబీ అధికారులు గుర్తించారు. 2024 మార్చి 10న పంజాగుట్ట పోలీసు స్టేషన్‌లో ఎస్ఐబీ అధికారులు ఫిర్యాదు చేశారు. పంజాగుట్ట పీఎస్‌లో కేసు నమోదు అయిన మర్నాడే ప్రభాకర్‌రావు అమెరికా వెళ్లిపోయారు. ఆధారాలు ధ్వంసం అయిన తర్వాత పంజాగుట్ట పోలీసులు కేసు నమోదు చేయడం, కేసు విచారణకు ప్రభుత్వం సిట్ ఏర్పాటు చేయడం జరిగింది. ఎస్ఐబీకి వచ్చిన సిట్ అధికారులు ఈ కేసులో ఎలా ముందుకెళ్లాలా అని ఆలోచిస్తున్న సమయంలో టీఎస్‌పీల నుంచి 2023 నవంబర్ నెలలో ఎస్ఐబీ పంపించిన ఫోన్ నెంబర్లకు సంబంధించిన మెయిల్ విషయం వారి దృష్టికి వచ్చింది. ఇదిగో మీరు పంపించిన నెంబర్లు ఇవీ అని 615 ఫోన్ నెంబర్లకు సంబంధించిన 15 రోజుల సమాచారం టీఎస్‌పీల నుంచి ఎస్ఐబీకి అందింది. దాంతో పోలీసు ఉన్నతాధికారులు ఈ కేసులో ముందుకెళ్లే దారి దొరికిందంటూ ఆయా నెంబర్లు ఎవరివి అని గుర్తించి ఒక్కొక్కరికి ఫోన్ చేసి మీ ఫోన్ ట్యాపింగ్ జరిగిందంటూ చెబుతూ, బాధితుల వాంగ్మూలాలను నమోదు చేయడం ప్రారంభించారు. వేల నెంబర్లు ఫోన్ ట్యాపింగ్ జరిగిందని ఆరోపణలు వచ్చినప్పటికి ఆయా నెంబర్లకు సంబంధించిన ట్యాపింగ్ చేసిన రికార్డులు అన్నీ ధ్వంసం కావడంతో చివరకు మిగిలిన 615 ఫోన్ నెంబర్లు అసలు కథను విప్పనున్నాయని దర్యాప్తు అధికారులు అంతర్గత సంభాషణల్లో పేర్కొంటున్నారు. మావోయిస్టులతో సంబంధాలున్న వారి సమాచారం కోసమంటూ రివ్యూ కమిటీకి ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్‌రావు ద్వారా వెళ్లిన 615 నెంబర్లకు సంబంధించిన ఎక్కువ మంది మావోయిస్టుల కేసులతో ఎలాంటి సంబంధం లేనివారు ప్రజాప్రతినిధులు, ఇతర ప్రముఖులు కావడంతో దీన్నే ఆయుధంగా మార్చుకుని ప్రభాకర్‌రావు బృందం నేరాన్ని నిర్ధారించడానికి సిట్ ప్రయత్నిస్తోంది. ఈ క్రమంలోనే బాధితుల వద్ద నుంచి నమోదు చేస్తున్న వాంగ్మూలాలను సుప్రీంకోర్టు ముందుంచి ప్రభాకర్‌రావు బృందం చేసిన అక్రమ ట్యాపింగ్‌ను వివరించి, ఆయనకు సుప్రీంకోర్టు ఇచ్చిన మధ్యంతర ఉపశమనాన్ని రద్దు చేయిస్తామని సిట్ అధికారులు పేర్కొంటున్నారు. ఫోన్ ట్యాపింగ్ ఎవరు చేయించారు? ఎందుకు చేయించారు అనే విషయాలకు సంబంధించి ఇంకా పూర్తి స్థాయి లీడ్ అధికారులకు దొరకలేదని తెలుస్తోంది.

మావోయిస్టుల పేరిట రాధాకృష్ణ ఫోన్ ట్యాపింగ్

ఫోన్ ట్యాపింగ్ కేసుకు సంబంధించి ఏబీఎన్ ఆంధ్రజ్యోతి ఎండీ వేమూరి రాధాకృష్ణ వాంగ్మూలాన్ని సిట్ అధికారులు శుక్రవారం నమోదు చేశారు. శుక్రవారం ఉదయం పదకొండు గంటలకు రాధాకృష్ణ సిట్ కార్యాలయానికి వెళ్లారు. సిట్ దర్యాప్తు అధికారి, ఏసీపీ వెంకటగిరి ఫోన్ ట్యాపింగ్‌కు సంబంధించిన ఆధారాలను రాధాకృష్ణకు చూపించారు. నాటి ఎస్ఐబీ చీఫ్ ప్రభాకర్‌రావు మావోయిస్టుల సమాచారం కోసమంటూ రాధాకృష్ణ నెంబర్‌ను 2023 నవంబరులో రివ్యూ కమిటీకి పంపారు. నవంబరులో దాదాపు 15 రోజులు రాధాకృష్ణ ఫోన్ నెంబర్ ట్యాపింగ్ జరిగిందన్న విషయాన్ని సిట్ అధికారులు వివరించారు. ఫోన్ ట్యాపింగ్ జరిగినట్లు అనుమానం వచ్చిందా? అని రాధాకృష్ణను సిట్ అధికారులు అడిగినట్లు సమాచారం. దాదాపు గంటసేపు రాధాకృష్ణకు సిట్ అధికారి ఫోన్ ట్యాపింగ్ సమాచారాన్ని తెలియచేసి వాంగ్మూలాన్ని నమోదు చేసుకున్నారు.

ప్రభుత్వ కాలేజీల్లో
నత్తనడకన ఇంటర్ అడ్మిషన్లు!

హైదరాబాద్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి):ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో ప్రవేశాల ప్రక్రియ నత్తనడకన సాగుతోంది. ప్రవేశాలు పెంచాలని ఇంటర్ బోర్డు అధికారులు ప్రిన్సిపాళ్లను పదేపదే కోరుతున్నా.. క్షేత్రస్థాయిలో పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాల ప్రక్రియ ఈ నెల 12న ప్రారంభమైంది. రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 430 ప్రభుత్వ జూనియర్ కాలేజీలు ఉండగా.. 197 కాలేజీల్లో 100లోపు, 46 కాలేజీల్లో కేవలం 50లోపు అడ్మిషన్లు మాత్రమే నమోదయ్యాయి. మహబూబ్‌నగర్‌లోని ప్రభుత్వ జూనియర్ కాలేజీలో మాత్రమే 1030 కొత్త అడ్మిషన్లు వచ్చాయి. ఆ తర్వాత 877 ప్రవేశాలతో నాంపల్లిలోని ఎంఎఎం మహిళా మోడల్ జూనియర్ కాలేజీ ద్వితీయ స్థానంలో నిలిచింది. 824 అడ్మిషన్లతో హన్మకొండలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీ తృతీయస్థానంలో ఉంది. రాష్ట్ర వ్యాప్తంగా కేవలం 16 కాలేజీల్లో మాత్రమే 500కంటే ఎక్కువ అడ్మిషన్లు జరిగాయి.

ఫీజులపై కమిటీ

(మొదటిపేజీ తరువాయి)

ప్రకటించింది. కృత్రిమ మేధ (ఏఐ)వంటి కోర్సులు సాంకేతిక రంగంపై బలమైన ప్రభావం చూపుతున్న నేపథ్యంలో రాష్ట్రంలోని ఇంజనీరింగ్ కళాశాలలు ప్రపంచ స్థాయి ప్రమాణాలతో పోటీ పడేలా ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భావిస్తున్నారని సీఎం కార్యాలయం ఓ ప్రకటనలో తెలిపింది. మారుతున్న మార్కెట్ అవసరాలకు తగినట్లు కళాశాలలు ప్రభుత్వంతో సంప్రదింపులు జరుపుతూ ప్రణాళికబద్ధంగా ముందుకువెళ్లేలా వ్యవస్థను రూపొందిస్తామని పేర్కొంది. ఈ క్రమంలో రాష్ట్రంలోని ఇంజనీరింగ్ కళాశాలల్లో మెరుగైన వసతులు, బోధన సిబ్బంది, ల్యాబ్‌లు.. ఏఐసీటీఈ మార్గదర్శకాలకు అనుగుణంగా ఉండేలా చూడనున్నారు. ఫీజుల నిర్ణయానికి వీటినే ప్రాతిపదిక తీసుకోవాలని భావిస్తున్నట్టు ప్రభుత్వం తెలిపింది. ఫీజుల నిర్ణయానికి సంబంధించి ఇస్లామిక్ అకాడమీ ఆఫ్ ఎడ్యుకేషన్ వర్సెస్ కర్ణాటక, పీఏ ఇనాందార్ అండ్ అదర్స్ వర్సెస్ మహారాష్ట్ర కేసుల్లో... ఆయా కళాశాలల్లోని వసతులు, ల్యాబ్‌లు, లెక్చరర్లకు ఆ సంస్థ ఇచ్చే వేతనాలు, బోధన, బోధనేతర సిబ్బంది, కళాశాల భవిష్యత్తు ప్రణాళికలు, కళాశాల ప్రమాణాల పెంపునకు తీసుకుంటున్న నిర్ణయాలను ప్రతిపాదిక చేసుకోవాలని సుప్రీంకోర్టు పేర్కొంది. ఫీజుల నిర్ణయంలో సుప్రీంకోర్టు తీర్పులను పరిగణనలోకి తీసుకోవాలని రాష్ట్ర సర్కారు నిర్ణయించింది. ఇంజనీరింగ్ కళాశాలల్లో వసతులు, బోధన సిబ్బంది, ఇతర వ్యవహారాలపై గత ప్రభుత్వం విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ శాఖతో తనిఖీలు చేయించింది. ఆ శాఖ క్షేత్ర స్థాయిలో తనిఖీలు చేసి నివేదిక రూపొందించింది. కానీ గత ప్రభుత్వం ఆ నివేదికపై ఎలాంటి చర్య తీసుకోలేదు. కానీ తమకు నచ్చిన కళాశాలలకు ఫీజులు పెంచుకునే అవకాశాన్ని కల్పించి.. మరికొన్ని కళాశాలలకు మొండి చేయి చూపిందని ప్రభుత్వం తెలిపింది. ఈ నేపథ్యంలో ప్రస్తుతం ఆ నివేదిక పరిశీలనతో పాటు ఇంజనీరింగ్ కళాశాలల్లో అందుతున్న విద్యా ప్రమాణాలను మదింపు చేసి ఫీజులపై నిర్ణయం తీసుకునేందుకు ఒక కమిటీని నియమించాలని ప్రభుత్వం నిర్ణయించింది. అదే సమయంలో ఇంజనీరింగ్ కళాశాలలో ప్రవేశాలకు సంబంధించిన కౌన్సెలింగ్ ప్రక్రియను నిర్దేశిత సమయంలోనే పూర్తి చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

178 ఇంజనీరింగ్ కాలేజీలు 1,19,600 సీట్లు

- నేటి నుంచే ఎప్‌సెట్ కౌన్సెలింగ్
- 18న తొలివిడత సీట్ల కేటాయింపు
- 25 నుంచి రెండో విడత కౌన్సెలింగ్
- 57 రోజులు కొనసాగనున్న ప్రక్రియ

హైదరాబాద్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ఇంజనీరింగ్, ఫార్మసీ, వ్యవసాయ కాలేజీల్లో యూజీ (అండర్ గ్రాడ్యుయేట్) కోర్సుల్లో ప్రవేశాలకు సంబంధించిన ఎప్‌సెట్-2025 కౌన్సెలింగ్ షెడ్యూల్ విడుదలైంది. శనివారం (28వ తేదీ) నుంచే రిజిస్ట్రేషన్లు ప్రారంభం అవుతున్నాయి. గత ఏడాది ఫీజులే ఈ విద్యా సంవత్సరంలోనూ కొనసాగనున్నాయి. శుక్రవారం ఉన్నత విద్యామండలి కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఎప్‌సెట్ కన్వీనర్ శ్రీదేవసేన, ఉన్నత విద్యామండలి చైర్మన్ బాలకిష్టారెడ్డి, వైస్ చైర్మన్లు పురుషోత్తం, ఎస్‌కే.మహమూద్, జేఎన్టీయూ అధికారులు పాల్గొని చర్చించారు. అనంతరం షెడ్యూల్ ప్రకటించారు. మొత్తం మూడు విడతల్లో 57 రోజుల పాటు కౌన్సెలింగ్ కొనసాగనుంది. ఆగస్టు 23న స్పాట్ అడ్మిషన్లతో ప్రక్రియ ముగుస్తుంది. జూలై రెండో వారంలో బీ-క్యాటగిరీ (యాజమాన్య కోటా) సీట్లకు నోటిఫికేషన్ జారీ చేయనున్నారు.

కొత్తగా 3 ప్రభుత్వ వర్సిటీ కాలేజీలు..

గత ఏడాది మొత్తం 175 కాలేజీల్లో 1,18,880 సీట్లు ఉండగా.. ఈసారి మూడు యూనివర్సిటీ కాలేజీల్లో అదనంగా 720 సీట్లు అందుబాటులోకి వచ్చాయి. ఇందులో హుస్నాబాద్‌లోని శాతవాహన వర్సిటీ ఇంజనీరింగ్ కాలేజీలో 240 సీట్లు, మహబూబ్‌నగర్‌లోని పాలమూరు వర్సిటీ ఇంజనీరింగ్ కాలేజీలో 180, కొత్తగూడెంలోని ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీలో 300 సీట్లు ఉన్నాయి. దీనితో మొత్తం ఇంజనీరింగ్ కాలేజీల సంఖ్య 178కి, సీట్ల సంఖ్య 1,19,600కి చేరింది. మొత్తం 47 బ్రాంచిలలో ఈ సీట్లున్నాయి. గత ఏడాది మొత్తం 1,18,880 సీట్లకుగాను 1,06,880 సీట్లు భర్తీ కాగా, 12,000 సీట్లు మిగిలిపోయాయి.

కౌన్సెలింగ్ షెడ్యూల్ ఇలా..

మొదటివిడతలో జూన్ 28 నుంచి జూలై 7: ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్, స్లాట్ బుకింగ్
జూలై 1-7: విద్యార్థుల ధ్రువపత్రాల తనిఖీ, **జూలై 6-10:** ఆన్‌లైన్‌లో ఆప్షన్ల ఎంపిక, ఫ్రీజింగ్, **జూలై 14-15:** ఆప్షన్లలో మార్పులు, చేర్పులకు అవకాశం, **జూలై 18:** మొదటి విడత సీట్ల కేటాయింపు, **జూలై 18-22:** ట్యూషన్ ఫీజు చెల్లింపు, ఆన్‌లైన్‌లో సెల్ఫ్ రిపోర్టింగ్

- రెండో విడతలో జూలై 25న రిజిస్ట్రేషన్, స్లాట్ బుకింగ్.. 26న ధ్రువపత్రాల తనిఖీ.. 26, 27 తేదీల్లో ఆప్షన్ల ఎంపిక.. 27న ఆప్షన్ల ఫ్రీజింగ్.. 30న సీట్ల కేటాయింపు ఉంటాయి. జూలై 30 నుంచి ఆగస్టు 1 వరకు ట్యూషన్ ఫీజు చెల్లింపు, ఆన్‌లైన్‌లో సెల్ఫ్ రిపోర్టింగ్.. జూలై 30 నుంచి ఆగస్టు 2 వరకు కాలేజీల్లో రిపోర్ట్ చేయాలి.
- చివరి విడతలో ఆగస్టు 5న రిజిస్ట్రేషన్, స్లాట్ బుకింగ్.. 6న ధ్రువపత్రాల తనిఖీ.. 6, 7 తేదీల్లో ఆప్షన్ల ఎంపిక.. 7న ఆప్షన్ల ఫ్రీజింగ్.. 10న సీట్ల కేటాయింపు ఉంటాయి. 10 నుంచి 12వ తేదీ వరకు ట్యూషన్ ఫీజు చెల్లింపు, ఆన్‌లైన్‌లో సెల్ఫ్ రిపోర్టింగ్.. 11 నుంచి 13వ తేదీ వరకు కాలేజీల్లో రిపోర్ట్ చేయాలి.
- ఆగస్టు 18 నుంచి 23వ తేదీ వరకు 'ఇంటర్నల్ స్లైడింగ్ (కళాశాలలో వివిధ బ్రాంచీల్లో ఖాళీగా ఉన్న సీట్లలోకి అదే కాలేజీలోని ఇతర బ్రాంచీల వారు మారే అవకాశం)' ఉంటుంది.
- ఆగస్టు 23న స్పాట్ అడ్మిషన్ల ప్రక్రియ చేపడతారు.

బీఆర్ఎస్ నేతలే సిగ్గుపడాలి!

- మావోయిస్టుల లేఖను అడ్డుపెట్టుకొని ఆదివాసీ బిడ్డను టార్గెట్ చేశారు
- పదేళ్ల పాలనలో వారు చేసిందేం లేదు
- ప్రజాసేవకే నా జీవితం అకింతం: సీతక్క
- ములుగు, కొత్తగూడెం జిల్లాల్లో పర్యటించిన పంచాయతీ రాజ్ మంత్రి




ములుగు/మంగపేట/చర్ల, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): గత పదేళ్ల పాలనలో ఆదివాసీలకు, ప్రజలకు బీఆర్ఎస్ చేసిందేమి లేదని పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క అన్నారు. ఆనాడు ఆదివాసీలపై దాడులు జరిగినా పట్టించుకోని నేతలు ఇప్పుడు ప్రేమ ఒలకబోస్తున్నారని విమర్శించారు. మావోయిస్టుల లేఖను అడ్డుపెట్టుకుని ఒక ఆదివాసీ బిడ్డను టార్గెట్ చేస్తున్న బీఆర్ఎస్ నేతలు సిగ్గుపడాలన్నారు. అసలు ఆ లేఖ మావోయిస్టు పార్టీ ఇచ్చిందా.. లేదా.. అన్నదానిపై స్పష్టత లేదని చెప్పారు. బీఆర్ఎస్ హయాంలో పోడు సమస్యను ఎందుకు పరిష్కరించలేదని నిలదీశారు. శుక్రవారం ములుగు జిల్లాలోని మంగపేట, ములుగు, ఏటూరునాగారం మండలాల్లో పలు అభివృద్ధి పనులకు సీతక్క శంకుస్థాపన చేశారు. ఇటు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్లలో ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాల పంపిణీలోనూ పాల్గొన్నారు. చర్ల మావోయిస్టు ప్రభావిత ప్రాంతం కావడంతో పోలీసులు పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆయా కార్యక్రమాల్లో సీతక్క మాట్లాడుతూ.. 'నన్ను ఎన్నికల్లో ఓడించాలని ఎన్నో శక్తులు పనిచేశాయి. అవే శక్తులు ఇప్పుడూ నన్ను టార్గెట్ చేస్తున్నాయి' అని వ్యాఖ్యానించారు. 49 జీవోతో ఆదివాసీలు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి.. జీవో రద్దుకు తీర్మానం పెట్టించామన్నారు. తానూ ఆదివాసీ బిడ్డనేనని, ఆదివాసీల జీవనాన్ని విధ్వంసం చేస్తే సహించేది లేదని చెప్పారు. అక్కడక్కడ కొందరు అటవీ అధికారులు దుందుడుకు చర్యలకు పాల్పడుతున్నారని.. వారిని ఉపేక్షించబోమని హెచ్చరించారు. తాను ప్రజల మనిషినని.. నిరంతరం ప్రజా సేవకే అంకితమై వారికి అండగా ఉంటానని తెలిపారు.

మీ భూములు ఎక్కడికీ పోవు!

- ఆదివాసీలు ఆందోళన చెందొద్దు: జూపల్లి

ఉట్నూర్, జూన్27 (ఆంధ్రజ్యోతి): అటవీ హక్కుల చట్టం ద్వారా గిరిజనులకు ఇచ్చిన భూములను వాపసు తీసుకోవడం జరగదని, ఈ విషయంలో ఆసిఫాబాద్ జిల్లాలోని ఆదివాసీల గిరిజనులెవ్వరూ ఆందోళన చెందొద్దని, అధైర్యపడొద్దని మంత్రి జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జీవో 49కు ఇంకా గెజిట్ విడుదల చేయలేదని ఆయన చెప్పారు. "ఆదివాసీలకు ఎట్టి పరిస్థితుల్లో హాని జరగనివ్వం. ఎవ్వరూ ఆందోళన చెందొద్దని రెండు చేతులు జోడించి కోరుతున్నాను" అని ఆయన వ్యాఖ్యానించారు. ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్‌లోని కొమురంభీం ప్రాంగణంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు చెందిన ఆదివాసీ గిరిజనుల ఆత్మీయ సమ్మేళనానికి మంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆదివాసీ గిరిజనులు పేర్కొన్న పలు అంశాలపై సమాధానమిచ్చారు.

న్యూస్ యాంకర్ స్వేచ్ఛ అనుమానాస్పద మృతి



చిక్కడపల్లి, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ టీవీ చానల్‌లో న్యూస్ యాంకర్‌గా పని చేస్తున్న స్వేచ్ఛ వొటార్కర్ (40) అనుమానాస్పద స్థితిలో మృతి చెందారు. ఆర్టీసీ క్రాస్ రోడ్డు జవహర్‌నగర్‌లోని షాలెం లతా నిలయంలోని పెంట్‌హౌస్‌లో నివాసముంటున్న స్వేచ్ఛ చనిపోయారంటూ పోలీసులకు శుక్రవారం రాత్రి 9.20 గంటల సమయంలో సమాచారం అందింది. ఈ మేరకు అక్కడికి వెళ్లి చూడగా.. స్వేచ్ఛ ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించారని పోలీసులు తెలిపారు. రాత్రి 8.30 గంటల సమయంలో ఆమె చనిపోయి ఉంటారని ప్రాథమికంగా అంచనా వేశారు. ఆమె మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. గతంలో తన తల్లిదండ్రులు శ్రీదేవి, శంకర్‌తో కలిసి పార్సిగుట్టలోని వైఎస్ఆర్ పార్కు సమీపంలో నివాసమున్న స్వేచ్ఛ.. గత నాలుగేళ్లుగా కూతురు(14)తో కలిసి వేరుగా ఉంటున్నారు. జర్నలిస్ట్ హౌసింగ్ సొసైటీ ఎన్నికల్లో కమిటీ సభ్యురాలిగా ఎన్నికయ్యారు. స్వేచ్ఛ మృతిపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు చిక్కడపల్లి ఇన్‌స్పెక్టర్ రాజునాయక్ తెలిపారు.

ఐఏఎంసీకి భూకేటాయింపు రద్దు

(మొదటిపేజీ తరువాయి)

ఉంటే ప్రభుత్వ కేసులను ఐఏఎంసీకి ఇవ్వడం వల్ల ప్రభుత్వ ఖజానాకు నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని పేర్కొంది. ప్రైవేటు సంస్థ అయిన ఐఏఎంసీకి రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం రాయదుర్గ్ గ్రామ పరిధిలోని సర్వే 83/1లో 3.70 ఎకరాల భూమిని కేటాయిస్తూ 2021లో అప్పటి ప్రభుత్వం జీవో 126 జారీ చేసింది. అలాగే ఐఏఎంసీ నిర్వహణకుగాను రూ.3 కోట్లు కేటాయించేందుకు వీలుగా 76, 365 జీవోలనూ ఇచ్చింది. దీంతోపాటు రూ.3 కోట్లకు పైగా విలువ కలిగిన ప్రభుత్వ కేసులను ఐఏఎంసీకి రిఫర్ చేయాలని పేర్కొంటూ జీవో 6ను జారీ చేసింది. అయితే భూ కేటాయింపు సహా ఇతర జీవోలను సవాల్ చేస్తూ 2023లో కోటి రఘునాథరావు, ఎ.వెంకట్రామిరెడ్డి వేర్వేరుగా హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యాలు దాఖలు చేశారు. ఈ పిటిషన్లపై జస్టిస్ కె.లక్ష్మణ్, జస్టిస్ కె.సుజనతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్ల తరఫు న్యాయవాదులు వాదిస్తూ.. అత్యంత విలువైన భూమిని ప్రైవేటు సంస్థ అయిన ఐఏఎంసీకి ఉచితంగా కేటాయించడం చెల్లదని పేర్కొన్నారు. తెలంగాణ అర్బన్ ఏరియా డెవలప్‌మెంట్ యాక్ట్-1975 చట్టంతోపాటు అనేక సుప్రీంకోర్టు తీర్పులు ప్రభుత్వ భూమిని బహిరంగ వేలం ద్వారా మాత్రమే విక్రయించాలని స్పష్టం చేస్తున్నాయని తెలిపారు. పైగా, ప్రైవేటు సంస్థ నిర్వహణకు ప్రభుత్వం ఏటా రూ.3 కోట్లు ఇవ్వడమేంటని ప్రశ్నిస్తూ.. అధిక ఖర్చుతో కూడుకున్న ఐఏఎంసీకి ప్రభుత్వ కేసులు ఇవ్వడం వల్ల ప్రజాధనం వృథా అవుతుందని అన్నారు. ఐఏఎంసీ ట్రస్ట్ డీడ్‌లో ఆస్తులను అమ్ముకునే హక్కును బోర్డ్ ఆఫ్ ట్రస్టీలకు కల్పిస్తూ నిబంధనలు పొందుపరిచారని, ఇది చట్టవ్యతిరేకమని పేర్కొన్నారు.

కేంద్ర ప్రభుత్వ కమిటీ సిఫారసుతోనే..

ప్రభుత్వం తరఫున ఏజీ సుదర్శన్‌రెడ్డి వాదిస్తూ.. సంస్థాగతమైన ఆర్బిట్రేషన్‌ను ప్రోత్సహించాలని కేంద్రం నియమించిన హైలెవల్ కమిటీ సిఫారసు చేసిందని తెలిపారు. సింగపూర్, లండన్ తరహాలో భారత్‌లో కూడా అంతర్జాతీయ ఆర్బిట్రేషన్ సెంటర్ అవసరమన్నారు. అందుకే తెలంగాణ ప్రభుత్వం ఐఏఎంసీతో ఒప్పందం చేసుకుందని, అందులో భాగంగానే భూకేటాయింపు జరిగిందని చెప్పారు. మరో ప్రతివాదిగా ఉన్న ఐఏఎంసీ సైతం ఇదే తరహా వాదన వినిపించింది. వాదనలు విన్న ధర్మాసనం.. రాష్ట్ర ప్రభుత్వం ఐఏఎంసీకి చేసిన భూకేటాయింపు ఏపీ (తెలంగాణ ఏరియా) ఏలియనేషన్ ఆఫ్ స్టేట్ అండ్ ల్యాండ్ రెవెన్యూ రూల్స్-1975, గవర్నమెంట్ ల్యాండ్ అలాట్‌మెంట్ పాలసీ- 2012కు విరుద్ధమని ప్రకటించింది. ఉచితంగా భూమి ఇవ్వాలని ఏ నిబంధనల్లోనూ లేదంది. ఐఏఎంసీ ప్రదర్శన, భవిష్యత్తుపైనా ధర్మాసనం ఆందోళన వ్యక్తం చేసింది. ఈ ఏడాది జనవరి 29 నాటికి 15 ఆర్బిట్రేషన్ కేసులు చేశారని, అందులో 11 కేసులు ఉచితంగా చేసినవేనని పేర్కొంది. 57 మీడియేషన్ కేసులు చేశారని, అందులో 17 కేసులు ఉచితంగా చేశారని తెలిపింది. ఇంత తక్కువ కేసులతో ఐఏఎంసీ తనంత తాను నిలబడుతుందా అనే అంశంపై ఆందోళనలున్నాయని వ్యాఖ్యానించింది.

విఫలం కాకూడదనే..

ప్రభుత్వం తన విధాన నిర్ణయంలో భాగంగా కొత్త సంస్థ అయిన ఐఏఎంసీకి నిధులివ్వడం బాగానే ఉన్నా.. అది నిరవధికంగా కొనసాగరాదని ధర్మాసనం పేర్కొంది. నిరంతరం నిధులు కేటాయించినా కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఐసీఏడీఆర్ ఎలా విఫలమైందో చూశామని గుర్తు చేసింది. ఐఏఎంసీ కూడా అలా కాకూడదనే తాము కోరుకుంటున్నామని, రూ.3 కోట్లు మూడేళ్లపాటు కేటాయించినా ఐఏఎంసీ తనంత తానుగా నిలబడే పరిస్థితి లేదని తెలిపింది. ఇలాంటి సంస్థలకు ఆర్థిక సాయం కొనసాగించడం రాష్ట్ర ప్రభుత్వానికి ఆచరణ సాధ్యం కాదని, వివేకవంతమైన పని కూడా కాదని స్పష్టం చేసింది. 2021 నాటి ఎంవోయూలో పేర్కొన్నట్లుగా ఐదేళ్ల తర్వాత ప్రదర్శన ఉత్తమంగా ఉంటేనే నిధులు ఇవ్వాలని, ఐఏఎంసీ ప్రదర్శనను ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్‌తో ఆడిట్ చేయించాలని ఆదేశాలు జారీ చేసింది. ఖర్చు ఎక్కువగా అయ్యేలా ఉంటే ప్రభుత్వ కేసులను ఐఏఎంసీకి ఇవ్వడం వల్ల ప్రభుత్వ ఖజానాకు నష్టం వాటిల్లుతుందని వ్యాఖ్యానించింది. మొత్తమ్మీద భూకేటాయింపు జీవోను కొట్టేసిన హైకోర్టు.. నిధుల కేటాయింపు, ప్రభుత్వ కేసుల రిఫరెన్స్ జీవోలను కొట్టేయకపోయినా పలు ఆదేశాలు జారీ చేసింది.

ఆల్మట్టికి భారీ వరద


జూరాల ప్రాజెక్టు గేట్ల ద్వారా విడుదల అవుతున్న నీరు

హైదరాబాద్/ అమరావతి/ బెంగళూరు/ ధరూరు/దోమలపెంట, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): ఎగువన మహారాష్ట్ర, కర్ణాటకల్లో కురుస్తున్న భారీ వర్షాలతో కృష్ణా నదికి వరద వస్తోంది. కర్ణాటకలో ఆల్మట్టిలోకి శుక్రవారం సాయంత్రానికి 1,15,339 క్యూసెక్కుల వరద వస్తుండగా, కిందకు 70,420 క్యూసెక్కుల నీరు వదులుతున్నారు. నారాయణపూర్ ప్రాజెక్టులో 30.64 టీఎంసీల నీటి నిల్వ ఉండగా, దిగువకు 68,498 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని జూరాల ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం 9.66 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 7.52 టీఎంసీల నిల్వ ఉంది. జూరాలకు 1.05 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా, 12 గేట్లు ఒక మీటర్ ఎత్తి 85,268 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ఎగువ నుంచి శ్రీశైలం ప్రాజెక్టు వైపు 1,08,325 క్యూసెక్కుల నీరు వస్తుండగా, జలాశయానికి 1,02,655 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదైంది. ప్రాజెక్టు నీటి మట్టం సామర్థ్యం 215.807 టీఎంసీల నిల్వ సామర్థ్యానికి 125.1322 టీఎంసీల నీటి నిల్వలున్నాయి. తుంగభద్ర జలాశయానికి 44 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. ఇక దిగువన నాగార్జున సాగర్ గరిష్ఠ నీటి నిల్వ సామర్థ్యం 312.05 టీఎంసీలకు ప్రస్తుతం 138.91 టీఎంసీలు, పులిచింతల ప్రాజెక్టు నిల్వ సామర్థ్యం 45.77 టీఎంసీలకు 23.41 టీఎంసీల నీటి నిల్వ ఉంది. కాగా రాష్ట్రంలో నాలుగు రోజుల పాటు ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు అక్కడక్కడ కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది.

ముందే నిండిన కృష్ణరాజ సాగర డ్యాం

కర్ణాటకలో కావేరి నదిపై నిర్మించిన ప్రధాన జలాశయం కృష్ణరాజసాగర డ్యాం పూర్తిగా నిండింది. జూన్ నెలాఖరుకే ప్రాజెక్టు నిండడం 84 ఏళ్ల తర్వాత ఇదే ప్రథమం. ప్రాజెక్టు గరిష్ఠ నీటి మట్టం 124.80 అడుగులు కాగా.. పూర్తి స్థాయిలో నీరు చేరింది. కేరళతోపాటు కొడగు జిల్లాలో విస్తారంగా వర్షాలు కురవడంతో జలాశయంలోకి భారీగా వరద నీరు చేరుతోంది. కావేరిపై ఉన్న హారంగి, కబిని, హేమావతి డ్యాంలు కూడా దాదాపు నిండాయి.

పీవీ విజ్ఞాన వేదిక పూర్తయ్యేదెన్నడు?

- 4 ఏళ్లుగా సాగుతున్న పనులు
- వంగరలో మంత్రులు సురేఖ, సీతక్క పర్యటన రద్దు
- నేడు పీవీ 104వ జయంతి
- రాజ్‌భవన్‌లో పీవీ చిత్రపటాన్ని ఆవిష్కరించిన గవర్నర్


పీవీ విజ్ఞాన వేదికలో అర్ధంతరంగా నిలిచిపోయిన ధ్యాన మందిర నిర్మాణం

భీమదేవరపల్లి, హైదరాబాద్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం వంగరలో మాజీ ప్రధాని పీవీ నరసింహారావు విజ్ఞాన వేదిక నిర్మాణం పనులు ఏళ్లు గడుస్తున్నా పూర్తి కావడం లేదు. శనివారం పీవీ జయంతి. ఈ సందర్భంగా మంత్రులు కొండా సురేఖ, సీతక్క ఆధ్వర్యంలో వంగరలో పీవీ విజ్ఞాన వేదికను ప్రారంభించి, పీవీ జయంతిని ఘనంగా నిర్వహించాలని భావించారు. అయితే పనులు పూర్తికాకపోవడంతో శనివారం జరగాల్సిన మంత్రుల పర్యటన రద్దయింది. వంగరలో రూ.7కోట్లు వెచ్చించి పీవీ విజ్ఞాన వేదిక ఏర్పాటు చేయాలని 2021 జనవరిలో బీఆర్ఎస్ ప్రభుత్వం సంకల్పించింది. అదే ఏడాది జూన్ 28న పీవీ శతజయంతి ఉత్సవాల నాటికి విజ్ఞాన వేదికను పూర్తి చేయాలని నిర్ణయించింది. అయితే నిధుల కొరత కారణంగా ఇప్పటికీ పనులు ముందుకు సాగడం లేదు. పీవీ ధ్యాన మందిరం, పార్కింగ్ స్థలం, ఫుట్ కోర్టు, పీవీ విగ్రహం ఏర్పాటు, విద్యుద్దీపాల ఏర్పాటు, పిల్లల ఆట స్థలం తదితర పనులు అర్ధంతరంగా ఆగిపోయాయి. కాగా వంగరలో పీవీ 104వ జయంతి వేడుకలు శనివారం నిర్వహిస్తామని పీవీ సోదరుడి కుమారుడు పీవీ మదన్‌మోహన్‌రావు తెలిపారు. కాగా పీవీ జ్ఞానభూమిలో ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట దాకా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పీవీ మనుమడు, బీజేపీ ముఖ్య అధికార ప్రతినిధి ఎన్వీ సుభాష్ వెల్లడించారు. కాగా శనివారం పీవీ జయంతి సందర్భంగా రాజ్‌భవన్‌లో ఆయన చిత్రపటాన్ని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఆవిష్కరించారు.

పీవీ సేవలు చిరస్మరణీయం: మోదీ

మాజీ ప్రధాని పీవీ జాతికి అందించిన సేవలు చిరస్మరణీయం అని ప్రధాని మోదీ అన్నారు. దేశం ఆర్థికంగా క్లిష్ట పరిస్థితిలో ఉన్న సమయంలో ప్రధానిగా ఆయన కీలక సంస్కరణలు చేపట్టారని వివరించారు. దేశ ఆర్థిక ప్రగతికి ఈ సంస్కరణలు పునాది వేశాయన్నారు. పీవీ చేపట్టిన భూసంస్కరణలు, పరిపాలనపరంగా తీసుకున్న నిర్ణయాలు ఆదర్శప్రాయమని కొనియాడారు.

పీవీ స్ఫూర్తితోనే.. యంగ్ ఇండియా గురుకులాలు: రేవంత్

పీవీ నరసింహారావు స్ఫూర్తితోనే విద్యా వ్యవస్థలో సమూల ప్రక్షాళనకు శ్రీకారం చుట్టామని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రతి నియోజకవర్గంలో అంతర్జాతీయ విద్యాప్రమాణాలతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలల నిర్మాణానికి తమ ప్రభుత్వం సంకల్పించిందని పేర్కొన్నారు. ప్రధానిగా పీవీ విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చి భారత్‌ను ప్రగతి పథంలో నడిపించారని, ఆర్థిక సంస్కరణలతో దేశ ప్రగతిని పరుగులు పెట్టించారని కొనియాడారు.

తల్లి కళ్లెదుటే టిప్పర్ చక్రాల కింద నలిగి

- ఆరేళ్ల బాలుడి దుర్మరణం


రోదిస్తున్న బాలుడి తల్లి నిహారికను ఓదారుస్తున్న ఆమె మేనమామ

దుండిగల్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): ఆరేళ్ల వయసులోనే ఆ బాలుడికి నూరేళ్లు నిండాయి. ఆ చిన్నారిని టిప్పర్ రూపంలో మృత్యువు కబళించింది. స్కూల్లో దిగబెట్టేందుకు తల్లి, స్కూటీపై తీసుకెళుతుండగా అదుపుతప్పిన ఆ వాహనం, టిప్పర్ కిందకు దూసుకెళ్లడంతో ప్రమాదం సంభవించింది. టిప్పర్ టైర్ కింద నలిగి చిన్నారి అక్కడికక్కడే మృతిచెందాడు. దుండిగల్ పరిధిలోని మల్లంపేటలో శుక్రవారం ఉదయం ఈ ఘటన జరిగింది. ప్రమాదం నుంచి తల్లి సురక్షితంగా బయటపడింది. మృతుడు అభిమన్యు రెడ్డి (6). బాలుడి తల్లిదండ్రులు గుడిపల్లి రాజిరెడ్డి, నిహారిక. నిజామాబాద్ రూరల్ మండలం కేశవపూర్ వాస్తవ్యులు. ఇద్దరూ సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు. ఐదేళ్ల క్రితం మల్లంపేటకొచ్చి ఓ ఫ్లాట్‌లో నివాసం ఉంటున్నారు. ఈ దంపతులకు కొడుకు అభిమన్యు రెడ్డితో పాటు మూడేళ్ల కూతురు దివిషా ఉంది. అభిమన్యు రెడ్డి భౌరంపేట రోడ్డులోని ఓ ప్రైవేటు స్కూల్లో ఒకటో తరగతి చదువుతున్నాడు. శుక్రవారం ఉదయం అభిమన్యును తల్లి నిహారిక తన స్కూటీ మీద ఎక్కించుకొని స్కూల్లో దిగబెట్టేందుకు బయలుదేరింది. మార్గమధ్యలో టిప్పర్‌ను ఓవర్‌టేక్ చేసేందుకు ప్రయత్నించడంతో స్కూటీ అదుపు తప్పి పడిపోయింది. తల్లి, కుమారుడు కింద పడిపోగా.. టిప్పర్ టైరు అభిమన్యు తల మీద నుంచి వెళ్లింది. నిహారిక ప్రమాదం నుంచి తృటిలో తప్పించుకుంది. ఆమెకు ఎలాంటి గాయాలు కాలేదు. పోలీసులొచ్చి బాలుడి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు ఘటనపై కేసు నమోదు చేశారు. కాగా దుండిగల్ ప్రమాదంలో బాలుడి మృతి ఘటన తనను తీవ్రంగా కలిచివేసిందని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు పేర్కొన్నారు.

ఎలక్ట్రిక్ బైక్ పేలి వృద్ధురాలి మృతి

ఎర్రగుంట్ల, జూన్ 27(ఆంధ్రజ్యోతి): ఎలక్ట్రిక్ బైక్ పేలి పక్కనే నిద్రిస్తున్న ఓ వృద్ధురాలు మృతి చెందిన ఘటన వైఎస్సార్ కడప జిల్లా ఎర్రగుంట్ల మండలం పోట్లదుర్తిలో చోటు చేసుకుంది. బాధితుల కథనం మేరకు.. పోట్లదుర్తి రెడ్డిగారివీధిలో ఉండేల ప్రదీప్‌కుమార్‌రెడ్డి కుటుంబం నివాసముంటోంది. గురువారం రాత్రి ఆయన తన ఎలక్ట్రిక్ బైక్‌ను వరండాలో చార్జింగ్ పెట్టారు. బైక్ పక్కనే మంచంపై ఆయన తల్లి వెంకట లక్షుమ్మ(62) నిద్రించారు. ప్రదీప్‌కుమార్ ఇతర కుటుంబ సభ్యులు మిద్దెపై పడుకున్నారు. తెల్లవారుజామున సుమారు 5 గంటల సమయంలో బైక్ పేలి పక్కనే మంచంలో నిద్రిస్తున్న లక్షుమ్మకు మంటలంటుకున్నాయి. గాఢనిద్రలో ఉండటంతో మంటలు అంటుకున్న కాసేపటికి గానీ ఆమె గుర్తించలేదు. సమీపంలో ఉన్న సోఫాకూ మంటలు వ్యాపించాయి. ఆమె తప్పించుకునే ప్రయత్నం చేసినా వీలు కాలేదు. వెంకట లక్షుమ్మ కేకలు విని, పొగరావడాన్ని గమనించిన కుటుంబ సభ్యులు కిందకు వచ్చి మంటలు ఆర్పారు. తీవ్రంగా గాయపడ్డ ఆమెను ఆసుపత్రికి తరలించే లోపు మృతి చెందారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రొద్దుటూరు ఆసుపత్రికి తరలించారు.

పాల్వంచ కేటీపీఎస్‌లో ప్రమాదం

- నైట్రోజన్ సిలిండర్ పేలి ఆర్టిజన్ కార్మికుడి మృతి


సుబ్బారావు (ఫైల్)

పాల్వంచ టౌన్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ కేటీపీఎస్ 5వ దశ కర్మాగారం వద్ద జరిగిన ప్రమాదంలో ఓ ఆర్టిజన్ కార్మికుడు మృతి చెందాడు. శుక్రవారం టర్బైన్ ప్రాంతంలో పనులు జరుగుతుండగా ఒక్కసారిగా నైట్రోజన్ సిలిండర్ పేలింది. దీంతో అక్కడ విధులు నిర్వహిస్తున్న పాల్వంచలోని ప్రశాంత్‌నగర్ కాలనీకి చెందిన ఆర్టిజన్ కార్మికుడు ముద్రబోయిన సుబ్బారావు (48) ప్రాణాలు కోల్పోయాడు. ప్రమాదానికి గల కారణాలపై ఆరా తీస్తున్నామని అధికారులు తెలిపారు. సుబ్బారావుకు భార్య, ఓ కుమారుడు, ఇద్దరు కుమార్తెలున్నారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84, RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.